




ESTD: 1999 www.voodayam.com

# వుదయం

ఆదిలాబాద్ | 08-04-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 323 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on







## కేరళ సీఎం విజయన్‌కు

# గాడ్‌ఫాదర్ మోడీ

### కేరళ సీఎంపై శబరిమల బంగారం చోరీ, స్మగ్లింగ్ కేసులున్నాయి





- అయినా అరెస్టులు లేవు
- కేజ్రీవాల్ సహా అనేక మంది నేతలను ఈడీ వేధించింది
- విజయన్ జోలికి ఎందుకు వెళ్లడం లేదో చెప్పాలి
- విజయన్ 120 నెలల పాలన వైఫల్యానికి ప్రతీక
- ఈ ఎన్నికల్లో కేరళలో పినరయి హయాం ముగుస్తుంది
- కేరళలో విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ చరమాంకం పలుకుతుంది
- ఈ ఎన్నికలు కేరళ.. తెలంగాణ మధ్య కాదు.. యూడీఎఫ్.. ఎల్డీఎఫ్ మధ్య
- ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి

**కేరళ :** అవినీతి కేసుల్లో అడ్డంగా దొరికిన కేరళ సీఎం పినరయి విజయన్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆ కేసుల నుంచి రక్షిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అందుకే ఎన్ని ఆరోపణలు వచ్చినా ఆయనపై కేంద్ర సంస్థలు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కేరళలో పినరయి... ఢిల్లీలో మోడీ ఇద్దరూ అన్నాదమ్ములన్నారు. విజయన్‌పై శబరిమల బంగారం చోరీ, స్మగ్లింగ్ కేసులున్నాయని ఆరోపించారు. విజయన్ గాడ్‌ఫాదర్ నరేంద్ర మోడీ ఢిల్లీలో ఉన్నారనీ ఆయనే కేసులన్నింటి నుంచి విజయన్‌ను రక్షిస్తున్నారని విమర్శించారు. కేజ్రీవాల్ సహా అనేక మంది నేతలను ఈడీ కేసులతో వేధించి అరెస్టు చేసిన వాళ్లు విజయన్ జోలికి ఎందుకు రావడం లేదని రేవంత్ రెడ్డి నిలదీశారు. నరేంద్ర మోడీ... విజయన్ ల మధ్య ఉన్న అవగాహనతోనే కేసులు, అరెస్టులు జరగడం లేదన్నారు. మోడీ... విజయన్ బంధాన్ని కేరళం ప్రజలు అర్థం చేసుకున్నారన్న రేవంత్ రెడ్డి... ఈ ఎన్నికల్లో సరైన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. తర్వలోనే కేరళంలో మార్పు వస్తుందన్నారు. కేరళలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి... అక్కడి కోవలం, మావెలికర,పతానపురంలో జరిగిన రోడ్ షో లో యూడీఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ పినరాయి విజయన్ 120 నెలల పాలన కాలం వైఫల్యానికి ప్రతీకగా నిలిచిందని సీఎం విమర్శించారు. ఈ ఎన్నికల్లో విజయన్ కు పరాభావం తప్పదన్న ఆయన ఇకపై కేరళలో పినరయి హయాం ముగుస్తోందన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందని రేవంత్ రెడ్డి స్పష్టం...

మిగతా 2లో




## ఖర్గ్ ద్వీపంపై భీషణ

# దాడులు

### ముంచుకొస్తున్న ట్రంప్ తుది గడువు

**వుదయం నెట్‌డెస్క్, (ఏప్రిల్ 7) :** ఇరాన్‌కు చెందిన భారీ చమురు నిల్వల ద్వీపం ఖర్గ్ ఐలాండ్ పై మరోసారి దాడులు జరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువు దగ్గరవుతున్న కొద్దీ ఖర్గ్, ఆ దేశంలోని ప్రధాన రహదారులు, రైల్వే వంతెనలపై అమెరికా ఇజ్రాయెల్ లు పెద్ద ఎత్తున దాడులు చేశాయని తెలుస్తున్నది. ద్వీపంలోని ఇరాన్ సైనిక లక్ష్యాలపైనా బాంబుల వర్షం కురిపించాయి. గత నెలలో కూడా అమెరికా ఓ సారి ఈ ప్రాంతంలో దాడులు చేసింది.

ఇరాన్ తీరానికి 25-30 కి.మీ దూరంలో ఖర్గ్ ఉన్నది. ఈ చిన్న ద్వీపం ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు ప్రాణం. ఇరాన్ చమురు ఎగుమతుల్లో 90 శాతం ఇక్కడి నుంచే జరుగుతుంది. ప్రస్తుత యుద్ధంలో కీలకంగా మారిన హోర్ముజ్ జలసంధిని తెరిపించడానికి వీలుగా ఇరాన్ పై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా ఖర్గ్‌పై దాడులను కేంద్రీకరించింది. అమెరికా వ్యూహాలను దీటుగా ఎదుర్కోవాలని ఇరాన్ సిద్ధపడుతోంది.

ఇన్నాళ్లు యుద్ధం ముగింపు గురించి ఓపికతో ఎదురు చూశాము..ఇక మా సహనం నశించింది అని ఇరాన్ పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ సహా వాటి మిత్ర దేశాలపై దాడులు చేస్తామని చెప్పింది. ఆయా దేశాలలోని చమురు, గ్యాస్ సరఫరాలకు ఏళ్ల తరబడి అంతరాయం కలిగిస్తామని హెచ్చరించింది. ఇరాన్ మాత్రం తొణకుండా బెణకుండా అమెరికాకు సమాధానం చెబుతున్నది. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజాములోగా హోర్ముజ్ జలసంధి దిగ్బంధనాన్ని ముగించి నౌకల రాకపోకలకు అడ్డంకులు తొలగించకపోతే ఇరాన్ ను నామరూపాలు లేకుండా చేస్తామని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఈ సవాల్ కు గట్టి సమాధానం చెప్పాలని ఇరాన్ తన యువతకు పిలుపు ఇచ్చింది. హోర్ముజ్ పై తన అధిపత్యాన్ని గుర్తించాలని, అక్కడ నౌకల నుంచి రుసుం వసూలుకు స్వేచ్ఛ ఇవ్వాలని, శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తి వినియోగించుకోవడానికి అంగీకరించాలని,అమెరికా ఇజ్రాయెల్ లు ఏకపక్షంగా చేసిన తమపై అరంభించిన ఈ యుద్ధం వల్ల కలిగిన నష్టాలకు పరిహారం చెల్లించాలని వగైరా షరతులను ఇరాన్ అమెరికా ముందు ఉంచింది.

## తమిళ ఎన్నికల్లో తెలంగాణ నేతలు

2


- సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్
- ఉత్తర్వులు జారీ చేసిన అధిష్టానం



## డీజీపీ కాన్వాయ్ ట్రయల్ రన్‌లో ప్రమాదం

2

- స్వల్పంగా దెబ్బతిన్న రెండు వాహనాలు
- కర్రెగుట్టల్లోని సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపుల పరిశీలనకు డిజిపి వెళ్లడానికి ముందు ఘటన



# మంచి మోడల్ కాలనీ

- పైరవీలకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఆస్కారం ఇవ్వం
- ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన లబ్ధిదారులు అర్హులై ఉండాలి
- అనర్హులుకు అవకాశం ఇస్తే కఠిన చర్యలు
- తొలి విడతలో 1500 మంది లబ్ధిదారుల ఎంపిక
- నిశితంగా పరిశీలనానంతరమే జాబితా విడుదల
- మోడల్ కాలనీలో 10 కోట్లతో తెలంగాణా పబ్లిక్ స్కూల్
- మరో పది కోట్లతో అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్‌తో పాటు మౌలిక సదుపాయాల కల్పన
- ఈ మాసంతానికి మోడల్ కాలనీ ప్రారంబోత్సవం
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**హుజూర్ నగర్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :** హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట సమీపంలో 116 ఎకరాల విస్తీర్ణంలో 2,160 సింగిల్ బెడ్ రూమ్ లతో నిర్మించిన మోడల్ కాలనీ తెలంగాణా రాష్ట్రానికే తలమానికం కానుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 2011 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభించిన మోడల్ కాలనీ కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖా నుండి అప్పటి మార్కెట్ రేట్ ప్రకారం ధర చెల్లించి భూమి కొనుగోలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన మోడల్ కాలనీని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా...

మిగతా 2లో

# బీఆర్ఎస్ కథ ఒడిసిన ముచ్చట

- కేసీఆర్ ఎర్రవల్లి ఫాం హౌస్‌కు పరిమితమయ్యారు
- కవిత వేరు కుంపటికి రంగం సిద్ధం చేసుకుంటోంది
- బీఆర్ఎస్‌లో వాటాలు పంచుకోలేని పరిస్థితి
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్



**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో బీఆర్ఎస్ కథ ఒడిసిన ముచ్చట అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫాం హౌస్ కు పరిమితమైతే... ఆమె బిడ్డ కవిత వేరు కుంపటికి రంగం సిద్ధం చేసుకుంటోందన్నారు. కల్వకుంట్ల ఫ్యామిలి దీన స్థితిని చూసి సంతోష్ రావు కళ్లలో ఆనందం వెయ్యి రేట్లు పెరిగిందన్నారు. ప్రస్తుత పార్టీ పరిస్థితులను చూస్తే బీఆర్ఎస్ పాలనలో అక్రమంగా సంపాదించుకున్న వాటాలు పంచుకోలేని దుస్థితి నెలకొందన్నారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించిన ఆయన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో నీళ్ల దోపిడీ..

మిగతా 2లో

### 200 యూట్యూబ్ చానెళ్లను బిఆర్ఎస్ కొన్నది : మంత్రి జూపల్లి

**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :** అక్రమంగా సంపాదించిన రూ. వేల కోట్ల డబ్బుతో బీఆర్ఎస్ పార్టీ రెండొందల యూట్యూబ్ చానెళ్లు కొనుగోలు చేసిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఆ ఛానెళ్లలో..

మిగతా 2లో

# ఇది భక్షక పాలన

- దళితులు, పేదల భూములపై సర్కార్ దండయాత్ర
- వికారాబాద్, భువనగిరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీల అసైన్డ్ భూములపై సీఎం నజర్
- ఇండస్ట్రియల్ పార్కుల పేరిట నోటిఫికేషన్లు
- ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి భూములు లాక్కొనే ప్రయత్నం
- మీడియాతో మాజీ మంత్రి హరీశ్ రావు
- పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ భూ బాధితుల పరామర్శకు వెలుతుండగా అడ్డగింత, హౌస్ అరెస్ట్



**హైదరాబాద్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో నడుస్తున్నది 'ప్రజాపాలన' కాదనీ 'భక్షక పాలన' అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలైన వికారాబాద్, భువనగిరిలో ఎక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీల అసైన్డ్ భూములు ఉంటే, అక్కడ ఇండస్ట్రియల్ పార్కులు అంటూ నోటిఫికేషన్లు ఇస్తున్న ప్రభుత్వం ఆయా ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి భూములను లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను వ్యతిరేకిస్తున్న బాధితులను పరామర్శించేందుకు మంగళవారం వెళ్తున్న ఆయన్ను పోలీసులు అడ్డుకున్నారు. హరీశ్ రావు నివాసం వద్ద భారీగా...

మిగతా 2లో

# రాష్ట్రంలో మావోయిస్టులు లేరు

- తెలంగాణ మావోయిస్టు రహితం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే ఇది సాధ్యమైంది
- ఆరుగురు మావోయిస్టులు మన రాష్ట్రంలో లేరు
- కర్రెగుట్టల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం : డీజీపీ శివధర్‌రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ.. మావోయిస్టు రహిత రాష్ట్రంగా అవతరించిందని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో మావోయిస్టులు లేరని ప్రకటించారు. నక్సలిజాన్ని రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే ఇది సాధ్యం అయిందని పేర్కొన్నారు. ఇంకా ఆరుగురు మావోయిస్టులు ఉన్నారన్న ఆయన ప్రస్తుతం వారు మన రాష్ట్రంలో లేరని అన్నారు. మిగిలిన మావోయిస్టులు కూడా పోలీసులకు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవాలని సూచించారు. మంగళవారం తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో డీజీపీ పర్యటించారు. కర్రెగుట్టలోని పాముానూరు బేస్ క్యాంప్ సమీపంలో పోలీస్ ఔట్ పోస్టును, ఇంటర్ ఏజెన్సీ కోఆర్డినేషన్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మొరుమూరు నుంచి పాముానూరు వరకు దట్టమైన అడవుల్లో రోడ్డు నిర్మాణం చేశామని, దోలి, జెల్లా, చలిమెల గ్రామాలకు రోడ్డు విస్తరణ పనులు..

మిగతా 2లో

# 148 ల.మె. టన్నుల దిగుబడి

- 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధం
- 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- అందుబాటులో రూ.16 కోట్లకు పై చిలకు గన్నీ బ్యాగులు
- అనధికార మార్గాల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించేది లేదు
- సన్నాలకు 2,389 మద్దతు ధర రూ.500 బోనస్, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధర
- రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యంపై కట్టుదిట్టమైన నిఘా : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**హుజూర్ నగర్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :** రబీ సీజన్ లో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కానుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సన్నద్ధంగా ఉందని తెలిపారు. ముందెన్నడూ లేని రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక సీజన్ కు మరో సీజన్ పోటీ పడి ధాన్యం

మిగతా 2లో

# కేరళ సీఎం విజయన్‌కు గాడ్‌ఫాదర్ మోడీ

మొదటి పేజీ తరువాయి..

చేశారు. యూడీఎఫ్ అధికారంలో రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మూడింట రెండొంతుల మెజారిటీతో యూడీఎఫ్ గెలవబ ోతోందని జోస్యం చెప్పారు. ఈ ఎన్నికలు కేరళం.. తెలంగాణ మధ్య జరగడం లేదన్న రేవంత్ రెడ్డి... యూడీఎఫ్.. ఎల్డీఎఫ్ మధ్య జరుగుతున్నాయని చెప్పారు. పినరయి విజయన్‌కి రోల్ మోడల్స్ జ్యోతిబసు, సోమనాథ్ ఛటర్జీలా? లేక నరేంద్ర మోదీ, అమిత్ షానా? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కానీ, ఆయన నరేంద్ర మోడీని తన రోల్ మోడల్‌గా భావిస్తున్నారన్నారు. ఆయన పద్ధతులు కేరళ ప్రజలకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని విమర్శించారు. విజయన్ ఓ ముఖ్యమంత్రిలా కాకుండా, మరో నరేంద్ర మోడీ తరహాలో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

తాము ఏం చేస్తున్నామో అదే చెబుతున్నామన్నారు. తెలంగాణలో మాదిరే కేరళలోనూ అభివృద్ధి.. మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ నియామకాలు... స్వీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామని సీఎం హామీ ఇచ్చారు. పినరాయి విజయన్‌తో పాటు కేరళం కమ్యూనిస్టు మహిళా నాయకులను తెలంగాణకు ఆహ్వానించిన రేవంత్.. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణలోని ఏ మూలకైనా వెళ్లి తెలంగాణలో తాము అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించవచ్చని తెలిపారు. ఈ విషయంలో విజయన్‌కు సవాల్ విసురుతున్నట్లు ప్రకటించారు. తమ పాలనలో 67 వేల ఉద్యోగాల కల్పన, 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ. 20,670 కోట్ల రుణమాఫీ, 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. గతంలో పినరాయి విజయన్ సన్నిహిత మిత్రుడు కేసీఆర్ సీఎంగా ఉన్నారని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆయన లేఖలోని తప్పులన్నీ బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయన్న ఆయన అందుకే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను గద్దెదించారన్నారు. ఇప్పుడు కేరళం ప్రజలు విజయన్‌ను మార్చివేస్తారని సెటైర్లు వేశారు.

కేరళ యువతకు కష్టపడే తత్వం ఉందని సీఎం రేవంత్ కొనియాడారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో ఈ రాష్ట్ర యువత కృషి ఎనలేనిదన్నారు. కేరళలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) సర్కార్‌కు ముగిసిందని.. ఇక పినరయి విజయన్ ప్రభుత్వం పదవి అయిపోయిందని జోస్యం చెప్పారు. కేరళంలో యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేరళ అభివృద్ధిలో కరరుణాకరణ్, ఊమెన్ చాందీ పాత్ర ఉందని.. కానీ పినరయి విజయన్ మాత్రం తానే అభివృద్ధి చేసినట్లు చెప్పుకుంటున్నారని తెలిపారు.

**శబరిమల ఆలయం నుంచి తరలించినా బంగారం లెక్కలు ఎందుకు చెప్పలేదు..?**

కేరళం రాష్ట్రం ఇప్పటివరకు సాధించిన విజయాలన్నీ గతంలోని యూడీఎఫ్ ప్రభుత్వాల పనితీరు ఫలితమేననే విషయాన్నిగుర్తించాలని కేరళం ముఖ్యమంత్రి పినరాయి విజయన్ కు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఎల్డీఎఫ్ వరుసగా రెండు సార్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వాల హయాంలో ఏం జరిగిందో కేరళం ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. తనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదని కేరళం ముఖ్యమంత్రి విజయన్ రాసిన లేఖకు సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ప్రత్యుత్తరం రాశారు. కేరళం ప్రభుత్వ పనితీరుపై తాను గౌరవంగా, హుందాగా స్పందించాలని అనుకున్నానని చెప్పారు. కానీ మీ ప్రతిస్పందనలో మాత్రం మీరు



అభ్యంతరకరమైన భాషను ఉపయోగించారని విజయన్‌ను ఉద్దేశించి సీఎం పేర్కొన్నారు. ప్రత్యర్థుల తొందరపాటు వ్యాఖ్యలపై తానెప్పుడూ ఆవేశపూరితంగా స్పందించనని సీఎం చెప్పారు. మీరు తెలంగాణ రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి ఇవ్వాల్సిన గౌరవ, మర్యాదను ఇస్తానని విజయన్‌కు రేవంత్ రెడ్డికు లేఖలో వివరించారు.

**పదే పదే తప్పుడు ఉదాహరణ...**

నీతి ఆయోగ్ ఎస్డీజీ సూచిక 2023–24పై తెలంగాణ రాష్ట్రానికి తప్పుడు విధంగా విజయన్ పదే పదే ఉదహరిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆ సమయంలో తెలంగాణలో అధికారంలో ఉన్నది ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కాదన్నారు. అది పదేళ్ల బీఆర్ఎస్–బీజేపీ పదేళ్ల దుష్పరిపాలన చివరి దశ అని విజయన్‌కు సీఎం తెలియజేశారు. తెలంగాణలో తమ ప్రజా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకున్నందున ఈ కాలంలో తమ పని తీరు ఆధారంగా తమని అంచనా వేయాలని కేరళం ముఖ్యమంత్రి విజయన్‌ను రేవంత్ రెడ్డి కోరారు. 2024–25లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా నమోదైందని, ఇది 10.7శాతం వృద్ధి రేటుతో జాతీయ సగటు 9.9శాతం కంటే ఎక్కువని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.87 లక్షలకు చేరుకుందని, ఈ గణాంకాల ఆధారంగా తెలంగాణ భారతదేశంలోనే ముందు స్థానంలో నిలిచిందని సీఎం స్పష్టం చేశారు. ఆర్‌బీఐ హ్యాండ్‌బుక్ 2024–25 గణాంకాల ప్రకారం కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళం రాష్ట్రాలను తెలంగాణ అధిగమించిదన్నారు...

**పేదరికాన్ని నిర్మూలించారా?**

2025, చివరి నాటికి తీవ్ర పేదరికాన్ని (ఎక్స్‌ట్రీమ్ పావర్టీ) పూర్తిగా నిర్మూలించిన మొదటి రాష్ట్రంగా కేరళం నిలవనుందని మీరు ట్వీట్ చేశారని కేరళం ముఖ్యమంత్రి విజయన్‌కు రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇది 2026, ఏప్రిల్ నెల, కానీ మీరు రాసిన లేఖలో 64,006 కుటుంబాలు ఇప్పటికీ పథకాలను పొందుతున్నాయని పేర్కొన్నందున మీరు పేదరికాన్ని నిర్మూలించారా అని సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. 2025, నవంబర్ 1వ తేదీ నాటి మీ ప్రకటన ఎందుకు ఆచరణలోకి రాలేదని విజయన్ ను సీఎం ప్రశ్నించారు.

**ఆ కేసుల సంగతేంటి?**

నీతి ఆయోగ్ కరప్షన్ ర్యాంకింగ్‌లను తాను గౌరవిస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అదే సమయంలో విజయన్ చెప్పినట్లు కేరళం ప్రభుత్వం స్వచ్ఛమైనదైతే బంగారు స్మగ్లింగ్ వ్యవహారంలో మీ కార్యాలయంలోని ఉన్నతాధ ికారులు, కీలకమైన వ్యక్తులకి సంబంధాలున్నాయని డాక్యుమెంట్లతో సహా నిరూపించబడిన ఆ కేసు ఎందుకు అపరిష్కృతంగా మిగిలిపోయిందని విజయన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శబరిమల అయ్యప్ప ఆలయం నుంచి 4.5 కిలోల బంగారం అక్రమ తరలింపు ఆరోపణలకు ఎందుకు జవాబు చెప్పడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

తెలంగాణ రైజింగ్ దార్శనికతతో ముందుకు... తమ ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతతో ముందుకు వెళుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ సమీపంలోని ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్‌లోని జాతీయ పారిశ్రామిక కారిడార్ వంటివి నిర్మించి ఒక దశాబ్దంలోనే రూ.1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా తాము ముందుకు వెళుతున్నట్లు సీఎం స్పష్టం చేశారు. అలాగే కేరళంలో రాబోయే కొద్ది రోజుల్లో ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం 'నవ కేరళం' దార్శనికతను అమలు చేస్తుందని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేరళం ప్రజలు త్వరలోనే ఈ మేరకు నిర్ణయం తీసుకుంటారని, జరగాల్సినది కూడా అదేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## తమిళనాడు ఎన్నికల్లో తెలంగాణ నేతలు

**స్టార్ క్యాంపెయినర్లుగా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్**

**ఉత్తర్వులు జారీ చేసిన అధిష్టానం**

**తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ పొత్తు**

**ఆయా పార్టీ అభ్యర్థులకు మద్దతుగా టీ కాంగ్రెస్ నేతల ప్రచారం**

**హైదరాబాద్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ఏఐసీసీ వ్యూహాత్మకంగా ముందుకువెళ్తున్నది. ఈ మేరకు అక్కడి ఎన్నికల ప్రచారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఇందులో భాగంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నాయకులను ప్రచార రంగంలోకి దించింది. తమిళనాడులో డీఎంకేతో పొత్తులో భాగంగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలను 'స్టార్ కంపెయినర్ల'గా నియమిస్తూ అధిష్టానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా, పార్టీ వ్యూహరచనలో కీలకమైన బాధ్యతలను కూడా ఏఐసీసీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అప్పగించింది. ఆయన తమిళనాడులో కాంగ్రెస్ పోటీ చేస్తున్న మొత్తం 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 12 నియోజకవర్గాలకు సీనియర్ పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు. అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, బూత్ స్థాయి పర్యవేక్షణ వంటి కీలక అంశాలను ఆయన పర్యవేక్షించనున్నారు. ఇదిలావుంటే.. ఈ నెల 23న తమిళనాడు అసెంబ్లీకి పోలింగ్ జరగనుంది. డీఎంకే–కాంగ్రెస్ కూటమి ఈ ఎన్నికల్లో గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిల నాయకత్వ పటిమ, తమిళనాడు ఎన్నికల్లోనూ కూటమికి కలిసి వస్తుందని అధిష్టానం భావిస్తోంది. ఈ నాయకుల రాకతో తమిళనాడులో కాంగ్రెస్ ప్రచారంలో జోరు పెరగడమే కాకుండా, కార్యకర్తల్లో నూతనోత్సాహం నిండుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## బీఆర్ఎస్ కథ ఒడిసిన ముచ్చట

మొదటి పేజీ తరువాయి..

పేరిట రూ. 1.20లక్షల కోట్లు గోదావరి పాలు చేశారని ఆరోపించారు. గత పాలకుల అవినీతి, ధన దాహానికి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోచే పరిస్థితి దాపురించిందన్నారు. కాళేశ్వరం దగ్గర ఇచ్చిన ప్రెసెంటేషన్ లో కేవలం 86వేల ఎకరాలే ఈ ప్రాజెక్ట్ కింద సాగునీరు అందిందని ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా పని చేసిన మురళీధర్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. అయినా కాళేశ్వరం ప్రాజెక్ట్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ అని దాని కింద రూ. 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నాయని కేటీఆర్ ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. అబద్ధాలు ఆడడంలో ఆయనకు నోబెల్ ప్రైజ్ ఇవ్వొచ్చని చురకలంటించారు. బీజేపీని తెలంగాణ ప్రజలు నమ్మారన్న మహేశ్ కుమార్ గౌడ్... అంబానీ, అదానీలకు దోచిపెట్టడమే ప్రధానమంత్రి మోదీ పని అన్నారు. కులగణనతో పాటు బీసీ సామాజిక వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం చేసిన ఘనత కాంగ్రెస్ కే దక్కిందన్నారు. పార్టీలోనూ ఆయా వర్గాలకు పెద్ద పీట వేస్తోందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కార్యవర్గంలో కూడా సామాజిక న్యాయం పాటించిందన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించి రైతుల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడం సర్కార్ లక్ష్యమన్నారు. ప్రాజెక్ట్ పనుల కోసం కేంద్రం నుంచి నిధులు, సహకారం లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తోందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోందన్న ఆయన పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే సాగు, తాగునీరు, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

**200 యూట్యూబ్ చానెళ్లను బిఆర్ఎస్ కొన్నది : మంత్రి జూపల్లి**

ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వీటిలో ప్రసారమవుతున్న వార్తలను ప్రజలు నమ్మే అవకాశం లేకపోలేదన్నారు. సోషల్ మీడియాను కూడా విరివిగా వినియోగించుకున్న బీఆర్ఎస్.. ప్రభుత్వంపై బురదజల్లుతోందని ఆరోపించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. దేశంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పదవుల వెంట వెళ్లొద్దని, పదవులే మీ వెంట వస్తాయని మంత్రి కార్యకర్తలకు సూచించారు. మంత్రాలకు చింతకాయలు రాలవని గుర్తించాలని, కూర్చున్న వద్ద నుంచే మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకోరాదని, ఫీల్డ్ లోకి వెళ్లి పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 2029 లో కేంద్రంలో రాహుల్ ప్రధాని కావాలన్నా, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావాలన్నా కార్యకర్తల పాత్ర ముఖ్యమన్నారు. పార్టీని బూత్ లెవెల్ నుంచి బలోపేతం చేయాలన్నారు. ప్రతి బూత్ లెవెల్ కార్యకర్త రోజుకు గంట సేపు కేటాయించి ప్రజల సమస్యలు విని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

## రాష్ట్రంలో మావోయిస్టులు లేరు

మొదటి పేజీ తరువాయి..

జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఆదివాసీల అభివృద్ధి ధ్యేయంగా వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. పామూనూరు గ్రామస్థులకు అత్యవసర సమయాల్లో ఉపయోగపడేందుకు ఆటో, ద్విచక్ర వాహనాన్ని అందించామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. వెనుక ఉన్న వ్యక్తులకు సైతం హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణించడంతో రోడ్డు ప్రమాదాలు జరిగితే రక్షణగా ఉంటుదన్నారు. కారు ఇతర వాహనాలు నడిపే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం అని కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు ఇంట్లో ద్విచక్రవాహనం నడిపే వారికి తప్పనిసరిగా హెల్మెట్ దరించేలా వివరించాలని అన్నారు. అనంతరం గ్రామస్థులకు హెల్మెట్లను అందజేశారు. అరైవ్ అలైవ్ అనే కార్యక్రమం పోస్టర్లు ఆవిష్కరించారు. అక్కడ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్వో సువర్ణ, ఇంటెలిజెన్స్ ఐజీ విజయ్ కుమార్ సీఆర్పీఎఫ్ ఐజీ విక్రమ్, ఎస్టి ఐజీ సుమతి , ఎస్పీ సుధీర్ రామ్ నాద్ కేకన్. డీఎఫ్వో రాహుల్ కిషన్ జాదవ్ సీఐ ముత్యం రమేష్ ఎస్ఐ తిరుపతి రావు కృష్ణ ప్రసాద్, సతీష్,కన్నాయి గూడెం ఏటూరునాగారం మంగపేట ఎస్సై లు సిబ్బంది పాల్గొన్నారు.

## డీజీపీ కాన్వాయ్ ట్రయల్ రన్‌లో ప్రమాదం

- **స్వల్పంగా దెబ్బతిన్న రెండు వాహనాలు**
- **సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపుల పరిశీలన**
- **పోలీస్ ఔట్‌పోస్ట్‌కు భూమి పూజ**



**హైదరాబాద్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) శివధర్‌రెడ్డి కాన్వాయ్ ట్రయల్ రన్ లో అపశృతి జరిగింది. మ ంగ ళ వార ం ములుగు జిల్లా వెంకటాపురం సమీపంలో జరిగిన ప్రమాదంలో వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర డీజీపీ పర్యటనకు ముందు భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీసులు కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే వెంకటాపురం వద్ద వాహనాలు వేగంగా వెళ్తుండగా, ఒక పోలీసు వాహనం అదుపుతప్పి ముందు వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది వాహనాలను పక్కకు తొలగించి పరిస్థితిని సమీక్షించారు. డీజీపీ పర్యటనకు సంబంధించి భద్రతా పరమైన లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్న సమయంలో ఈ ఘటన జరగడం చర్చనీయాంశంగా మారింది.

**డీజీపీ పర్యటనకు ప్రాధాన్యత..**

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి సువర్ణతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం పర్యటించారు. కర్రెగుట్టల్లోని పామునూరు సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపును పరిశీలించారు. అనంతరం పోలీస్ ఔట్‌పోస్ట్‌కు భూమి పూజ చేసి మారుమూల గ్రామలకు నిర్మిస్తున్న రోడ్లను ఆయన పరిశీలించారు. మావోయిస్టుల నుంచి కర్రెగుట్టలను స్వాధీనం చేసుకున్న వేళ డీజీపీ శివధర్ రెడ్డి పర్యటన అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

# 148 ల.మె. టన్నుల దిగుబడి

మొదటి పేజీ తరువాయి..

దిగుబడి రికార్డు స్థాయిలో పెరిగిపోతుందన్నారు. గడిచిన ఖరీఫ్ సీజన్ లో రాష్ట్రంలో దిగుబడి అయిన మొత్తం యావత్ భారత దేశంలోనే సరికొత్త రికార్డ్ నమోదు చేసుకుందని చెప్పారు. అదే సమయంలో 72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుతో పాటు ఆ ధాన్యానికి 48 గంటల్లో రూ. 19,500 కోట్లకు పైగా చెల్లింపులు చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందన్నారు. మంగళవారం సాయంత్రం హుజుర్నగర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రబి సీజన్ లో ధాన్యం కొనుగోలుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు 16 కోట్లకు పై చిలుకు గన్ని బ్యాగులను సిద్ధం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యానికి మద్దతు ధర కల్పించామని సన్నాలకు క్వింటా ఒక్కింటికి రూ. 2,389తో పాటు అదనంగా రూ.500 బోనస్, సాధారణ రకానికి రూ. 2,369 చెల్లించ నున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో రబీ వరి ఉత్పత్తి 148 లక్షల మెట్రిక్ టన్నులు మించనున్న నేపథ్యంలో, భారీ దిగుబడిని సమర్థవంతంగా నిర్వహించి రైతులు నష్టపోకుండా పూర్తి స్థాయిలో కొనుగోలు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8,251 వరి కొనుగోలు కేంద్రాలు (పీసీసీలు) ఏర్పాటు చేయబడుతున్నాయన్నారు. వీటికి ఆధునిక మౌలిక వసతులు, తగిన నిల్వ సదుపాయాలు, సక్రమ రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన వరి నిల్వ, రవాణా కోసం 16 కోట్లకు పైగా గన్నీ సంచులు ఇప్పటికే అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రతి



కొనుగోలు కేంద్రాన్ని ఒక అధికారి పర్యవేక్షణలో ఉంచి రోజువారీ కొనుగోలు, నాణ్యత తనిఖీలు, సమయానికి చెల్లింపులు, పారదర్శకతను నిర్ధారించనున్నట్లు తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రవాణాలో ఎలాంటి అవరోధాలు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. అన్ని జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల ప్రారంభాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరేలా కోత పూర్తయిన వరిని సులభంగా కేంద్రాలకు చేరవేయాలని సూచించారు. అనధికార మార్గాల్లో ధాన్యం మళ్లింపును నివారించేందుకు కఠిన పర్యవేక్షణ చర్యలు అమలులో ఉన్నాయన్నారు.

**రైతులు, మిల్లర్లకు అన్యాయం జరగనివ్వం...**

పార్బాయిల్డ్ (ఉడికించిన) బియ్యం కొనుగోలుకు సంబంధించి కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) పథకంలో ఎదురవుతున్న సమస్యలపై స్పందించిన ఆయన కేంద్ర ప్రభుత్వం ఉడికించిన బియ్యం కోటాను తగ్గించిందన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కి సరఫరా చేసే బియ్యంలో బ్రోకెన్ రైస్ శాతం విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయడంతో రైస్ మిల్లర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. నాణ్యత ప్రమాణాలను పాటించడం కష్టంగా మారిందని మిల్లర్లు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, మిల్లర్లు, కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు, మిల్లర్ల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వరి కొనుగోలు పురోగతిని సమీక్షించేందుకు త్వరలో ముఖ్యమంత్రి స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. రాబోయే రబీ సీజన్‌లో మరొక రికార్డు సాధించే దిశగా కొనుగోలు వ్యవస్థను మరింత మెరుగుపరుస్తున్నామని మంత్రి తెలిపారు. లాజిస్టిక్స్, నిల్వ, గన్నీ సంచుల పంపిణీ, నాణ్యత పర్యవేక్షణ వంటి అంశాలను పూర్తిగా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద ధాన్యం కదలికలపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని తెలంగాణ కొనుగోలు కేంద్రాలకు అనుమతించబోమని తెలిపారు. మొత్తం పంటకాలంలో రాష్ట్రానికి కేటాయించిన నదీ జలాలను సమర్థవంతంగా వినియోగించి పంటలకు సాగునీటి సరఫరా అందించినట్లు మంత్రి తెలిపారు. తెలంగాణకు చెందిన నదీ జలాల హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అన్ని వేదికలపై రాష్ట్ర హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా అరుణ్ కుమార్ దేశముఖ్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్, ఎస్.పి నరసింహ స్థానిక ఆర్ డి ఓ పాల్గొన్నారు.

## మంచి మోడల్ కాలనీ

మొదటి పేజీ తరువాయి..

ఆయన మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోడల్ కాలనీ పనులను ఉద్దేశ్య పూర్వకంగా ఆటకెక్కించిందన్నారు. ఫలితంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందన్నారు. అప్పటికే 90 శాతం మేర పనులు పూర్తి అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందన్న కోణంలో నాటి పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రావడంతో పనులు వేగవంతం చేశామన్నారు. మారుతున్న పరిస్థితిల కనుగుణంగా మోడల్ కాలనీని తీర్చిదిద్దుతున్నామని అందులో భాగంగానే భూమి కొనుగోలుకు చేసిన వ్యయం మినహాయించి మొత్తంగా ఒక్క నిర్మాణానికే రూ.125 కోట్లు వెచ్చించడంతో పాటు మరో రూ. 20 కోట్లు తాజాగా మంజూరు చేయించినట్లు ఆయన వెల్లడించారు. రూ. 10 కోట్లతో మోడల్ కాలనీలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు మరో రూ. 10 కోట్లతో ఇదే కాలనీలో అంగడి వాడి కేంద్రం, కమ్యూనిటీ హాల్,క్రీడా ప్రాంగణం, వాకింగ్ ట్రాక్,ఓపెన్ జిమ్ ఏర్పట్లతో పాటు సి.సి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఏప్రిల్ మాసంతానికి మోడల్ కాలనీ ప్రారంభోత్సవం ఉంటుందని ఆయన సూచనాప్రాయంగా వెల్లడించారు. ప్రారంబొత్సావానికి ముందే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి... అందులో మొదటి విడతలో అధికారులు 1500 మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ప్రకటించారు. అయితే అదే సమయంలో లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా పూర్తి స్థాయిలో పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు. హుజుర్నగర్ కే ఐకాన్ గా నిలబడ నున్న ఈ మోడల్ కాలనీ లబ్ధిదారుల ఎంపికలో అపోహలను ఎవరూ నమ్మొద్దన్నారు. ఎంపిక నిష్పక్షపాతంగా ఉంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన సిఫార్సులు కుడా అర్హులైన వారే ఉండాలన్నారు. అనర్హులను సిఫార్సు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుల జాబితాను ఒకటికి రెండు సార్లు నిశితంగా పరిశీలించాలని జాబితాలో ఒక్క అనర్హుడి పేరు ఉన్నా మోడల్ కాలనీ నిర్మాణ సంకల్పం దెబ్బ తింటుందని ఆయన అధికారులకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిజ నిజాలు తెలుసుకోకుండా ప్రజల్లో గందరగోళం సృష్టించి అపోహలు రేకెత్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా ఉంటుందని ఇందులో ఎలాంటి అపోహలకు ఆస్కారం ఉండదన్నారు. ఒకవేళ ఎవరికైనా అనుమానం వస్తే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్, ఎస్.పి నరసింహ స్థానిక ఆర్.డి.ఓ లతో పాటు గృహనిర్మాణ శాఖాధికారులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో అగ్రికల్చర్ వర్సిటీ అసోసియేట్ డీన్

**హైదరాబాద్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :** ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ అసోసియేట్ డీన్ గోవర్ధన్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఒక విత్తన కంపెనీ నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఈ క్రమంలో రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ కళాశాలతో పాటు, ఎల్బీనగర్‌లోని గోవర్ధన్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

## హెచ్‌ఆర్సీ ముందు మహిళా ఆత్మహత్యాయత్నం

- **పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం**
- **గాంధీనగర్ పోలీసులు వేధిస్తున్నారంటూ ఆరోపణ**



**నాంపల్లి, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్ లోని నాంపల్లిలో ఉన్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ముందు ఓ మహిళ ఆ త్మహ త్యకు య త్నించింది. మ ంగ ళ వార ం క మిష న్ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటుండగా పోలీసులు అడ్డుకున్నారు. కవాడిగూడలో శ్రావణి అనే మహిళ తన కుటుంబంతో కలిసి నివసిస్తోంది. గాంధీ నగర్ పోలీసులు తనని వేధిస్తున్నారని కమిషన్ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని సదరు మహిళ ఆత్మహత్యకు యత్నించింది. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు అడ్డుకొని పెట్రోల్ బాటిల్ ను లాక్కున్నారు .సదరు మహిళను కమిషన్ చైర్మన్ వద్దకు హెచ్ ఆర్ సి సిబ్బంది తీసుకెళ్లారు. అక్కడ మహిళా ఫిర్యాదును స్వీకరించిన కమిషన్ ఛైర్మన్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆమె అక్కడ్నుంచి వెళ్లిపోయింది.

## రూ.64.35 లక్షల డ్రగ్స్ స్వాధీనం

- **చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీసుల జాయింట్ ఆపరేషన్**
- **ఐదుగురు నిందితులు అరెస్ట్**

**హైదరాబాద్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ భారీ మొత్తంలో పట్టుబడ్డాయి. డ్రగ్స్ సరఫరా అవుతుందనే పక్కా సమాచారంతో మంగళవారం జాయింట్ ఆపరేషన్ నిర్వహించిన చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీసులు రూ.64.35 లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో డ్రగ్స్‌తో పాటు రూ.50వేల నగదు, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులు గతంలో ఉద్యోగాలు చేశారని, ఆ తర్వాత టైల్స్ వ్యాపారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ వ్యాపారంలో నష్టం రావడంతో ఆ తర్వాత డ్రగ్స్ వ్యాపారంలోకి వచ్చారని చెప్పారు.

# ఇది భక్షక పాలన

మొదటి పేజీ తరువాయి..

పోలీసు బలగాలను మోహరించి, ఆయన బయటకు రాకుండా అన్ని మార్గాలను మూసివేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. దళితులు, పేద వర్గాల భూములపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు దండయాత్ర చేస్తోందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం, ప్రశ్నించే హక్కు అని మాట్లాడే రేవంత్ రెడ్డి ప్రభుత్వం, శాంతియుతంగా సమావేశం ఏర్పాటు చేసుకున్న కళ్లాపూర్ వద్ద టెంట్లను పీకేయడం, మహిళలను అరెస్టు చేయడం దారుణమన్నారు. నాడు ఇందిరమ్మ పంపిణీ చేసిన భూములను, నేటి ఇందిరమ్మ పాలనలో గద్దల్లా వాలి లాక్కోవడం దారుణమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలన్నీ కేవలం భూముల చుట్టూనే తిరుగుతున్నాయన్న ఆయన.. మూసీ, హైడ్రా, లగచర్ల నుంచి పరిగి వరకు పేదల ఇళ్లు, భూములపైనే దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పరిశ్రమల కోసం సిద్ధంగా ఉన్న భూములను వదిలేసి, పేదల పొట్ట కొట్టి సాగు భూములను సేకరించడం వెనుక భారీ కుట్ర ఉందని విమర్శించారు.

**భూములు తిరిగి ఇచ్చే వరకు పోరాటం..**

22ఏ నిషేధిత జాబితాను తక్షణమే రివ్యూ చేసి ఎత్తివేయాలని, ఇండస్ట్రియల్ నోటిఫికేషన్ ఉపసంహరించుకుని రైతులకు భూములు తిరిగి ఇవ్వాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అప్పటి వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని



ఆయన స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లాకు సీఎం, స్పీకర్ ఉన్నా, అది జిల్లాకు శాపంగా మారిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ లకు భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని, ఒకవేళ ప్రాజెక్టుల కోసం భూములను సేకరిస్తే పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని హరీశ్ రావు గుర్తు చేశారు. కానీ నేడు అందుకు విరుద్ధంగా, ఎకరాకు రూ. కోటి విలువ ఉన్న భూమిని కేవలం రూ.10 లక్షలకో, రూ.20 లక్షలకో గుంజుకుంటున్నారని ఆరోపించారు.

**కచ్చితంగా పరిగి వెళ్లి తీరుతా..**

కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీలకు భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని, ఒకవేళ ప్రాజెక్టుల కోసం భూములను సేకరిస్తే పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని హరీశ్ రావు గుర్తు చేశారు. కానీ నేడు అందుకు విరుద్ధంగా, ఎకరాకు కోటి రూపాయల విలువ ఉన్న భూమిని కేవలం రూ.10 లక్షలకో, రూ.20 లక్షలకో గుంజుకుంటున్నారని ఆరోపించారు. 'పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరిట రైతులు భూములు కోల్పోతున్నారు. తాము భూములు ఇవ్వలేమని వారు కన్నీరుమున్నీరవుతుంటే, అసెంబ్లీ స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి భక్షకుడిలా మారారు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. పోలీసులు తనను అడ్డుకోలేరని, ఖచ్చితంగా పరిగి వెళ్లి తీరుతానని హరీశ్ రావు స్పష్టం చేశారు.



# గ్రేటర్ హైదరాబాద్



## చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా వీడ్కోలు సభ



**చేవెళ్ల, ఏప్రిల్ 7 (వుదయం) :** చేవెళ్ల మున్సిపాల్టీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సభను ప్రథమ,ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరి సమత వెంకట్ రెడ్డి, విద్యార్థులకు భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనతో చదువుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. కాంచనలత అధ్యక్షతన, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల భావోద్వేగ ప్రసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. సభ అనంతరం మున్సిపల్ కౌన్సిలర్లు అధ్యాపకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు తీసుకొని బంగారు భవిష్యత్‌కు భాగస్వాములు కావాలి అన్ని వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, కృష్ణా నాయక్, మధుసూదన్ రెడ్డి, మణిషా రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, డా.ఎం.ఏ. మాలిక్, ఎ. కవిత అధ్యాపకులు పాల్గొన్నారు.

## కారె శేఖర్ కుమారుడిని పరామర్శ



**షాద్ నగర్, ఏప్రిల్ 07 (వుదయం):** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మామిడిపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు కారె శేఖర్ కుమారుడు రాహుల్‌ను కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆసుపత్రిలో పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారు. ఈ సందర్భంగా రాహుల్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## హరీష్ రావు అరెస్ట్ అప్రజాస్వామికం

**షాద్ నగర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్**



**షాద్ నగర్, ఏప్రిల్ 07 (వుదయం):** పెద్ద షాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న మాజీ మంత్రి హరీష్ రావుని కలిసి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుంటోందని తీవ్రంగా విమర్శించారు. ప్రజల కోసం పోరాడే నాయకుడైన హరీష్ రావు గారిపై ఇలాంటి చర్యలు తీసుకోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు ఆయన సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధమనకాండను సహించేది లేదని హెచ్చరించారు..

## జీవో ఎంఎస్ నె.15/2009ను పునరుద్ధరణ చేయాలి

**జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్**



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 7 (వుదయం ప్రతినిధి ):** ఖైరతాబాద్‌లోని హెచ్ ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి భవనం లోని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ని జాతీయ ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముదిరాజ్, ముత్రాసి, తెనుగు సమాజాలను బీసీ డి నుండి బీసీ ఏ గా పునర్వర్గీకరణ చేయడానికి సంబంధించిన జీవో ఎంఎస్ నం.15/2009 పునరుద్ధరణ అంశంపై వారితో విస్తృతంగా చర్చించారు. ఈ జీవోను తక్షణమే పునరుద్ధరించి అమలు చేయాలని కోరారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

**ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**చేవెళ్ల, ఏప్రిల్ 7 (వుదయం) :** చేవెళ్ల మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య మరియు మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరి సమత వెంకట్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న నిర్వహించే ప్రపంచ ఆరోగ్య దినోత్సవం మన ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందని తెలిపారు."ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన సూచించారు.ఆరోగ్యం అనేది మనిషి జీవితంలో అత్యంత విలువైన సంపద అని పేర్కొన్న ఆయన, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా సమానంగా ముఖ్యమని అన్నారు.ప్రస్తుత వేగవంతమైన జీవితంలో ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిరోజూ వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, తగిన నిద్రపోవడం వంటి ఆరోగ్యకర అలవాట్లు అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని, గ్రామీణ ప్రాంతాల్లో ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు.

ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు."మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, కుటుంబం మరియు సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచే దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, పార్టీ సీనియర్ నాయకులు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## స్వేరో యువకుడికి 'దళిత రత్న' అవార్డు

**రవీంద్రభారతిలో ఘన సన్మానం**



**శంకర్‌పల్లి, ఏప్రిల్ 07 (వుదయం)** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించిన బాబు జగజీవన్ రామ్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలం మియాఖాన్ గడ్డ గ్రామానికి చెందిన తూర్పు కార్తీక్ స్వేరోకు ప్రతిష్టాత్మక 'దళిత రత్న' అవార్డు లభించడం విశేషంగా నిలిచింది. రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేయడం ద్వారా గ్రామానికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. బాబు జగజీవన్ రామ్ సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేలా వేడుకలను నిర్వహించారు. సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటున్న వ్యక్తికి రాష్ట్రస్థాయిలో గౌరవం దక్కడం గ్రామస్తులకు గర్వకారణమైంది. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవాల కోచైర్మన్ డి. సుదర్శన్ బాబు తో పాటు ఇతర ప్రముఖులు కార్తీక్ స్వేరోకు 'దళిత రత్న' అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలకు అండగా నిలుస్తున్న కార్తీక్ స్వేరోను గుర్తించి ఈ అవార్డు ఇవ్వడం విశేషమని వక్తలు పేర్కొన్నారు. స్వేరో సంస్థ ద్వారా చేపడుతున్న సామాజిక సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. రవీంద్రభారతి వేదికపై ఆయనకు లభించిన సన్మానం కార్యక్రమానికి మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు కార్తీక్ స్వేరోతో కలిసి ఫొటోలు దిగుతూ అభినందనలు తెలిపారు. అవార్డు అందుకున్న అనంతరం కార్తీక్ స్వేరో మాట్లాడుతూ బాబు జగజీవన్ రామ్ వంటి మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ పురస్కారం అందుకోవడం తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. 'పే బ్యాక్ టూ సొసైటీ' అనే నినాదంతో స్వేరో సంస్థ ద్వారా సమాజ సేవలో భాగస్వామ్యం కావడం తన అదృష్టమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు కార్తీక్ స్వేరోను అభినందిస్తూ ఆయన సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 7 (వుదయం ప్రతినిధి )** బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీ ఎం అర్ ఎఫ్ లబ్ధిదారులు సూరారం కాలనీ వాసులు ఎస్. అన్నపూర్ణ కు రూ. 45,000/, గురుమూర్తి నగర్ వాసులు మహమ్మద్ అజరుద్దీన్‌కు రూ 50,000/, లాల్ బహదూర్ నగర్ వాసులు గెహ్లావుట్ ఘనశ్యామ్ కు రూ. 60,000/, సుభాష్ నగర్ వాసులు కర్రోలు భారతి కి రూ. 60,000/, వెంకటేశ్వర కాలనీ వాసులు బొంతి కుమారి కి రూ 60,000/, క్రిషి కాలనీ వాసులు ముక్కర్ల హరీష్ కు రూ 37,500/, షాపూర్ నగర్ వాసులు గార్డన్ జ్యోతి కి రూ 60,000/, సీఎం సహాయ నిధి చెక్కులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, మాజీ కార్పొరేటర్ పాల క్రిష్ణా, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, రషీద్, సంజీవరెడ్డి, బేకు శ్రీనివాస్, బైరి ప్రశాంత్ గౌడ్, కొలన్ జీవన్ రెడ్డి, బుయ్యని శివ, సంతోష్ ముదిరాజ్, సంపంగి వెంకటేష్, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**శేర్లింగంపల్లి ఏప్రిల్ 07 (వుదయం)** శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని లింగంపల్లి డివిజన్ తారా నగర్ వీకర్ సెక్షన్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందు స్మిత దంత వైద్యశాల మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడి బోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ ఈరోజు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆవిర్భవించిన సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా డబ్ల్యూహెచ్ఓ వారు అనేక అవేర్నెస్ కార్యక్రమాలు ఒక ప్రత్యేక నినాదంతో నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి డాక్టర్ల సూచనలు సలహాలు పాటించాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ తాజా పళ్ళను, ఆకుకూరలను తీసుకోవాలని తద్వారా రోగనిరోధక శక్తిని పెంచుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్మిత దంత వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ శ్రీధర్ రెడ్డి మరియు డాక్టర్ స్వాతి డాక్టర్ భువన పాల్గొన్నారు. డాక్టర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కలుషిత ఆహారం ,నీరు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా వివిధ వ్యాయామాలతో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పిల్లలకు పెద్దలకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ మరియు అధ్యాపకులు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంకుశ వైఖరికి నిదర్శనం కాంగ్రెస్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 7 (వుదయం ప్రతినిధి ):** వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం లోని రాపోలు, కడలపూర్ గ్రామాల్లో ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ కోసం సుమారు 1200 ఎకరాల రైతుల భూములను సేకరించే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. తమ భూములను కోల్పోతున్న రైతులకు మద్దతుగా సంఘీభావం తెలపడానికి వెళ్తున్న మాజీ మంత్రి హరీష్ రావు ను మార్గమధ్యంలో అప్పా జంక్షన్ వద్ద టిప్పర్లు అడ్డుపెట్టి పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం తీవ్రంగా ఖండించదగ్గ చర్య అని, రైతుల సమస్యలను వినకుండా, రైతుల తరపున నిలబడే నాయకులను అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం అని దీనిని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా కండిస్తుందని, రైతుల తరపున నిలబడే నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం.రైతుల భూములను బలవంతంగా తీసుకునే ప్రయత్నాలను బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ వ్యతిరేకిస్తుందని, రైతులకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## లింగేశ్వరుడి సేవలో సీఎం వదిన

**ప్రత్యేక పూజలు, అభిషేకంతో ఆలయంలో భక్తి సందడి**



**శంకర్‌పల్లి, ఏప్రిల్ 07 (వుదయం)** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలిసిన 11వ శతాబ్దపు మహిమాన్విత శ్రీ బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వర స్వామి ఆలయానికి మంగళవారం విశేష ప్రాధాన్యం ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి సతీమణి మంజుల ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. భక్తుల సమక్షంలో స్వామివారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో దీపారాధన, మహా మంగళహారతి కార్యక్రమాల్లో మంజుల పాల్గొని శివుని కృప కోసం ప్రార్థనలు చేశారు.

అభిషేకం అనంతరం ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మంజులకు ఘన స్వాగతం పలికారు. స్వామివారి శేష వస్త్రాన్ని ఆమెకు అందించి సంప్రదాయబద్ధంగా సత్కరించారు. స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి ఆలయ విశిష్టతను వివరించారు. ఈ ఆలయం 11వ శతాబ్దం నాటి అరుదైన నిర్మాణ శైలితో పాటు మరకత శివలింగం మహిమతో ప్రసిద్ధి చెందినదని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ చందిప్ప గ్రామంలోని మరకత లింగేశ్వర స్వామి ఆలయం ఎంతో పవిత్రమైనదని తెలిపారు. ప్రకృతి అందాలతో నిండిన ప్రశాంత వాతావరణంలో ఇంత మహిమాన్విత శివాలయం ఉండటం నిజంగా గొప్ప విషయం అని అన్నారు. ఈ ప్రత్యేక దర్శన కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ శేఖర్, కార్యదర్శి జనార్ధన్, అన్నదాన చైర్మన్ దర్శన్ గౌడ్, అర్చకుడు ప్రమోద్‌తో పాటు పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



**చేవెళ్ల, ఏప్రిల్ 7 (వుదయం) :** ఎన్ఎస్,యుఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని చేవెళ్లలో విద్యార్థులలో చైతన్యం కలిగించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.ఇందులో భాగంగా మంగళవారం చేవెళ్ల మున్సిపాలిటీలోని చైతన్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్,యుఐ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం తెలంగాణ ఎన్ఎస్,యుఐ రాష్ట్ర అధ్యక్షులు యెడవల్లి వెంకట్ స్వామి, నేషనల్ లీగల్ సెల్ కోకన్వీనర్ అక్బర్, రాష్ట్ర కార్యదర్శి దేవలపల్లి కర్ణాకర్ గౌడ్ మరియు ఇతర నాయకుల ఆదేశాల మేరకు నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఎన్ఎస్,యుఐ చేవెళ్ల మండల కమిటీ సభ్యుడు ఎండి. సమీరుద్దీన్ మాట్లాడుతూ, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ అఫ్ ఇండియా 1971 ఏప్రిల్ 9న స్థాపించబడిన విద్యార్థి సంఘమని తెలిపారు.దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ, వారి విద్యా హక్కుల పరిరక్షణకు కృషి చేస్తోందని చెప్పారు.కళాశాలలలో ప్రజాస్వామ్య, లౌకిక విలువలను పెంపొందించడంలో ఎన్ఎస్,యుఐ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ వ్యాస రచన పోటీలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.కార్యక్రమంలో (ఎన్ఎస్,యుఐ) నాయకులు ఇర్ఫాన్, రాఫాథ్, సుదర్శన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా అభివృద్ధి పనులు



**శంకర్‌పల్లి, ఏప్రిల్ 07 (వుదయం)** శంకర్‌పల్లి మున్సిపాలిటీ రామంతపురం పరిధిలోని 7వ వార్డులో మంగళవారం అభివృద్ధి, పరిశుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. 7వ వార్డు కౌన్సిలర్ బండ్లగూడ ప్రశాంత్ ఆధ్వర్యంలో పాత డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో క్లీనింగ్ చేసి మురుగు నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు చేపట్టారు. గత కొంతకాలంగా డ్రైనేజీల్లో మట్టి, చెత్త పేరుకుపోయి నీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ పనులు చేపట్టారు. డ్రైనేజీ శుభ్రతతో పాటు కాలువలలోని చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం స్థానికంగా ప్రశంసలు అందుకుంది. అలాగే వార్డులోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలగించి రోడ్లన్నీ పూర్తిగా క్లీనింగ్ చేశారు. వర్షాలు పడితే రోడ్లపై నీరు నిలిచి ప్రమాదాలు జరగకుండా రోడ్ల పక్కన ఉన్న మట్టిని తొలగించి శుభ్రం చేశారు. పారిశుధ్య సిబ్బంది సహకారంతో రోడ్లను శుభ్రపరచడంతో ప్రజలకు నడిచేందుకు, వాహనాల రాకపోకలకు మరింత సౌకర్యం కలిగింది. కాలనీల్లో దుర్వాసన, దోమల సమస్యలు తలెత్తకుండా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ కార్యక్రమాలను కౌన్సిలర్ స్వయంగా పర్యవేక్షిస్తూ పనులు వేగంగా పూర్తి చేయించారు. ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని సహకారం అందించారు. ఇక వర్షాకాలంలో తరచూ కరెంటు సమస్యలు, ప్రమాదాలు జరగకుండా విద్యుత్ తీగలకు టచ్ అవుతున్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన ఈ చర్యను స్థానికులు హర్షంగా స్వీకరించారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడంలో ఇది కీలక చర్యగా మారిందని పలువురు పేర్కొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT:HYDERABAD**
**O.S . No. 782 of 2026**


**Between:**
**1. Racherla Manmadh Reddy ,** S/o. Late Racherla Narasimha Reddy,
**2. Racherla Aishwarya,** D/o. Late Racherla Manmadh Reddy,
**3. Racherla keerthi** D/o. Late Racherla Manmadh Reddy,
Plaintiff No.1,to 3 are R/o. H.No.2-2-12/4/A, Flat No. 203,Sai Bharath Towers, D.D. Colony, Bagh Ambeerpet, Hyderabad.
**...Plaintiff**

**AND**

1. The Tahsildar, Amberpet Mandal,
2. All Other Concerned
**...Defendants**

To,
All Concerned
Please take notice that the plaintiffs have filed suit for declaration to declare the legal status of Smt. **Late Yandapally Vinodini,** in **O.S.No. 782 of 2026** and the same is posted to **17-04-2026** at 10.30 A.M. for appearance and objections. In case anybody having any claims in the above suit, they may approach the above mentioned Hon'ble Court with their claim. Other wise the matter will be decided in ex-parte. the documents available on record.
**(BY ORDER OF THE COURT)**
Sd/-
**M/s. SUDHEER LINGALA,**
**P. JYOSTNA,**
**M. Raman Goud.**
**Advocates & Associates**
**Office:H.No.13-6-457/1**
**Pulipati Complex**
**Gayathrinagar**
**Shivbagh**
**Gudimalkapur**
**Hyderabad.**
**Ph: 9391162216,**


## అక్షర గానం.. తెలుగు పాటకు ప్రాణం




**షాద్ నగర్, ఏప్రిల్ 07 (వుదయం):** సుశీల ఆలపించిన మధుర గీతం కావచ్చు.. ఎస్ జానకి పాడిన అద్భుత గానం కావచ్చు.. చిత్ర గాన మాధుర్యం కావచ్చు.. వాణి జయరాం అందమైన గీతం అయి ఉండవచ్చు.. లతా మంగేష్కర్, ఆశా భోంస్లే గారి పాటలు ఏవైనా అవలీలగా పాడేస్తుంది.. భాష ఏదైనా దుమ్ము దులిపేస్తుంది.. పుష్కర కాలం వయసు కూడా లేని అమ్మాయి సినిమా పుట్టినప్పటి నుంచి నేటిదాకా అద్భుతః అనిపించుకున్న ఏ పాట అయినా అతి సునాయాసంగా పాడేస్తుంది.. పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టు శ్రోతలను ఇట్టే కట్టిపడేస్తోంది.. ఆ చిన్నారి మరెవరో కాదు షాద్ నగర్ సీనియర్ జర్నలిస్ట్ ఎండి ఖాజాపాషా (కేపీ) దంపతుల జన్మదిన ఉత్సవంలో తన పాటల పూదోటలో అందరినీ విహరింపజేసిన చిన్నారి అక్షర. అతి చిన్న వయసులోనే గానానికి పదును పెట్టి 12 ఏళ్ల వయసులో అద్భుతమైన పాటలను వేదికపై పాడుతూ అలరిస్తుంది. కనువిందు చేస్తుంది..

**ఎవరీ అక్షర..?**

ఈ అక్షర మరెవరో కాదు.. ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన యాదగిరి కూతురు. అయితే వృత్తిరీత్యా ఈ కుటుంబం హైదరాబాదులో స్థిరపడింది. చిన్నప్పటి నుంచి తెలుగు పాటపై ఇష్టాన్ని పెంచుకొని పాడటం మొదలు పెట్టింది. తెలుగు , హిందీ, కన్నడ, తమిళ తదితర భాషల్లో పాటలు పాడుతుంది.. క్రమంగా వేదికనెక్కి తన సత్తా చాటుతుంది. శ్రీ సరస్వతి కళా పీఠం ఆధ్వర్యంలో షాద్ నగర్ లో జరిగిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కెపితో కలిసి వెన్నెలైనా చీకటైనా పాట పాడి ఆకట్టుకుంది. అదే వేదికపై చిన్నారి పక్కన్నే ఎమ్మెల్యే శంకర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలు నిలబడి ప్రత్యక్షంగా పాటను ఆలకించి చిన్నారికి ఆశీస్సులు అందజేయడం విశేషం. పాటలను అలవుకగా చక్కగా ఆలపిస్తున్న తీరును అభినందించారు. ముఖ్యంగా హిందీలో "పంక్ హుథెతో ఉడ్ జాతీరే" పాట ఆలపించిన తీరు శోధనను విపరీతంగా ఆకట్టుకుంది. ఆరాధన సినిమాలోని అరే ఏమైంది పాటలు మరో యువ గాయకుడు క్రాంతి తో కలిసి పాడి శభాష్ అనిపించుకుంది. ప్రస్తుతం రాజధానిలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగిన తనకు ఆహ్వానం అందగానే హాజరై తన పాటలతో ఈ చిన్నారి పరవశింప చేస్తుంది. తాజాగా కేపీ జన్మదిన ఉత్సవంలో కూడా ఆయనతో కలిసి వెన్నెలైనా.. చీకటైనా.. అన్న పాటను పాడి అలరించింది. ఈ చిన్నారి ప్రతిభకు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి అబ్బురపడి చూశారు. బాలిక ప్రతిభను ప్రశంసించి ఆశీస్సులు అందించారు. ఈ చిన్నారి గానాన్ని విని ఎంతో పరవశించిపోయామని, ఇలాంటి మంచి కార్యక్రమానికి రావడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని పలువురు అభిప్రాయపడ్డారు.

## మాక్ యుఎన్‌ఓలో మెరిసిన విద్యార్థిని



**చేవెళ్ల, ఏప్రిల్ 7 (వుదయం) :** చేవెళ్ల మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని మాక్ యునైటెడ్ నేషన్స్ సమావేశంలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. హైదరాబాద్‌లోని హయత్‌నగర్ మండల పరిషత్ ఆవరణలో రంగారెడ్డి జిల్లా స్థాయి సోషల్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మాక్ యుఎన్ఓ సమావేశంలో ప్రభుత్వ పీఎం శ్రీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 8వ తరగతి విద్యార్థిని శశిరేఖ తన ప్రతిభతో అందరినీ ఆకట్టుకుంది. థాయిలాండ్ దేశ ప్రతినిధిగా వ్యవహరించిన ఆమె, తన ప్రసంగ నైపుణ్యంతో జడ్జీలను మెప్పించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.ఈ సందర్భంగా గైడ్ టీచర్ షహీనా బేగం, ఉపాధ్యాయిని అజ్రానా బేగం మాట్లాడుతూ శశిరేఖ కృషి, పట్టుదల వల్లే ఈ విజయాన్ని సాధించిందని తెలిపారు. ప్రిన్సిపల్ వినోద్ కుమార్ కూడా ఆమె ప్రతిభను అభినందిస్తూ, అంతర్జాతీయ వేదికపై నిలిచే స్థాయిలో ప్రసంగించిందని ప్రశంసించారు.




“ వాస్తవాల ప్రాతిపదికగా కాకుండా తమ ఇష్టం వచ్చినట్లు తమ కూటమి భాగస్వాముల మీద అనుమానాలు రేకెత్తించే ఆరోపణలు చేయడం నాయకత్వ పటిమకు నిదర్శనం కాబోదు.(కాంగ్రెస్, డిఎంకెలతో బిజెపి రహస్య అవగాహన కలిగియున్నదని మమతా బెనర్జీ ఇటీవల వ్యాఖ్యానించారు.) అది వక్రీకరణే అవుతుంది. మమతా బెనర్జీ చేసిన ఆరోపణలు నిరాధారణమైనవి, ప్రతిపక్ష ఐక్యతను బలహీనపరుస్తాయి. బిజెపికి వ్యతిరేకంగా అందరూ గట్టి ఐకమత్యంతో కలిసికట్టుగా పోరాడవలసిన సమయంలో ఆమె ఇటువంటి విమర్శలకు తొందరపడకుండా ఉండవలసింది. ఆమె మతి కోల్పోతున్నట్టున్నారు. అందుచేతనే ఇటువంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. 1998, 1999లో బిజెపితో కూటమి కట్టింది తృణమూల్ కాంగ్రెసే కాని కాంగ్రెస్ కాదు.. అలాగే 2024 ఎన్నికలలో కూడా బిజెపి, అర్ఎస్ఎస్‌తో కలిసి తృణమూల్ కాంగ్రెస్ పోటీ చేసింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అర్ఎస్ఎస్, బిజెపిల సిద్దాంతాలకు వ్యతిరేకంగా అదే పనిగా పోరాడుతున్నారు. కాంగ్రెస్ ఎవరి నుంచి పాఠాలు నేర్చుకునే స్థితిలో లేదు. ”

*– మాణిక్యం ఠాగోర్, కాంగ్రెస్ ఎంపి*

## వే'మన'పద్యం

**ఆశ పాపజాతి యన్నింటికంటెను**
**ఆశచేత యతులు మోసపోరె**
**చూచి విడచువారె శుద్ధాత్ములెందైన**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# అస్సాంలో ద్వేష భాష!

అస్సాంలో హైబ్రిడ్ పాలన సాగుతున్నది అనడం అబద్ధం కాని అతిశయోక్తి గాని కాదని అంగీకరించక తప్పదు. ఎందుకంటే ముఖ్యమంత్రి హిమంత విశ్వ శర్మ బిజెపి లో చేరక ముందు కాంగ్రెస్ లో ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కుదరక ఆ పార్టీని వదిలిపెట్టి బిజెపి లో చేరారు.ఆ రాష్ట్ర రెండవ బిజెపి ముఖ్యమంత్రిగా పాలన సాగిస్తున్నారు. శర్మకి ముందు ఆ రాష్ట్ర మొదటి బిజెపి ముఖ్యమంత్రిగా సర్వానంద్ సోనోవాల్ చేశారు. అసోమ్ గణపరిషత్(ఎ జి పి ), బోడో పీపుల్స్ ఫ్రంట్ (బి డి ఎఫ్)లతో కలిసి కాంగ్రెస్ పాలనకు బిజెపి తెర దించిన తర్వాత 2016 లో అది అధికారంలోకి వచ్చింది. 2021లో రెండవసారి గెలిచిన తర్వాత హిమంత బిశ్వాస్ శర్మను సి ఎం గా చేసుకున్నది. ఆయన వ్యవహార శైలిలో కాంగ్రెస్ ధోరణులు బొత్తిగా కనిపించవు. మోడీ తరం బిజెపి ధోరణులను శర్మ పూర్తిగా వొంటబట్టించుకున్నారని అనిపిస్తే ఆశ్చర్యపడవలసిన పనిలేదు.ప్రస్తుతం తన నాయకత్వంలో అసెంబ్లీ ఎన్నికలకు వెడుతున్న అస్సాంలో శర్మ అనుసరిస్తున్న ధోరణులను గురించి చర్చించుకోవడం అవసరం.దీనికోసం గాఢమైన పరిశోధన చేయాల్సిన పనిలేదు."మియాల(ముస్లింలను)ను నేను వదిలిపెట్టేదే లేదు, వారికి నిద్ర పట్టనివ్వను, నాకు చేతనైనంతవరకు వారిని వేధిస్తాను. ఈ ధోరణే నన్ను ముఖ్యమంత్రిని చేసింది.""అని ముఖ్యమంత్రి హిమంత్ అన్నారని రూఢి సమాచారం.ఆయన ఏ రాజ్యాంగం కింద ఆ రాష్ట్రాన్ని పరిపాలన చేస్తున్నారో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. శర్మ విద్వేష భాషణ పై కోర్టుకు వెళ్లగా విచారణను ఆయనకు అనుకూలమైన తేదీ కి వాయిదా వేశారని అస్సాం మేధావి ప్రముఖులలో ఒకరైన హిరేన్ గోహైన్ అన్నారు.అస్సాం జనాభాలో ముస్లిం లు దాదాపు 34.50 శాతం ఉంటారు.కొన్ని జిల్లాల్లో వారిది ముఖ్యమైన పాత్ర.బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉన్నందున అస్సాం లోకి విదేశీయులు చొచ్చుకు వస్తున్నారనే ప్రచారాన్ని బిజెపి భారీగా చేపట్టింది.ఈ ఎన్నికలలో బిజెపి గెలుపును నల్లేరు మీద నడక చేయడానికి శర్మ విద్వేష ప్రసంగాన్ని నిశిత ఆయుధం చేసుకున్నారు.ముస్లింలకు వ్యతిరేకంగా హిందూ ఓటును సంఘటితం చేయడానికి అన్ని అడ్డ దారులూ తొక్కుతున్నారు. అంతే కాదు బీహార్ లో చేసినట్టు దాదాపు 40 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో గత నెల లోనే తొమ్మిదేసి వేల రూపాయలు జమ చేశారు. ఇటువంటి అడ్డమైన పథకాలాన్నిటికీ కేంద్రమే నిధులు సమకూ రుస్తున్నదని అంటున్నారు.ఇప్పటికే మహిళలకు నెలకు రూ 1250 ఇస్తోంది. ఎన్నికలకు కొద్ది నెలలు, రోజుల ముందు నగదు తాయిలాలు ఇచ్చే పద్ధతి పూర్తి ప్రజాస్వామ్య వ్యతిరేకం.ఇది ప్రజాధనాన్ని రాజకీయ స్వప్రయోజక డ్రైనేజీలో పోయడం కిందికే వస్తుంది.ఇప్పుడు శాసనసభ ఎన్నికలు జరుగుతున్న తమిళనాడు, కేరళ, బెంగాల్, అస్సాం నాలుగూ దేశంలో అత్యంత కీలకమైన రాష్ట్రాలు.అస్సాం ను కాంగ్రెస్ చిరకాలం పాటు పాలించింది. ఆ తర్వాత అసోమ్ గణ పరిషత్ ప్రాంతీయ పాలన, ఇప్పుడు బి జె పి పరిపాలన. కేంద్రంలో మాదిరిగా అస్సాం లోనూ వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలన్న ఆశను హిమంత్ నెరవేర్చగలుగుతాడో లేక ఆయన ద్వేష భాషకు విసుగు చెందిన అస్సామీలు ఈ సారి సెక్యులర్ శక్తులకు పట్టం కడతారో చూడాలి.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# 'కేరళ మోదీ' విజయన్ కేంద్రంగా ఎన్నికలు

కేరళ చరిత్రలోనే వరుసగా రెండోసారి పార్టీని ఎన్నికలలో గెలిపించి రికార్డు సృష్టించిన ముఖ్యమంత్రి పినరాయి విజయన్ ఇప్పుడు చారిత్రక మూడోసారి గెలిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. వామపక్షాల రాజకీయ సంస్కృతికి భిన్నంగా పార్టీని, ప్రభుత్వాన్ని గుప్పెట్లో పెట్టుకొని కేరళ రాజకీయాలపై చెరగని ముద్ర వేస్తున్న విజయన్ ను ఆయన పార్టీ వారే 'కేరళ మోదీ'గా భావిస్తున్నారు. కేంద్రంలో అంతా తానే అన్నట్లు ప్రభుత్వం, పార్టీ వ్యవహారాలను నిర్దేశిస్తూ ఏకపక్షంగా ప్రధాని నరేంద్ర మోదీ వ్యవహరిస్తున్న విధంగా కేరళలో విజయన్ రాజకీయాలు సాగుతూ ఉండటమే అందుకు కారణం.

వాస్తవానికి పదేళ్ల క్రితం ప్రజలలో విశేషమైన పలుకుబడి సంపాదించిన మాజీ ముఖ్యమంత్రి వి ఎస్ అచ్యుతానందన్ పేరుతో అధికారంలోకి వచ్చిన పార్టీలో కొందరు జాతీయ నాయకుల అండతో వెనుకదారిలో ముఖ్యమంత్రి పదవి చేజిక్కించుకున్న విజయన్ ఇప్పటివరకు ఆ పదవిని వదలడం లేదు. ఇప్పుడు 80 ఏళ్ళ వయస్సులో కూడా తానే ముందుండి మొత్తం ప్రచారం నిర్వహిస్తున్నారు. వయస్సు, రెండు పర్యాయాలు మంత్రి పదవిలో ఉన్నారంటూ పలువురిని అధికారంకు దూరం చేసిన ఆయన తన విషయంలో మాత్రం 'పార్టీ నిర్ణయం' అంటూ ఆ ప్రమాణం తనకు వర్తింపదని స్పష్టం చేస్తున్నారు.

బీజేపీలో కీలక నాయకులను వెనుకకు నెట్టి, పార్లమెంటరీ బోర్డు లో ఇద్దరు, ముగ్గురు తప్ప మద్దతు ఇవ్వకపోయినా ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ అండతో పార్టీ ప్రధాని అభ్యర్థిగా ఆ పదవిలోకి రాగానే '75 ఏళ్ళ వయస్సు' అని ఓ అనధికార నియమంతో సీనియర్ నేతలు అందరిని పక్కకు మోదీ నెట్టివేయడం చూశాము. అదే విధంగా కేరళలో కూడా మోదీ మాదిరిగానే 'ఆ నియమం' తనకు వర్తించదు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కమ్యూనిస్టు రాజకీయాలలో ఎన్నడూ లేని విధంగా, 34 ఏళ్లపాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా కొనసాగిన జ్యోతిబసు సహితం అనుసరించని రీతిలో 'వ్యక్తి ఆరాధన'ను పరాకాష్టకు తీసుకెడుతూ, నిలువెత్తు పోస్టర్లు, కట్ అవుట్ లతో, మీడియా ప్రచారంతో తనను తాను తిరుగులేని నాయకుడిగా ప్రచారం చేసుకుంటున్నారు విజయన్. వాస్తవానికి లెఫ్ట్ ఫ్రంట్ ఎమ్మెల్యేలు చాలామంది క్షేత్రస్థాయిలో ప్రజలకు సన్నిహితంగా మెలుగుతూ వారి సానుభూతి పొందుతున్నారు.

సాధారణంగా మరోసారి అధికారంలోకి రావాలి అనుకునే ముఖ్యమంత్రులు ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతికతను తగ్గించుకునేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పలువురికి తిరిగి సీటు ఇవ్వకుండా చేస్తుంటారు. ఆ విధంగా తన పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నా తన ఎమ్మెల్యేల కారణంగా పార్టీకి ప్రజలలో వ్యతిరేకత ఎదురవుతుందని వాపోతూ ఉంటారు. బిజెపి, కాంగ్రెస్, ఇతర పార్టీలు అన్ని ఆ విధంగానే చేస్తున్నాయి. అయితే, కేరళలో సిపిఎం ఎమ్మెల్యేలకు ప్రజలలో గల సానుభూతిని ఆసరా చేసుకొని మరోసారి అధికారం దక్కించుకునేందుకు పినారయి విజయం ప్రయత్నిస్తున్నారు.

మరోవంక, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ లో విజయన్ ను ఎదుర్కొనే నాయకుడే కనిపించడం లేదు. అక్కడ అందరూ ముఖ్యమంత్రి అభ్యర్థులే. అయితే, ఆశ్చర్యకరంగా కాంగ్రెస్ నేతలు అందరూ మొదటిసారిగా ఉమ్మడిగా కనిపిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎవ్వరు అనే వివాదం తెరపైకి కనిపించకుండా 'అందరం ఒక్కటే' అన్నట్లు ప్రజల ముందుకు వస్తున్నారు.

లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని అసెంబ్లీ లోపల, బైట నిలదీయడంతో ఉద్రేకంగా వ్యవహరించే ప్రతిపక్ష నేత విడి సతీసన్, సుదీర్ఘకాలం రాష్ట్రంలో పార్టీ వ్యవహారాలపై పట్టు సంపాదించిన రమేష్ చెన్నితాల, రాహుల్ గాంధీకి కుడిభుజంగా పేరొందడంతో ఆ హోదాలో రాష్ట్రంలో పార్టీ వ్యవహారాలపై పెత్తనం చేస్తున్న కేసి వేణుగోపాల్ లతో పాటు మాజీకేంద్ర మంత్రి శశి థరూర్ సహితం ఉమ్మడిగా పార్టీ అభ్యర్థుల విజయం కోసం శ్రమపడుతున్నారు.

కేరళలో కాంగ్రెస్ కు ప్రధానంగా కలసి వచ్చే విషయం జాతీయ స్థాయిలో అత్యంత ప్రజాదరణ గలిగిన నేతగా ప్రధాని నరేంద్ర మోదీ పేరొందినప్పటికీ, కేవలం కేరళ, తమిళనాడు లలో మాత్రమే మోదీకి మించిన ప్రజాదరణ రాహుల్ గాంధీకి ఉంది. అందుకనే లోక్ సభ ఎన్నికలలో గత రెండు పర్యాయాలు సహితం కేరళలో కాంగ్రెస్ విశేషమైన ఫలితాలు పొందగలిగింది. వాయనాడ్ ఎంపీగా ఐదేళ్లపాటు కేరళకు ప్రాతినిధ్యం వహించినప్పటికీ ఆ హోదాలో కన్నా జాతీయ నాయకుడిగా కేరళ ప్రజలు రాహుల్ కు ప్రధాన ప్రాధాన్యత ఇస్తున్నారని అనేక పోల్ సర్వేలు స్పష్టం చేశాయి.



*కేరళం ముఖ్యమంత్రి సెక్యూరిటీ సిబ్బంది లేకుండా ఒక ఆటోలో వెళ్లి ఒక కాకా హోటల్లో చక్కగా తృప్తిగా భోజనం చేసి, సొంత డబ్బులు ఇచ్చి వెళ్లిపోయారు.*

2024 లోక్ సభ ఎన్నికలలో ఎల్డీఎఫ్ వామపక్ష కూటమి కుప్పకూలిపోవడం, గత డిసెంబర్ లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ విశేషమైన ఫలితాలు సాధించడంతో పదేళ్ల తర్వాత తామే ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నట్లు కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంతో కనిపిస్తున్నారు. హర్యానాలో మాదిరిగా అటువంటి అవకాశాన్ని చేజార్చుకోవద్దనే తమలో కుమ్ములాటలు, విభేధాలు బైటకు కనిపించకుండా ఎన్నడూ లేనివిధంగా జాగ్రత్త పడుతున్నారు.

కేరళలో ఆర్ఎస్ఎస్ కు శతాబ్దాలుగా బలమైన ఉనికి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సిపిఎం శ్రేణులను ఢీకొగల బలం ఉన్నప్పటికీ, రాజకీయంగా బీజేపీ అనుకున్న విధంగా ఎదగలేక పోతున్నది. దేశవ్యాప్తంగా బిజెపి అనుసరిస్తున్న 'హిందుత్వ విధానాలు' కేరళలో సిపిఎంకు అనుకూలంగా ఉండటమే అందుకు ప్రధాన కారణం. రాష్ట్ర జనాభాలో 40 శాతంకు పైగా ఉన్న ముస్లింలు, క్రైస్తవులలో అత్యధికంగా కాంగ్రెస్ కు మద్దతు దారులుగా ఉంటూ ఉండడంతో హిందువుల ప్రయోజనాలు కాపాడగలిగే పార్టీగా సిపిఎం గుర్తింపు పొందింది.

అందుకనే ఎన్నికల ముందు ఆ పార్టీ శబరిమలలో మహిళల ప్రవేశం విషయమై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునరాలోచించాలని కోరుతూ పిటిషన్ వేసింది. క్రైస్తవులలో తగు మద్దతు కోసం ఒక వంక సిపిఎం, మరోవంక బిజెపి కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నా చెప్పుకోదగిన ఫలితాలు లభించడం లేదు. మొదటిసారిగా 2024లో ఒక ఎంపీ స్థానం, గత డిసెంబర్ లో తిరువనంతపురంతో పాటు రెండు మేయర్ పదవులు పొందిన ఉత్సాహంతో ఉన్న బిజెపి ఈ సారీ రెండంకెలలో ఎమ్మెల్యే పదవులు పొందాలని లక్ష్యంగా పెట్టుకుంది.

అయితే, క్రైస్తవుల మద్దతు కోసం ప్రధాని మోదీ వ్యూహాత్మకంగా చేస్తున్న ప్రయత్నాలు అకస్మాత్తుగా బెడిసికొట్టిన్నట్లు కనిపిస్తున్నది. ఝార్ఖండ్ లో ఇద్దరు క్రైస్తవ నన్ లను అరెస్ట్ చేయడం, గత క్రిస్మస్ సందర్భంగా పలు చోట్ల దేశంలో క్రైస్తవులపై దాడులు జరగడం బిజేపీ పట్ల వారిలో ప్రతికూలత పెరిగేందుకు దారితీసిన్నట్లు భావిస్తున్నారు. తాజాగా, ఎఫ్ సి ఆర్ ఐ నిబంధనలకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలు క్రైస్తవ సంస్థలను కట్టడి చేసేందుకే అనే బలమైన అభిప్రాయం వారిలో ఏర్పడింది.

కేరళ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడం ప్రస్తుతం ఆపివేసిన్నప్పటికీ అది కేవలం తాత్కాలిక చర్య మాత్రమే అని భావిస్తున్నారు. గతంలో లవ్ జిహాద్, మతమార్పిడులు వంటి అంశాలపై తాము కూడా బాధితులమే అంటూ పలు క్రైస్తవ వర్గాలు బిజెపితో స్వరం కలిపాయి. అయితే, ఇప్పుడు ఎన్నికల ముందు బీజేపీ నేతలు సహితం ఈ అంశాలను ప్రస్తావించడం లేదు.


జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ను రాజకీయంగా ప్రధాన ప్రత్యర్థిగా పరిగణిస్తున్న బిజెపి ఆ పార్టీ మరో రాష్ట్రంలో గెలిచే అవకాశాలు కనిపించడాన్ని సహజంగానే సహింపలేక పోతున్నది. అందుకనే తాము కేరళలో అధికారంలోకి వచ్చే అవకాశాలు ఇప్పట్లో లేదని గ్రహించి, కాంగ్రెస్ ను రాకుండా అడ్డుకొనేందుకు పరోక్షంగా సిద్ధాంతపరంగా తీవ్రంగా వ్యతిరేకించే లెఫ్ట్ ఫ్రంట్ మరోసారి అధికారం చేపట్టేందుకు బిజెపి సహకరిస్తుందని విమర్శలు ఈ సందర్భంగా చెలరేగుతున్నాయి. ఈ విషయమై రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు స్పష్టంగా ఆరోపణలు చేస్తున్నారు.

ఎప్పటి నుండో పెండింగ్ లో ఉన్న కేరళ రాష్ట్రం పేరు మార్చే ప్రతిపాదనను ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తెరపైకి తీసుకు రావడం, కానీ పశ్చిమ బెంగాల్ విషయంలో ఉన్న అటువంటి ప్రతిపాదనను పట్టించుకోకపోవడం ఈ సందర్భంగా ప్రముఖంగా అందరి దృష్టిని ఆకట్టుకొంటోంది. అదేవిధంగా శబరిమలలో బంగారం దొంగతనం కేసు గురించి ప్రధాని మోదీ, బిజెపి నాయకులు ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించకపోవడం కూడా ఆ రెండు పార్టీలు పరోక్షంగా ఒకరికి మరొకరు సహకరించుకుంటున్నారనే అభిప్రాయం కలిగించేందుకు బలం కలుగుతుంది. బీజేపీలో అంతర్గతంగా గల కుమ్ములాటలు సహితం ఆ పార్టీకి ప్రతిబంధకంగా మారుతున్నాయి. మలయాళీ అయినప్పటికీ ఎక్కువగా కర్ణాటకలో పెరిగిన రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కు క్షేత్రస్థాయి రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధాలు లేకపోవడం, ఇతర నాయకులను అతను కలుపుకొని వ్యవహరించకపోవడం ఓ సమస్యగా మారింది. మొదటి మహిళా డిజిపిగా పేరొందిన శ్రీలేఖను మేయర్ అభ్యర్థిగా తిరువనంతపురం ఎన్నికలలో నిలబెట్టి, ఆమె కార్పొరేటర్ గా ఎన్నికైన తర్వాత కుంటి సాకులతో ఆమెను పక్కకు తప్పించడం పార్టీలో అంతర్గతంగా నెలకొన్న వైరుధ్యాలను వెల్లడి చేస్తుంది.

### కలుషిత భారత రాజకీయాల్లో చిరు ఆశాదీపం కేరళ..

ఏది ఏమైనప్పటికీ కలుషితమైన భారత రాజకీయాలలో కేరళ రాజకీయాలు ఓ చిరు ఆశాదీపం అని చెప్పవచ్చు. దేశంలో ఇప్పటికీ సిద్ధాంతపరమైన రాజకీయాలు ఎక్కువగా ఆ రాష్ట్రంలోనే కొనసాగుతున్నాయి. పార్టీ ఫిరాయింపులు పెద్దగా లేని రాష్ట్రం కూడా కేరళ మాత్రమే. ఎన్నికలపై ధన ప్రభావం చాల తక్కువగా ఉన్న రాష్ట్రం కూడా అదే కావడం గమనార్హం. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు కేరళలో చాలా నామమాత్రంగా ఉంటాయి. అన్ని రాజకీయ పార్టీలలో క్షేత్రస్థాయి పార్టీ నిర్మాణం, స్థానిక కార్యకర్తలకు కొంత గౌరవం, ప్రాధాన్యత కేవలం కేరళలో మాత్రమే కనిపిస్తుంది. రాష్ట్ర స్థాయి మంత్రికన్నా ఓ సర్పంచ్, ఓ జిల్లా పార్టీ కార్యదర్శి అక్కడ రాజకీయాల్లో విశేషమైన భూమిక వహిస్తుంటారు. అవినీతి విషయంలో సహితం మిగిలిన రాష్ట్రాలతో పోల్చుకుంటే కేరళలో నామమాత్రపు ఆరోపణలు మాత్రమే ఉంటాయి. ఇటీవల కాలంలో కొందరు నేతలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నా ఇతర రాష్ట్రాల నాయకులపై వచ్చిన వాటితో ఏమాత్రం పోల్చలేము.

కేరళ ప్రజలలో రాజకీయ అవగాహన కొంచెం ఎక్కువనే అని చెప్పవచ్చు. నిర్దుష్టమైన అంశాలపై తమ ప్రభుత్వాన్ని, అధికారులను, చివరకు తమ పార్టీ నాయకులను నిలదీసేందుకు వెనుకడుగు వేయరు. తిరువనంతపురం పోలీస్ కమిషనర్ గా పనిచేసిన ఓ తెలుగు ఐపీఎస్ అధికారి ఒకసారి అక్కడి ప్రజల గురించి చెబుతూ ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ జరిగితే పోలీస్ కమిషనర్ కన్నా ముందు ముఖ్యమంత్రి దృష్టికి వెడుతుందని చెప్పారు. సాధారణ ప్రజలే నేరుగా ముఖ్యమంత్రికి ఫోన్ చేసి తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకు వస్తారని తెలిపారు. అటువంటి రాజకీయ చైతన్యం మిగిలిన రాష్ట్రాల ప్రజలలో తక్కువగా ఉండటమే కాకుండా, సాధారణ ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే ముఖ్యమంత్రి స్థాయి నుండి వెంటనే స్పందించడం కూడా మిగిలిన చోట్ల చాలా అరుదని చెప్పవచ్చు. అందుకనే కేరళ ఎన్నికల సరళిని మొత్తం దేశ ప్రజలు ఆసక్తితో గమనిస్తున్నారు.



చలసాని నరేంద్ర
9849569050

# గుండె చెదిరే గుండాల అరణ్య రోదన

అడవులు... కొండలు... జలపాతాల నడుమ ప్రకృతి ఒక ఆకుపచ్చని వర్ణ చిత్రాన్ని గీసుకున్నట్టుగా కనిపించే ఒక ప్రాంతం గుండాల. కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని ఈ ప్రాంతానికి మొదటిసారి వెళ్లినవారికి అది ప్రకృతి సోయగాల సందడిలా అనిపిస్తుంది. ఎత్తైన గుట్టలపై నిలిచిన దట్టమైన అడవులు, వాటి మధ్య నుంచి జారిపడే జలపాతాలు, గాలిలో వినిపించే పక్షుల స్వరాలు ఇవన్నీ కలిసి ఒక మంత్ర ముగ్ధ ప్రపంచాన్ని సృష్టిస్తాయి.

కానీ ఆ అందాల మధ్య జీవిస్తున్న దాదాపు రెండు వేల మంది ఆదివాసీల జీవితం మాత్రం ఇప్పటికీ శతాబ్దాల వెనుకబాటే ఉంది.

ప్రకృతి ఇచ్చిన సంపద అపారం. కానీ అభివృద్ధి మాత్రం ఇక్కడికి చేరలేకపోయింది.

### సాహస యాత్రలా మారే గుండాల దారి...

గుండాల ప్రాంతానికి మరో ప్రత్యేకత గుండాల జలపాతం. కొండల నడుమ దాగి ఉన్న ఈ జలపాతం ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తోంది. రోంపాపల్లి గ్రామం నుంచి కాలినడకన కొండలు దాటి వెళ్లే మార్గం ఒక సాహసయాత్రలా ఉంటుంది. అడవుల మధ్యగా సాగిన ఆ దారి ప్రయాణికులకు ఆహ్లాద అనుభూతిని ఇస్తుంది. ఈ కారణంగా ఇటీవలి కాలంలో గుండాల ప్రాంతం పర్యావరణ పర్యాటక కేంద్రంగా ఎదుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

అయితే పర్యాటకులు ఆస్వాదిస్తున్న అదే ప్రకృతి మధ్య జీవిస్తున్న ఆదివాసీలు మాత్రం కనీస సౌకర్యాల కోసం ఇంకా పోరాటమే చేస్తున్నారు.

### ఎనిమిది కిలోమీటర్ల నడక...

గుండాల గ్రామం ఒక గణాంకం కాదు. అది ఒక జీవన పోరాటం. ఇక్కడి ప్రజలకు రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే ఎనిమిది కిలో మీటర్లు కాలినడకన కొండ దిగి వెళ్లాలి. ఒక గోళీ కావాలన్నా, జ్వరం వచ్చినా అదే దారి పట్టాలి.

వానాకాలం వస్తే పరిస్థితి మరింత దారుణం. బురదతో నిండిపోయే మార్గాలు, ఉప్పొంగే



వాగులు, జారి పడే కొండరాళ్లు... ఇవన్నీ కలిసి గ్రామస్తుల ప్రయాణాన్ని ప్రమాదకరంగా మారుస్తాయి. అప్పుడప్పుడు ఒక చిన్న అనారోగ్యం కూడా పెద్ద సమస్యగా మారిపోతుంది.

గ్రామానికి చెందిన మర్సుకోల అశోక్ తన బాధను ఇలా వ్యక్తం చేశాడు. 'ఇప్పటివరకు సర్కారు మా వైపు చూడలేదు. ఇక్కడ పనిచేసిన పోలీస్ సార్ పుష్పాల రామారావు కొంత దూరం మొరం రోడ్ వేయించారు. కానీ వానలకు అది కూడా చెదిరిపోయింది. రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే మేము ఇంకా కాలినడకనే వెళ్లాలి." అశోక్ మాటల్లో వినిపించిన ఆవేదన అక్కడి పరిస్థితులను అక్షరాలా ప్రతిబింబిస్తుంది. అతను అక్కడ గిరిజన స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి గత 8 నెలలుగా ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదు. అతడికే కాదు , కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 34 మంది టీచర్లకు జీతాలు లేవు. అయినప్పటికీ వారు గిరిజన బిడ్డలకు చదువు చెప్పడం ఆపలేదు.

గ్రామానికి చెందిన రాయి సిడం సోము పటేల్ వైద్య సదుపాయాల లేమిని గుర్తుచేస్తూ ఇలా చెబుతాడు.'ఇక్కడ ఎవరికైనా అనారోగ్యం వస్తే ముందుగా భయం మొదలవుతుంది. దగ్గరలో ఆసుపత్రి లేదు. రహదారి లేకపోవడంతో గ్రామం నుంచి బయటకు తీసుకెళ్లడమే కష్టమవుతుంది.' ఈ మాటలు అక్కడికి ఆరోగ్య వ్యవస్థ ఎంత దూరంగా ఉందో తెలియజేస్తున్నాయి.

గ్రామానికి చెందిన బావి దగ్గరున్న కొట్నాక పత్తుబాయి, తాగునీటి కష్టాలను వివరించారు. 'నీళ్ల కోసం మేము ఉదయం నాలుగు గంటలకే లేస్తాం. బావి దగ్గర క్యూ ఉంటుంది. ఆలస్యమైతే నీళ్లు దొరకవు. పిల్లలు స్కూల్‌కి వెళ్లాలంటే ముందుగా నీళ్లు తెచ్చుకోవాలి.' నీరు వంటి ప్రాథమిక అవసరం కూడా ఇక్కడ రోజువారీ పోరాటమే.

'అసిఫాబాద్ ప్రాంతంలో ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నపుడు గుండాల ప్రాంతాన్ని కాలినడకన వెళ్లి చూశాను. రహదారులు లేక వీరు పడుతున్న కష్టాలు కొంతయినా తగ్గించాలని నా మిత్రుల సహాయంతో కొంత వరకు మట్టి రోడ్డు వేశాం. కానీ అది సరిపోదు.వానలకు గుట్టల మీద నుండి వచ్చే నీటి కోతకు అవి దెబ్బతిన్నాయి. ఎవరైనా ఎన్జీఓలు ముందుకు వచ్చి వీరికి సహకరించాలి. తాగునీటి వసతి కూడా కల్పించాలి' అన్నారు, ఖమ్మం జిల్లాలో ఎస్.ఐ గా పనిచేస్తున్న పుష్పాల రామారావు.

గుండాల ప్రాంతం ప్రకృతి సంపదతో నిండిపోయి ఉంది. జలపాతాలు, అడవులు, కొండలు ఇవన్నీ కలిసి ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా ఎదగగల సామర్థ్యం కలిగి ఉన్నాయి. అయితే అదే ప్రాంతంలో నివసించే ప్రజలకు రహదారులు, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి ప్రాథమిక అవసరాలు ఇంకా అందక పోవడం ప్రభుత్వ వైఫల్యం. పర్యాటక కేంద్రంగా ఎదుగుతున్న ప్రాంతంలో నివసించే ప్రజలు ఇంకా అభివృద్ధి అంచుల్లోనే ఉండటం ఒక నమ్మలేని వాస్తవం. ' వానా కాలం వస్తే మాకు నరకమే . కాలినడక తప్ప కనీసం బైక్ వెళ్లడానికి కూడా రహదారి లేదు. ప్రభుత్వ అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా మా గోడు వినరు. ఎన్నికల సమయంలో మాత్రం మా ఓట్ల కోసం ఇక్కడ పోలింగ్ కేంద్రం పెడతారు. మాకు రోగాలు వస్తే చూడ డానికి ఒక్క ఆరోగ్య కేంద్రం కూడా పెట్టరు ' అని మర్సుకోల రాము, సోయం భూమ్‌రావు ఆవేదనతో చెప్పారు.

గంటసేపు తమ కష్టాలను వివరించిన తర్వాత టీచర్ మర్సుకోల అశోక్ చివర్లో ఒక మాట అన్నాడు.

"మా కష్టం ఎవరైనా చూడాలి... వినాలి... స్పందించాలి "

ఆ మాటల్లో ఆవేదన ఉంది. కానీ అదే సమయంలో ఒక చిన్న ఆశ కూడా ఉంది.

ఎప్పుడో ఒక రోజు ఈ అడవిలో దాగి ఉన్న గుండాల గ్రామం వైపు కూడా అభివృద్ధి దారి తిరుగుతుందేమో అన్న ఆశ.

ప్రకృతి అందాల మధ్య జీవిస్తున్న ఈ ఆదివాసీ గ్రామం కథ ఒక ప్రశ్నను మాత్రం మిగుల్చుతుంది.

పర్యాటకులకు స్వర్గంలా కనిపించే ఈ ప్రాంతం, అక్కడి ప్రజలకు కూడా ఎప్పుడైనా జీవన సౌకర్యాల స్వర్గంగా మారుతుందా?



చలసాని నరేంద్ర
9849569050

# విద్యుత్ వ్యాపారాన్ని వ్యతిరేకించిన తాతారావు

భారతదేశ విద్యుత్ రంగానికి నార్ల తాతారావు చేసిన సేవలు చిరస్మరణీయాలు. విద్యుత్ కేంద్రాల డిజైన్లు మార్చడంలో ఆయన చూపిన ప్రతిభ మార్గదర్శకం అయింది. వివిధ పదవులు నిర్వహించి విద్యుత్ ఉత్పాదన సామర్థ్య పెంపుకు విశేష కృషి చేశారు. నార్ల తాతారావు ప్రఖ్యాత భారత విద్యుత్తు రంగ నిపుణుడు, పూర్వపు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్తు బోర్డు మాజీ ఛైర్మన్. నార్ల తాతారావు కృష్ణా జిల్లా కౌతవరం గ్రామంలో 1917 మార్చి 8వ తేదీన జన్మించారు. కౌతవరం లోనే ప్రాథమిక విద్య నభ్యసించారు. బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం నుండి 1941లో ఇంజినీరింగ్ పట్టా పొందారు. అమెరికా లోని ఇల్లినాయిస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎం.ఎస్ డిగ్రీ చదివిన తాతారావు మొదట టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలో ఉద్యోగిగా జీవితము ప్రారంభించారు. పిదప ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్తు సంస్థ (ఏపీఎస్ఈబీ) డివిజనల్ ఇంజినీరుగా ఉద్యోగ జీవితం మొదలు పెట్టారు. తర్వాత మధ్యప్రదేశ్ విద్యుత్తు బోర్డులో పనిచేసిన కాలంలో దేశం లోనే ఆ సంస్థను అగ్రగామిగా నిలిపారు. థర్మల్ విద్యుత్తు కేంద్రాల డిజైన్లను మార్చడం ద్వారా ఈ రంగంలో పెద్ద విప్లవమే తీసుకొచ్చారు. ఆ తర్వాత ఆ డిజైన్లు దేశాని కంతటికీ ఆదర్శమయ్యాయి. 1974 నుంచి 1988 వరకూ 14 ఏళ్లపాటు ఏపీఎస్ఈబీ ఛైర్మన్‌గా పని చేసారు. విద్యుత్తు రంగానికి విశిష్ట సేవలందించినందుకు గాను 1983లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.



నాగార్జున సాగర్, శ్రీశైలం, దిగువ సీలేరులలో విద్యుత్ ఉత్పాదక సామర్థ్యము పెంచడంలో ప్రముఖ పాత్ర వహించారు. రైతులకు ఉచిత విద్యుత్తు ఇవ్వడాన్ని నార్ల తాతారావు గట్టిగా సమర్థించారు. పేదలకు తక్కువ ధరకే విద్యుత్ అందజేయాలనేది ఆయన లక్ష్యం. విద్యుత్ తో వ్యాపారం చేయవద్దనేది ఆయన నినాదం.

నార్ల తాతారావు 2007 ఏప్రిల్ 7న హైదరాబాద్ నగరంలో గుండెపోటుతో మరణించారు. ప్రముఖ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావు తాతారావుకు సోదరులు.

మధ్య ప్రదేశ్ విద్యుత్ శాఖ, డివిజనల్ ఇంజినీర్‌గా; విద్యుత్ బోర్డు, మధ్య ప్రదేశ్, కార్యదర్శిగా; మధ్య ప్రదేశ్ విద్యుత్ శాఖ, ఛీఫ్ ఇంజినీర్‌గా; మధ్య ప్రదేశ్ విద్యుత్ శాఖ, ఛైర్మన్‌గా; కేంద్ర ప్రభుత్వ జల విద్యుత్ కమిషన్, సభ్యుడుగా; సూపర్ థర్మల్ పవర్ స్టేషన్లుకమిటీ, ఛైర్మన్‌గా; ఎనర్జీ రీసర్చ్ శాఖ, భారత శాస్త్ర సాంకేతిక పరిశోధక పరిషత్, ఛైర్మన్‌గా; కేంద్రీయ జల విద్యుత్ సమితి, అధ్యక్షుడుగా; భారత అల్యూమినియమ్ కంపెనీ, డైరెక్టర్‌గా; బంగ్లాదేశ్ పవర్ డెవలప్ అడ్వైజర్ గా, తదితర పదవులు నిర్వహించారు.

ఓమ్ ప్రకాశ్ భాసిన్ పురస్కారము, పద్మ శ్రీ 1983; ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అసోసియేషన్, అమెరికా,గౌరవ సభ్యుడు; భారతరత్న, శ్రీ విశ్వేశ్వరయ్య అవార్డు 1985 ఆయన అందుకున్నారు.

*(ఏప్రిల్ 7.. నార్ల తాతారావు వర్ధంతి)*

**- సంగనబట్ల,**
**+919440595494**



# జాతీయం-అంతర్జాతీయం



## భారత్ ధర్మసత్రం కాదు



వుదయం డెస్క్:

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా అస్సాంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ చొరబాటుదారుల ప్రస్తావన తీసుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా అది భాజపా వల్లే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. భాజపా అధికారంలోకి వస్తేనే ఇవన్నీ జరుగుతాయన్నారు. బరాక్ లోయలో బెంగాలీలు ఎక్కువగా ఉంటారు. దీంతో ఆయన బెంగాల్‌లో అక్రమచొరబాటుదారుల అంశాన్ని పేర్కొనడం గమనార్హం.

"పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం గూఢచర్యం చేసే వ్యక్తులకు దేశంలో స్థానం లేదని తెలిసే ఆ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. రెడ్ కార్పెట్ వేసి మరీ అక్రమ చొరబాటుదారులకు ప్రవేశం కల్పిస్తోంది. భారత్ ధర్మసత్రం కాదు. అక్రమ చొరబాటుదారులకు ఇక్కడ స్థానం లేదు. ఒక్కసారి భాజపా అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మార్పు మొదలవుతుంది. బెంగాల్‌లో ఉన్న చొరబాటుదారులను తిరిగి వారి దేశాలకు వెళ్లగొడతాం" అని అమిత్ షా పేర్కొన్నారు.

"కాంగ్రెస్ నేతలకు అసలు ప్రజల కష్టాలు తెలుసుకోవాలనే ఉద్దేశం ఉండదు. నిరసనకారులను మెచ్చుకుంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ పార్టీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు" అని పేర్కొన్నారు.

## పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్ వార్నింగ్



వుదయం డెస్క్:


పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు.

ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్రదేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు.

# ఆర్మీ చేతికి కాముకాజి

## రూ.10 కోట్లకే వందల ఆత్మాహుతి డ్రోన్లు

వుదయం డెస్క్:



భారత సైన్యం అమ్ములపొదిలో మరో అధునాతన ఆయుధం చేరింది. ఆధునిక సాంకేతిక యుద్ధాల్లో కీలక పాత్ర పోషించే ఆత్మాహుతి డ్రోన్లు (కాముకాజి) ఆర్మీ చేతికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ రకానికి చెందిన వందలాది డ్రోన్లను స్వదేశీ సంస్థ తాజాగా సైన్యానికి అప్పగించినట్లు సమాచారం. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. రూ.10 కోట్ల ఒప్పందంలో భాగంగా వీటిని అందజేసినట్లు తెలిసింది.

గతేడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఘటన నేపథ్యంలో.. సరిహద్దుల రక్షణ విషయంలో భారత్ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే ప్రాణనష్టం జరగకుండా.. శత్రు మూకల్ని అంతం చేసేందుకు వీలుగా ఆత్మాహుతి డ్రోన్లను సమకూర్చుకుంటోంది. ఈ క్రమంలోనే గతేడాది డిసెంబరులో కేంద్ర రక్షణశాఖ పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగానే తాజాగా గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన 'ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ' అనే సంస్థ వందలాది ఆత్మాహుతి డ్రోన్లను ఆర్మీ నార్తర్న్ కమాండ్‌కు డెలివరీ చేసినట్లు సమాచారం. అయితే, భద్రతా కారణాల రీత్యా ఎన్ని డ్రోన్లను అప్పగించారన్న దానిపై కచ్చితమైన సమాచారం బయటకు రాలేదు. కేవలం రెండు నెలల్లోనే ఈ డ్రోన్లను డెలివరీ చేయడం విశేషం. అత్యవసర కొనుగోలు కింద సైన్యం వీటిని తీసుకున్నట్లు తెలుస్తోంది.

### ఏంటీ ఆత్మాహుతి డ్రోన్ల ప్రత్యేకతలు..?

- ఇవి గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఏఐ ఆధారిత గైడెన్స్‌తో కచ్చితమైన దాడులతో లక్ష్యాలను ఛేదిస్తాయి.
- గరిష్ఠంగా 2.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఎగరగలవు. 10 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలపై దాడులు చేస్తాయి.

2.5 కిలోల వరకు పేలుడు పదార్థాలను ఈ డ్రోన్లు మోసుకెళ్లగలవు.

- అత్యవసర ముప్పులను వేగంగా ఎదుర్కొనే సామర్థ్యం వీటి సొంతం. శత్రు భూభాగాల్లోకి చొచ్చుకెళ్లి లక్ష్యాలను ఛేదిస్తాయి.
- సాధారణ దళాలు వెళ్లలేని ప్రాంతాల్లోకి వెళ్లి దాడులు చేయగలవు. జీపీఎస్ అందుబాటులో లేని ప్రాంతాల్లోనూ ఉపయోగించేలా వీటిని రూపొందించారు.
- కఠినమైన వాతావరణ పరిస్థితులను తట్టుకోగలవు. మైనస్ 35 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ ఈ డ్రోన్లు పనిచేయగలవు.

## కోమాలో ఇరాన్ సుప్రీంలీడర్




వుదయం డెస్క్: ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కోమాలో ఉన్నట్లు సమాచారం. ఆయన ప్రస్తుతం కోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని, ఈ మేరకు అమెరికాఇజ్రాయెల్‌కు నిఘా సమాచారం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమాసియా ఘర్షణల వేళ ఇరాన్ నాయకత్వంపై ఈ వార్తలు రావడం సంచలనంగా మారింది. "ఖమేనీ అపస్మారక స్థితిలో ఉన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నందువల్ల నిర్ణయాలు కూడా తీసుకోలేని స్థితిలో ఉన్నారు" అని ఆ కథనాలు పేర్కొన్నాయి. అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన ఆయన ఆచూకీ గురించి వెలుగులోకి రావడం ఇదే తొలిసారి.

**ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు..!**

ఫిబ్రవరి 28న ప్రారంభమైన దాడుల్లో అప్పటి ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతుల్లా ఖమేనీ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన అంత్యక్రియలను కోమ్ నగరంలో చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఇక, యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి మొజ్తాబా బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. కానీ ఆయన పేరు మీద అప్పుడప్పుడు ప్రకటనలు వెలువడుతున్నాయి. ఘర్షణలు ప్రారంభమైన తొలిరోజే ఆయన కూడా గాయపడ్డారు. ఈ విషయాన్ని ఇరాన్ (Iran) కూడా ధ్రువీకరించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఆయన ఇరాన్ దాడుల్ని సమీక్షిస్తున్నట్టుగా ఉన్న ఒక ఏఐ వీడియోను అక్కడి ప్రభుత్వం విడుదల చేయడం గమనార్హం. ఆయనే తమ దేశానికి నాయకత్వం వహిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

## ఇరాన్ 'కిరీటం' ఖర్గ్ పై దాడులు



వుదయం డెస్క్:

ఇరాన్ ఆర్థిక కిరీటమైన ఖర్గ్ ఐలాండ్ పై మరోసారి దాడులు జరిగాయని స్థానిక మీడియా వెల్లడించింది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువుకు కొన్ని గంటలే మిగిలి ఉన్నవేళ ఖర్గ్‌తో పాటు ఆ దేశంలోని రహదారులు, రైల్వే వంతెనలపై భారీ దాడులు చోటుచేసుకున్నాయి. ద్వీపంలోని మిలిటరీ టార్గెట్లపైనా అమెరికాఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించాయి. మార్చినెలలో కూడా అమెరికా ఓసారి ఈ ప్రాంతంలో దాడులు చేసింది.

**ఏంటీ ద్వీపం..?**

పర్షియన్ గల్ఫ్‌లో ఖర్గ్ ఒక చిన్న ద్వీపం. ఇరాన్ తీరానికి 2530 కి.మీ దూరంలో ఉండే ఇది.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకం. ఇరాన్ తమ చమురు ఎగుమతుల్లో 90 శాతం ఇక్కడి నుంచే నిర్వహిస్తోంది. 1986 నుంచి ఇక్కడ విదేశీ పెట్టుబడులు పెరగడంతో.. ఇరాన్ ఇంధన ఎగుమతులకు కీలకంగా మారింది. కాగా.. హర్మూజ్ జలసంధిని తెరిపించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఓ సాధనంగా వాడాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు అగ్రరాజ్యం భారీగా బలగాలను మోహరించింది కూడా. అమెరికా భూతలదాడులకు దిగొచ్చన్న అంచనాలున్నాయి. వాటిని తిప్పికొట్టేందుకు ఇరాన్ సిద్ధమవుతోంది.

**మా సహనం నశించింది: ఇరాన్**

తాజా దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌అమెరికాకు ఇరాన్ హెచ్చరికలు చేసింది. ఇన్నాళ్లు యుద్ధం ముగింపు గురించి ఓపికతో ఎదురు చూశామని.. ఇక తమ సహనం నశించిందని ఐఆర్‌జీసీ పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ సహా వాటి మిత్ర దేశాలపై దాడులు చేస్తామని వెల్లడించింది. ఆయా దేశాలలోని మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని..చమురు, గ్యాస్ సరఫరాలకు ఏళ్ల తరబడి అంతరాయం కలిగిస్తామని హెచ్చరించింది.

## ఈ రాత్రితో ఇరాన్ నాగరికత అంతం



వుదయం డెస్క్:

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు.

మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది.

**50 లక్ష్యాలపై దాడులు..**

ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్ లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికాఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి.

**ఇరాన్ దెబ్బ రుచి చూస్తారు**

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచిపెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

## పవన్ ఖేడా ఇంటికి అస్సాం పోలీసులు



వుదయం డెస్క్:

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సతీమణికి 3 దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దీంతోపాటు ఆమె ఆస్తులను ఆయన అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచి పెట్టారని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హిమంత సతీమణి రిణికి భూయాన్, పవన్ ఖేడాపై కేసు పెట్టారు. దీంతో అస్సాం పోలీసుల బృందం నేడు దిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లారు. వారు ఆయనను అదుపులోకి తీసుకొని విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు పవన్ నివాసానికి వెళ్లేటప్పటికి ఆయన అక్కడ లేకపోవడంతో..వారు ఆయనకోసం ఎదురుచూస్తున్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పవన్ ఖేడా తనపై తప్పుడు ఆరోపణలు చేశారని హిమంత సతీమణి రిణికి భూయాన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. భారత్ ఎటువంటి ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతించదని.. కానీ తనకు మూడు పాస్‌పోర్ట్‌లు ఉన్నాయని కాంగ్రెస్ నేత నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న సమయంలో తమ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే కాంగ్రెస్ నేతలు ఇలా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

## ఇరాన్ రాజధానిలో వైమానిక దాడులు




టెహ్రాన్:

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని అమెరికాఇజ్రాయెల్‌లు వైమానిక దాడులతో బీభత్సం సృష్టించాయి. ప్రధాన రవాణా మార్గాలపై వరుసగా వైమానిక దాడులు జరిగాయి. ఇరాన్ మీడియా కథనాల ప్రకారం.. ఈ దాడులు హెమ్మత్ హైవే ప్రాంతంలో ఉత్తర రన్‌వే జరిగినట్లు తెలుస్తోంది. తాజాగా జరిగిన దాడుల్లో పలు వంతెనలు, రహదారులు లక్ష్యంగా మారాయి. తబ్రీజ్-టెహ్రాన్ ఫ్రీవే, జంజాన్-టెహ్రాన్ ఫ్రీవే, కోమ్‌లోని రవాణా మార్గాలు కూడా దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇరాన్ విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. యుద్ధం మొదలైనప్పటి నుంచి 238 మంది విద్యార్థులు, 49 మంది ఉపాధ్యాయులు, 7 మంది టీనేజర్లు ప్రాణాలు కోల్పోయారు. 178 మంది విద్యార్థులు, 24 మంది ఉపాధ్యాయులు గాయపడినట్లు తెలిపింది. నివేదికల ప్రకారం, ఇప్పటి వరకు 764 పాఠశాలలు లక్ష్యంగా అమెరికా దాడులు జరిపినట్లు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. వీటిలో ఎక్కువ భాగం టెహ్రాన్, కెర్మాన్షా ప్రావిన్సులలో ఉన్నాయి. పౌర ప్రాంతాలపై జరిగిన ఈ దాడులు అనేక మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రాణాలను బలి తీసుకున్నాయి.

పాఠశాలలు, వంతెనలు, రహదారులు వంటి పౌర మౌలిక సదుపాయాలపై దాడులు జరగడం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పౌరులపై దాడులు యుద్ధ నేరాలుగా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టెహ్రాన్-కరాజ్ ఫ్రీవేపై జరిగిన తాజా వైమానిక దాడులు ఇరాన్‌లోని పౌర జీవనాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోవడం, పాఠశాలలు ధ్వంసం కావడం దేశ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. యుద్ధం కొనసాగితే ఇరాన్‌లోని పౌర మౌలిక సదుపాయాలు నాశనమయ్యే పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## 'యుద్ధం కొత్త దశలోకి .. రెండింతలు దాడులు'



వుదయం డెస్క్:

ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ మొదలుపెట్టిన యుద్ధం హోర్ముజ్ జలసంధి మూసివేత తరువాత మరింత ఉద్రిక్తంగా మారింది. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత ముదురుతున్నాయి. ఇరాన్ తన క్షిపణి వ్యవస్థలను రెట్టింపు చేస్తూ 'కొత్త దశ యుద్ధం' ప్రారంభమైందని ప్రకటించడం ఇప్పుడు అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది.

**'రెట్టింపు దాడులు' - ఇరాన్ హెచ్చరిక**


మరోవైపు ఇప్పటికే ద్వంద్వ ప్రయోగ క్షిపణి వ్యూహాన్ని ఇరాన్ వివరించింది. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఏరోస్పేస్ దళాల కమాండర్ బ్రిగేడియర్ జనరల్ సయ్యద్ మజీద్ మౌసావి ఒక వీడియోను పోస్ట్ చేశారు. 'యుద్ధం కొత్త దశ ప్రారంభమైంది' అని పేర్కొన్నారు. ఇరాన్, ఖైబర్ షెకాన్ మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణితో పాటు ఫతా 110, ఫతే313 ,ఫతా వంటి కొత్త హైపర్‌సోనిక్ వేరియంట్‌లతో సహా ఫతా శ్రేణికి చెందిన వ్యవస్థలను ఉపయోగించి, గత దాడులన్నీ రెండింతలు ఎక్కువవుతాయని హెచ్చరించారు.

ఖార్గ్ ద్వీపంపై జరిగిన దాడుల నేపథ్యంలో చమురు, గ్యాస్ సరఫరాలకు దీర్ఘకాలిక అంతరాయం కలుగుతుందని గల్ఫ్ దేశాలను ఇరాన్ హెచ్చరించిన నేపథ్యంలో, ద్వంద్వ ప్రయోగ క్షిపణి వ్యూహాన్ని ఐఆర్‌జీసీ కమాండర్ వివరించారు. ఇరాన్ మౌలిక సదుపాయాలపై జరిగిన దాడుల నేపథ్యంలో ఇరాన్ తన క్షిపణి కార్యకలాపాలను పెంచుతోంది అంటూ ఒక ఐఆర్‌జీసీ కమాండర్ నుండి వచ్చిన మొదటి అధికారిక ప్రకటన ఇది కావడం గమనార్హం.

దీంతో పాటు, మంచి పొరుగు సంబంధాలు, ఆత్మసంయమనం ముగిశాయి అంటూ పర్షియన్ గల్ఫ్‌లోని దేశాలకు ఐఆర్‌జిసి మరో హెచ్చరిక జారీ చేసింది. ఫతే శ్రేణిలో సాధారణంగా 200 కిలోమీటర్ల నుండి 500 కిలోమీటర్లకు పైగా పరిధి గల స్వల్ప నుండి మధ్యశ్రేణి క్షిపణులు ఉంటాయి. ఫతా వంటి హైపర్‌సోనిక్ రకాలు మాక్ 15 వరకు వేగాన్ని అందుకోగలవని ఇరాన్ పేర్కొంది.

హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలని, లేకపోతే వంతెనలు, ఇంధన కేంద్రాలతో సహా మౌలిక సదుపాయాలపై దాడులు ఎదుర్కోవలసి వస్తుందంటూ డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువుకు కొన్ని గంటల ముందు ఈ దాడులకు ప్లాన్ జరిగినట్లు సమాచారం. ఇటీవలి రోజుల్లో, అమెరికాతో ఎలాంటి చర్చలు జరగడం లేదని, జలసంధిని తిరిగి తెరవడానికి అవసరమైన షరతులు ఇంకా పరిష్కారం కాలేదని ఇరాన్ అధికారులు, ప్రభుత్వ మీడియా పేర్కొన్నాయి. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా విధించిన గడువు (మంగళవారం రాత్రి 8 గంటలే) ముగియకముందే సంచలన హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లో ఇప్పుడు పాలన మారి అద్భుతం జరుగుతుందని అనుకుంటున్నా. ఈ రాత్రి చరిత్రలో అత్యంత కీలకం. 47 ఏళ్ల దోపిడీ, అవినీతి అంతమవుతుందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## 10వేలకు పైగా విమానాలు రద్దు



వుదయం ఢిల్లీ:

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ నుంచి ఆ ప్రాంతానికి వెళ్లే విమాన సర్వీసులను దేశీయ విమానయాన సంస్థలు రద్దు చేస్తున్నాయి. యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 10 వేలకు పైగా విమాన సర్వీసులు రద్దయినట్లు పౌరవిమానయాన శాఖ వెల్లడించింది. పశ్చిమాసియాకు భారత్ నుంచి రోజుకు 300 నుంచి 350 వరకు విమాన సర్వీసులు నడుస్తుంటాయి. ఘర్షణల కారణంగా ఆ సంఖ్య 8090కి పడిపోయిందని పేర్కొంది. మరోవైపు.. సుదూర విమాన ప్రయాణాలకు సంబంధించి పైలట్ల 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్'ను డీజీసీఏ తాత్కాలికంగా సడలించింది. విమాన కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకునేందుకే ఈ నిర్ణయమని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## ఇరాన్‌లోని భారతీయులకు ఎంబసీ సూచనలు



వుదయం డెస్క్:

మరోసారి అమెరికాఇరాన్‌ల మధ్య యుద్ధం భీకర రూపం దాల్చబోతుందా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గత కొన్ని రోజులుగా కాస్త నెమ్మదించిన యుద్ధ మేఘాలు తీవ్ర రూపం దాల్చబోతున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఒకవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. 'ఇక ఇరాన్ నాశనం' అంటూ ప్రకటన.. మరొకవైపు 'రండి.. చూస్కుందాం' అంటూ ఇరాన్ కౌంటర్లతో యుద్ధ వాతావరణం ఇప్పటికే వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో ఉన్న భారతీయులకు పలు సూచనలు చేసింది ఇండియన్ ఎంబసీ. ఇరాన్‌లో ఉన్న భారతీయులెవరూ 48 గంటల పాటు ఎక్కడకు వెళ్లవద్దని, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉండాలని పేర్కొంది. విద్యుత్ ప్లాంట్లలకు చేరువలో గానీ, సైనిక స్థావరాలకు చేరువలో గానీ ఉండొద్దని స్పష్టం చేసింది. భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన హోటళ్లలో ఉండేవారు నిరంతరం తమతో టచ్‌లో ఉండాలని తెలిపింది. అంతా తామిచ్చే అప్‌డేట్‌స్‌ను క్రమం తప్పకుండా ఫాలో అవుతూ ఉండాలని స్పష్టం చేసింది.

ఇరాన్‌ను నామరూపాలు లేకుండా నాశనం చేస్తామని అతిపెద్ద హెచ్చరిక చేసిన నేపథ్యంలో ఇరాన్‌లోని భారత ఎంబసీ స్పందించింది. ఏ క్షణమైనా యుద్ధా మేఘాలు తీవ్రతరమయ్యే అవకాశం ఉన్నందున అత్యంత జాగ్రత్తలు అవసరమని తెలిపింది.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆరోగ్యమే మహాభాగ్యం అన్న జిల్లా కలెక్టర్



– ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

వరంగల్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా వరంగల్ నగరంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా ర్యాలీ, సదస్సు మరియు ఉచిత హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు.

**అవగాహన ర్యాలీ – మానవహారం**

ఉదయం ఎంజీఎం ఆసుపత్రి నర్సింగ్ కళాశాల నుండి ఐఎంఏ హాల్ వరకు నిర్వహించిన ఆరోగ్య ర్యాలీని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు. మార్గమధ్యంలో విద్యార్థులు, ఆశా కార్యకర్తలతో కలిసి 'మానవహారం' నిర్వహించి, ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు.

**శాస్త్రీయ దృక్పథంతోనే సంపూర్ణ ఆరోగ్యం**

అనంతరం ఐఎంఏ హాల్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది అనే నినాదంతో శాస్త్రీయ ఆరోగ్య పద్ధతులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జంక్ ఫుడ్ మాని, మిల్లెట్స్ పండ్లు, కూరగాయలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. మానసిక ఆరోగ్యం, శారీరక దృఢత్వంతో పాటు యోగా, ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత పొందాలని కోరారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.హెల్త్ క్యాంప్ , ప్రతిజ్ఞ అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్ చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించగా, ఎంజీఎం ఆసుపత్రిలో అధికారుల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కలెక్టర్ స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. చివరగా, ఆరోగ్య సంరక్షణపై అదనపు కలెక్టర్ సంధ్యారాణి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామిరెడ్డి, డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ సాంబశివరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్లు పెద్ద సంఖ్యలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుదాం




మెగా రక్తదాన శిబిరం ప్రారంభం - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :

రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుదామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు.99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల – జీజీహెచ్ ఆధ్వర్యంలో, మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సహకారంతో మంగళవారం జిల్లా కేంద్రంలోని చంపక్ హిల్స్ పరిధిలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో మెగా రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రక్తదానం అత్యంత మహత్తరమైన సేవ అని పేర్కొన్నారు. సమాజంలో అవసరమైన వారికి సమయానికి రక్తం అందించడం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.రక్తదానం చేయడం చాలా గొప్ప కార్యక్రమమని, యువత ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో వైద్య విద్యార్థులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి, మానవతా సేవకు తమ వంతు సహకారం అందించారు.వైద్యులు ఈ రక్త సేకరణ ప్రక్రియను పర్యవేక్షిస్తూ, దాతలకు అవసరమైన సూచనలు చేశారు.అదే విధంగా వైద్య కళాశాలలోని ల్యాబ్ ను సందర్శించి, పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, జీఎంసీ ప్రిన్సిపల్ డా. నాగమణి, ఆర్ఎంఓ డా. కోటాచలం, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ పాఠశాల, అప్పర్ ప్రైమర్ హాస్పిటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన : జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్ జిల్లా ఏప్రిల్ 7 వుదయం జిల్లా ప్రతినిధి):

మంగళవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, జిల్లాలోని తొర్రూరు పట్టణ కేంద్రంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికల)ప్రీ మెట్రిక్ , పోస్ట్ మెట్రిక్ అప్పర్ ప్రైమర్ హాస్పిటల్, హెల్త్ సెంటర్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో తరగతి గదులు, డార్మెంటరీ, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, టాయిలెట్స్, పరిసరాలను పరిశీలించి విద్యార్థిని, విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు, ప్రభుత్వం కల్పించే పక్కా డైట్ మెనూ ను కచ్చితంగా అమలు చేయాలని, నాణ్యమైన వేడివేడి ఆహార పదార్థాలను అందించాలని, భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు వహిస్తూ భోజనం, టిఫిన్స్, స్నాక్స్ సిద్ధం చేయాలని,పిల్లలకు, వసతి గృహాలు పాఠశాలలో భోజనం సిద్ధం చేసే సిబ్బందికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి అట్టి నివేదికలను సమర్పించాలని సంబంధిత వార్డెన్, ప్రిన్సిపల్ను ఆదేశించారు, ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలను క్రమం తప్పకుండా బ్రేక్ ఫాస్ట్, భోజనం, డిన్నర్ సమయాలలో సందర్శించి వారితో కలిసి భోజనం చేయాలని సూచించారు, వసతి గృహాలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ ,సానిటేషన్ లపై పిల్లలకు అవగాహన కల్పించాలని తెలిపారు, ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు, పిల్లల యొక్క హాజరు శాతం పూర్తిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు, నూతన టెక్నాలజీ ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తరగతులను నిర్వహించి ఉత్తమ ఫలితాలను సాధించుటకు కృషి చేయాలని తెలిపారు, అప్పర్ ప్రైమర్ హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ ను సందర్శించి ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ వివరాలను అడిగితెలుసుకున్నారు, మందుల స్టాక్ రిజిస్టర్, తదితర రికార్డులను తనిఖీ చేశారు, హాస్పిటల్ పరిధిలోని సబ్ సెంటర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా మెరుగైన వైద్యం ప్రతి ఒక్కరికి అందించాలని సూచించారు, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని మాత, శిశు మరణాలను జరగకుండా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది పోలీస్ సంబంధిత విభాగాలు నిత్యం ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా పెట్టాలని ఆదేశించారు, వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరికి ధైర్యం భరోసా కల్పించాలని తమ పరిధిలో ఉన్నటువంటి సేవలను వేగంగా అందించాలని సూచించారు ,ఆశా కార్యకర్తలతో మాట్లాడుతూ వార్డు గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ ను మెయింటైన్ చేయాలని, గర్భిణీ స్త్రీలను, చిన్న పిల్లలను ఇతర వ్యాధిగ్రస్తులను గమనిస్తూ ఉండాలని, సూచించారు,కలెక్టర్ వెంట తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగణేష్, సాంఘిక సంక్షేమ శాఖ డిసిఓ జయశ్రీ, ప్రిన్సిపల్ రత్నమాల, హాస్పిటల్ డాక్టర్స్ సుగుణాకర్ రాజు, నందన దేవి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, పాల్గొన్నారు,

## ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలి



ప్రముఖ గుండె వైద్య నిపుణులు రామక శ్రీనివాస్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'క్వాలిటీ సీపీఆర్ శిక్షణ ప్రారంభం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శ్రీవాస హెల్త్ సెంటర్, శ్రీవాస హెల్త్ ఫౌండేషన్ సంయుక్తంగా వినూత్నమైన జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. 2026 ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ఇతివృత్తం "ఆరోగ్యం కోసం కదిలిద్దాం, ప్రాణానికి అండగా నిలుద్దాం" అనే నినాదానికి అనుగుణంగా ఈ కార్యక్రమం రూపొందించబడింది. శ్రీవాస సంస్థ 1999 నుండి కమ్యూనిటీ కార్యక్రమాలను, 2009 నుండి సామాన్య ప్రజలకు సీపీఆర్ శిక్షణను అందిస్తోంది.నూతన లక్ష్యంతో 2025లో ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రతి పౌరుడికి చేరవేసేలా విస్తరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయ సిబ్బంది, పాఠశాలలు, కళాశాలలు, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ క్యాడెట్లు, పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాలకు ఈ శిక్షణ ఇస్తారు. అధునాతన పద్ధతులతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా క్యూసీపీఆర్ మానిక్యూన్లను , ఏఈడీ యంత్రాలను ఉపయోగించి హ్యాండ్స్ఆన్ శిక్షణ అందజేస్తారు.ముఖ్య ఉద్దేశ్యంతో ఆకస్మిక గుండెపోటు వంటి అత్యవసర సమయాల్లో ప్రాథమిక చికిత్స అందించి, ప్రాణనష్టాన్ని నివారించడమే ఈ ఏడాది కాల పరిమితి గల ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ శిక్షణ ద్వారా సామాన్య ప్రజలు సైతం అత్యవసర సమయాల్లో ప్రాణదాతలుగా మారే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## తొలిసారిగా 'ఉగాది-2026' డైరీ ఆవిష్కరణ



వరంగల్ జిల్లా యూనియన్‌కు అభినందనలు

జర్నలిజం విలువలను కాపాడటంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) దిక్సూచి

మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్‌లో వైభవంగా డైరీ ఆవిష్కరణ కార్యక్రమం

హైదరాబాద్/వరంగల్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :

సమాజంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిజం తన ఉనికిని చాటుకోవాలంటే విలువలతో కూడిన నిజాయితీ గల వృత్తి నైపుణ్యం అవసరమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో టియుడబ్ల్యూజే (ఐజేయు) వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రప్రథమంగా రూపొందించిన "2026 ఉగాది డైరీ"ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత ఏడు దశాబ్దాలుగా జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పోరాటంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) అగ్రభాగాన నిలుస్తుందని కొనియాడారు. రాష్ట్రంలో మరే జిల్లాలో లేని విధంగా, అందరికంటే ముందుగా వరంగల్ జిల్లా శాఖ సమగ్ర సమాచారంతో డైరీని రూపొందించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. జర్నలిస్టుల కష్టసుఖాల్లో యూనియన్ నాయకులు నిరంతరం తోడుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ రాంచందర్ మాట్లాడుతూ.. భవిష్యత్తు కార్యచరణలో భాగంగా ప్రతి సభ్యునికి యూనియన్ గుర్తింపు కార్డులతో పాటు, పోలీసు శాఖ సమన్వయంతో వాహనాలకు ప్రత్యేక స్టిక్కర్లను పంపిణీ చేస్తామని ప్రకటించారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, కోశాధికారి కోదాటి గోపాలకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు మిద్దెల రంగనాథ్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు కందుల శ్రీధర్, సీనియర్ జర్నలిస్ట్ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధిపై జర్మనీ 'కేఎఫ్ డబ్ల్యూ' బృందంతో మేయర్, కలెక్టర్ సమీక్ష



వరంగల్ టౌన్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :

గ్రేటర్ వరంగల్ నగర అభివృద్ధిలో భాగంగా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిపై జర్మనీకి చెందిన కేఎఫ్ డబ్ల్యూ బృంద ప్రతినిధులతో మంగళవారం రోజున నగర మేయర్ గుండు సుధారాణి, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ దృశ్య మాధ్యమ సమావేశంలో నగరానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో భాగంగా నగరానికి సంబంధించిన మూడు ముఖ్యమైన ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదికలను అధికారులు దృశ్యరూప ప్రదర్శన ద్వారా కేఎఫ్ డబ్ల్యూ ప్రతినిధులకు వివరించారు. నగరం అంతటా శాస్త్రీయమైన పద్ధతిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం.వేస్ట్ టు ఎనర్జీ చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ స్థాపన.సి అండ్ డి ప్రాజెక్ట్: నిర్మాణ రంగ వ్యర్థాల రీసైక్లింగ్ నిర్వహణ. ఈ ప్రాజెక్టుల ద్వారా నగర రూపురేఖలు మారడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు, ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ఈ సందర్భంగా మేయర్ మరియు కలెక్టర్ పేర్కొన్నారు. జర్మనీ ప్రతినిధుల బృందం ఈ నివేదికలపై సానుకూలంగా స్పందించి, ప్రాజెక్టుల అమలుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక అంశాలపై చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇంచార్జి ఎస్.ఈ. శ్రీనివాస్ రావు, అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ రాజారెడ్డి, సి.హెచ్.ఓ. రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య (అడ్మిన్), బిర్రు శ్రీనివాస్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు అందించాలి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఆసుపత్రిలో మందుల నిల్వలు సమృద్ధిగా ఉంచాలిఖమ్మం వెంకటేశ్వర్ నగర్ అర్బన్ పి.హెచ్.సి. ని ఆకస్మికంగా తనిఖీ జిల్లా కలెక్టర్

ఖమ్మం, వుదయం బ్యూరో ఏప్రిల్ 7, వుదయం ప్రతినిధి:

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.జిల్లా కలెక్టర్, స్థానిక వెంకటేశ్వర నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్, మెడికల్ వార్డ్, టాయిలెట్లు, శుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆసుపత్రిలో అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేకంగా విచారించి, అన్నిరకాల అవసరమైన మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రి రిజిస్టర్లన్నింటినీ స్వయంగా పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ల్యాబ్ పరీక్షలు, డయాగ్నస్టిక్ హబ్ సేవల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అన్ని పరీక్షల రిపోర్ట్‌లను వీలైనంత త్వరగా రోగులకు అందించాలని ఆదేశించారు.రోగులకు సమయానికి సరైన చికిత్స అందించడంతో పాటు అవసరమైన అన్నిరకాల ఔషధాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు.జిల్లాలోని ప్రతి పి.హెచ్.సి., అర్బన్ పి.హెచ్.సి. లలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది వివరాలను సమగ్రంగా సమర్పించాలని, ప్రతి కేంద్రంలో మంజూరు చేసిన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని, ఈ నివేదిక ఆధారంగా జిల్లాలో సిబ్బంది ఎక్కడ తక్కువగా ఉన్నారో గుర్తించి తక్షణమే సరి చేయడానికి అవకాశం ఉంటుందని, డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను కూడా ఖచ్చితంగా ధృవీకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఏఓ డాక్టర్ మోత్యను ఆదేశించారు.

ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట వైద్యాధికారిణి ఐ. దేవి శ్రీ, నర్సింగ్ అధికారిణి సయ్యద్ షమీమ్, ఫార్మసిస్ట్ ఎస్.కే. ముదస్సర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యంపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి జిల్లా కలెక్టర్ అంకిత్




భద్రాద్రి కొత్తగూడెం ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి):

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పాల్వంచ వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో మంగళవారంనిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న జిల్లాలో ప్రజలకు నాణ్యమైన అందుబాటులో ఉన్న వైద్య సేవలను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం అత్యంత కీలకమని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి అధికారి, సిబ్బందిపై ఉన్న బాధ్యతగా తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6 నుండి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రాష్ట్ర స్థాయి అవార్డులను స్వీకరించేందుకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతికి వెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు దారా ప్రసాద్,డిప్యూటీ డిఎం హెచ్ ఓ ప్రసాద్ నాయక్, డాక్టర్ స్పందన, డాక్టర్ తేజస్వి, వైద్య శాఖ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలి




ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లాలో వేసవిలో త్రాగునీరు ఎద్దడి లేకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేటఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి):

జిల్లాలో వేసవిలో త్రాగు నీరు ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం వి సి కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో వివిధ శాఖల పనితీరు, చేపట్టవలసిన పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కు అధికారులు రబీ 2025-26 సీజన్‌కు సంబంధించిన వరిధాన్యం కొనుగోలులో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 280 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు, వీటిలో దాదాపు అన్ని సెంటర్లు ప్రారంభించి, ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిపిసి సెంటర్ ఇన్‌చార్జిలకు సూచిస్తూ, ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని రకాల సామగ్రిని టీపీ సెంటర్లలో సిద్ధంగా ఉంచుకోవాలని, కొనుగోలు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలనిఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండాసమర్థవంతంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాల న్నారు. జిల్లాలోని అన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి, రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ కోరారు. ఉపాధి హామీ పథకం పనుల గురించి మాట్లాడుతూ గ్రామ పంచాయితీ లలో సరాసరి 100 మంది కూలీలతో పనిచేయించాలని . ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీల అందరికీ ద్వారా హాజరు తీసుకోవాలని. నర్సరీలల్లో 100% వుండేలా చూడాలని. నర్సరీలకు షేడ్ నెట్ లు ఏర్పాటు చేయాలని, అన్నీ రకాల రిజిస్టర్లు నిర్వహించాలని ఉపాధి హామీనందు అన్నీ పనులు యుక్తదార పోర్టల్ నందుచేయవలెనని, ముఖ్యంగా నీటి సంరక్షణ పనులు గుర్తించాలి అని ఆదేశించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా పట్టించమైన చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు, ఇబ్బందులు కలిగితే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అన్నారు అలాగే ఎఫ్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలని, బి ఎల్ ఓ వెరిఫై చేసి మ్యాపింగ్ ప్రోగ్రాం చేయాలని, బూత్ లెవెల్ ఏజెన్సీలను నియమించాలని, ఫారం పెండెన్సీ పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఎస్ఓ మోహన్ బాబు, సిపిఓ కిషన్, డిపిఓ యాదగిరి ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు .

## ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తల సేవలు అమూల్యమైనవి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



టేకుమట్ల ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి):

ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తల సేవలు అమూల్యమైనవని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.మంగళవారం టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు .ఈ సందర్భంగా నిర్వహించిన ఆశా కార్యకర్తలకు ఆశా డే శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ వరకు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని పక్కద్బందీగా అమలు చేయాలని వైద్య సిబ్బందికి ఆయన సూచించారు. ఆశా కార్యకర్తలు గ్రామ, మండల స్థాయిలో గర్భిణిలు సుఖ ప్రసవాలు జరిగేలా, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ మాతా శిశు మరణాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఆసుపత్రిలో ఎంతమందికి వైద్య సేవలు అందిస్తున్నారు, ఏ ఏ ప్రాంతాల నుండి వైద్య సేవలకు వస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు 70 మంది వరకు వైద్య సేవలకు వస్తున్నారని వైద్యులు తెలుపగా ఓపి సేవలు పెంచాలని సూచించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పోషణ లోపం ఉన్న చిన్నారులు ఎంత మంది ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. పోషణ లోపం ఉన్న చిన్నారులు లేరని తెలుపగా అభినందించారు. గ్రామం, మండలం వారిగా పోషణ లోపం ఉన్న చిన్నారుల జాబితా తయారు చేయాలని సూచించారు. బాల్యం నుండి ఆరోగ్యవంతమైన సమాజం తయారు కావాలని స్పష్టం చేసారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబొరేటరీని పరిశీలించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరీక్షల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ స్వరూప రాణి, ఎంపీడీవో అనిత, వైద్యులు డాక్టర్ నాగరాణి, హారిక, సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

## ఈవిఎం గోదాం నెల వారి తనిఖీ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



ములుగు, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి) :

ఈ.వి.యం. గోదాం ను జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. నెలవారి తనిఖీ నిర్వహించారు. మంగళవారం రోజున జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాము వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను తనిఖీ చేశారు. గోదాంలో అమర్చిన సీసీ కెమెరాల పనితీరును, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఏర్పాటు చేసిన ఫైర్ ఫైర్ ఎక్స్‌టింగిషర్ ను ఇతర అగ్నిమాపక పరికరాలను తనిఖీ చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఉన్న పోలీస్ బందోబస్తును, రిజిస్టర్లను కలెక్టర తనిఖీ చేశారు. భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఈవీఎంల భద్రత విషయంలో అత్యంత పారదర్శకతను పాటిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే గోదాం తనిఖీ చేయడం జరిగిందని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెంట్ ఎండి సలీం, డిప్యూటీ తాహసిల్దార్ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి టీజేఏ జిల్లా అధ్యక్షులు శానూర్ బాబా



యాదాద్రి భువనగిరి / ఏప్రిల్ (వుదయం జిల్లా ప్రతినిధి) :

యాదాద్రి భువనగిరి జిల్లాలోని పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడియేషన్ కార్డులు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అలాగే హెల్త్ కార్డులు అన్ని కార్పొరేట్ హాస్పటల్లో చెల్లుబాట్లు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, రైల్వే పాసులు ఇవ్వాలని, ఆన్లైన్ చేసే విధానంలో సాంకేతిక లోపాలను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట టీజేఏ మండల అధ్యక్షుడు సిహెచ్ రాజు, జిల్లా కార్యదర్శి గుర్రం మల్లేష్, నాగరాజు, జర్నలిస్టులు నరేష్, మహేష్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించనున్న బీజేపీ బృందం



నల్గొండ, ఏప్రిల్ (వుదయం జిల్లా ప్రతినిధి) :

ఆర్జలబావి వద్ద కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ బృందం సందర్శించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా. నాగం వర్షిత్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో మార్చి మొదటి వారం నుంచే వరి కోతలు ప్రారంభమైనప్పటికీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యమవుతోందని విమర్శించారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమవుతున్నాయని, తూకం యంత్రాలు, బస్తాల సరఫరా ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదని తెలిపారు. మిల్లులకు ట్యాగింగ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో రైతులు తమ పంటను అమ్ముకోవడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితిని ఉపయోగించుకొని కొందరు రైస్ మిల్లర్లు రైతులను తక్కువ ధరలకు దోచుకుంటున్నారని ఆరోపించారు. పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1066 కొనుగోలు కేంద్రాలు ఉండగా, అందులో 100 కూడా ప్రారంభం కాలేదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## గోదావరి పుష్కరాల పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ పరిశీలన

**జగిత్యాల (వుదయం ప్రతినిధి)** జిల్లాలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పురోగతిని సమీక్షించేందుకు జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ సమగ్ర పరిశీలన నిర్వహించింది ఈ పరిశీలనకు ఇంజినీర్ ఇన్ చీఫ్ (జనరల్) ఓవి రమేష్ బాబు జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ తో కలసి పరిశీలించారు ఈ సందర్భంగా గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి భద్రతా చర్యలు రవాణా సౌకర్యాలు తాగునీటి సరఫరా పారిశుద్ధ్య ఏర్పాట్లు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు ముఖ్యంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు అలాగే ఘాట్ల అభివృద్ధి పనులు రహదారి మరమ్మత్తులు విద్యుత్ సరఫరా తాత్కాలిక సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలను వేగవంతం చేయాలని టెక్నికల్ కమిటీ సూచించింది అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు



తీసుకోవాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి రాజ గౌడ్ జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ ఈఈపిఆర్ లక్ష్మణ్ రావు ఈఈ ఆర్ అండ్ బి శ్రీనివాస్ ధర్మపురి టెంపుల్ ఈవో శ్రీనివాస్ నీటి పారుదల శాఖ అధికారుల సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

### ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా

## సైక్లింగ్ ర్యాలీ లో "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి



**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)** సమాజంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నిస్తారని మరియు అహర్నిశలు కృషి చేస్తారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విఎన్నార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డా.వి. నరేందర్ రెడ్డి ప్రపంచ ఆరోగ్య దినోత్సవ పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, తో కలిసి ఏర్పాటు చేసినటువంటి హెల్తీ సైకిల్ ర్యాలీ ప్రారంభోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని మరియు ఆహారపు అలవాట్లు సైతం మార్చుకోవడం జరుగుతుందని వారు చెప్పారు. వ్యక్తిగతంగా లాభాలు చేకూరడమే కాకుండా సమాజపరంగా చాలా లాభాలు చేకూరుతాయని వారు తెలియపర్చారు. ప్రధానంగా పర్యావరణాన్ని కాలుష్యం నుండి సంరక్షించవచ్చని మరియు చక్కటి వాతావరణన్ని ఏర్పాటు చేయవచ్చని వారు అభిప్రాయ పడ్డారు. అభివృద్ధి చెందిన దేశాలలో సైతం సైక్లింగ్ కు చాలా ప్రాధాన్యత ఇస్తారని కావున ప్రతి ఒక్కరు సైక్లింగ్ అలవాటుగా చేసుకుని సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలని వారు పిలుపునిచ్చారు. సైక్లింగ్ చేయడం వలన చాలా ఆరోగ్యంగా ఉండగలుగుతారని మరియు రోజువారీ కార్యకలాపాలను ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వర్తించడమే కాకుండా అందులో విజయం సాధించగలుగుతారని అభిప్రాయ పడ్డారు. అగ్రదేశాలైన రష్యా, చైనా, జర్మనీ, కెనడా, సౌత్ ఆఫ్రికా తదితర దేశాల్లో సైక్లింగ్ కు చాలా ప్రాధాన్యత ఉన్నదని కావున సైక్లింగ్ ఉన్నటువంటి లాభాలను తెలుసుకొని దానిని రోజువారి కార్యక్రమంలో మల్చుకొని సైక్లింగ్ పట్ల శ్రద్ధ వహించాలని వారు చెప్పారు.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తన సారథ్యంలో కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని మరియు నిర్వహణలో భాగంగా మంగళవారం ర్యాలిని నిర్వహించడం చాలా గొప్ప విషయమని మరియు స్ఫూర్తిదాయకమని వారు చెప్పారు ఈ కార్యక్రమంలో కరీంనగర్ రెనీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి , కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి మహేందర్ , ట్రాఫిక్ సిఐ బి.సంజీవ్ ట్రాఫిక్ ఎస్ఐ హనుమంతు తదితరులు పాల్గొన్నారు. అసోసియేషన్ బాధ్యులు ఎం.అరవింద్ , రమేష్ , జిల్లా పోలీస్ కమిషనరేట్ సిబ్బంది, రేని గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సిబ్బంది, కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వారు తెలియపరిచారు. ఈ ర్యాలీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండి బస్టాండ్ మీదుగా, తెలంగాణ చౌక్, ఆర్ అండ్ బి చౌరస్తా, కోర్ట్ చౌరస్తా మరియు రెనీ హాస్పిటల్ వారికి కొనసాగింది దాదాపు వందకు పైగా సైకిలిస్టులు పాల్గొన్నారు.పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని వారు చెప్పారు.

### ఘాట్ల అభివృద్ధి..మౌలిక వసతులపై

## వసతులపై కలెక్టరేట్‌లో సమీక్ష

### కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలన




**ధర్మపురి (వుదయం ప్రతినిధి ):** రానున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కీలక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సమావేశంలో రాష్ట్ర టెక్నికల్ కమిటీ సభ్యులు సమగ్ర పరిశీలన చేపట్టారు. ఇంజినీర్ఇన్‌చీఫ్ ఓ.వి. రమేష్ బాబుతో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పుష్కర పనుల పురోగతిని సమీక్షించారు.సమన్వయం తో ముందుకు సాగాలిఈ సందర్భంగా టెక్నికల్ కమిటీ సభ్యులు మాట్లాడు తూ, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో వసతులు కల్పించాలని సూచించారు.నదీ తీరంలో భక్తుల పుణ్య స్నానాలకు వీలుగా ఘాట్ల అభి వృద్ధి పనులను యుద్ధ ప్రాతిపది కన పూర్తి చేయాలి. ప్రధాన రహదా రుల మరమ్మత్తులతో పాటు రవా ణా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి.నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, తాత్కాలిక షెడ్ల ఏర్పాటులో ఏమాత్రం అలసత్వం వహించ కూడదు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని టెక్నికల్ కమిటీ స్పష్టం చేసింది. జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్,ఆర్డీవో మధుసూ దన్, ఈఈ పీఆర్ లక్ష్మణ్ రావు ,ఈఈ ఆర్ అండ్ బి శ్రీనివాస్,ధర్మపురి ఆలయ ఈవో శ్రీనివాస్,నీటి పారుదల శాఖ అధి కారులు,వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ధర్మపురి మార్కెట్ కమిటీకి రూ. 1.60 కోట్ల నిధులు

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో నిధుల మంజూరు**
**మార్కెట్ ఫీజు వసూళ్లలో జిల్లాలోనే ప్రథమం..**
**చైర్‌పర్సన్, సిబ్బందికి అభినందనలు**

**ధర్మపురి, వుదయం ప్రతినిధి ):** ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో మౌలిక సదు పాయాల కల్పనకు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భారీగా నిధులు మంజూరు చేశారు. మార్కెట్ యార్డులో అభివృద్ధి పనుల నిమిత్తం మార్కెటింగ్ శాఖ ద్వారా రూ. 160.00 లక్షల నిధుల మంజూరుకు సంబంధించిన ప్రోసిడింగ్‌ను ఆయన మంగళవారం అందజేరు. మంత్రి మంజూరు చేసిన ఈ నిధులతో మార్కెట్ కమిటీ పరిధిలోని దుబ్బాల గూడెం గ్రామంలోగల నాబార్డ్ గోదాము చుట్టూ రక్షణ గోడ నిర్మాణం చేపట్టనున్నారు. వీటితో పాటు మార్కెట్ యార్డులో నూతనంగా చైర్మన్ ఛాంబర్ నిర్మాణం,యార్డు ఆవరణలో సీసీ రోడ్ల పనులను పూర్తి చేయనున్నారు. మార్కెట్ అభివృద్ధికి తక్షణమే స్పందించి నిధులు కేటాయించినందుకు గాను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, వైస్ చైర్మన్ సంగ నర్సింహులు ఇతర సభ్యులతో కలిసి మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ధర్మపురి మార్కెట్ కమిటీ ఆదాయ వసూళ్ల లో సరికొత్త రికార్డు సృష్టించింది. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు రూ. 239.49 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించగా, కమిటీ యంత్రాంగం ఏకంగా రూ. 382.46 లక్షల మార్కెట్ ఫీజును వసూలు చేసింది. నిర్దేశించిన లక్ష్యం కంటే అధికంగా ఆదాయా న్ని రాబట్టి, జగిత్యాల జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు గాను జిల్లా గ్రంథాలయం చైర్మన్ సంగనాబట్ల.దినేష్,చైర్‌పర్సన్ లావణ్య లక్ష్మణ్ , కార్యదర్శి డి. శ్రీనివాస రావు, సిబ్బందిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ సంద ర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన వారిలో మార్కెట్ కమిటీ సభ్యులు వాంకుదోత్ గీతాంజలి, గంధం రాజయ్య, కాశెట్టి రాజు, గునిశెట్టి అంజయ్య, మార్కెట్ కమిటీ కార్యదర్శి డి. శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



### పారదర్శకంగా..

## రాజన్న కోడెల పంపిణీ

**పక్కదారి పట్టించే వారి పై కఠిన చర్యలు తీసుకుంటాం**
**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
**హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా, వుదయం** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాల కోడెలను అర్హులైన రైతులకు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని, కోడెలను సంరక్షించి.. సాగు పనులకు వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. వేములవాడ పట్టణం తిప్పాపూర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో రైతులకు మంగళవారం కోడెల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరై రైతులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. ప్రభుత్వ విప్, కలెక్టర్ కు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఇంచార్జి ఈఓ అంజనారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారి పత్రాలను అధికారులు తనిఖీ చేస్తుండగా, ప్రభుత్వ విప్, కలెక్టర్ పరిశీలించి.. రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి కోడెను కట్టే సంస్కృతి వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో ఉందని గుర్తు చేశారు. భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు అని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు తిప్పాపూర్ గోశాలలో ఉచితంగా స్వామివారి కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పంపిణీ చేసిన కోడెలను తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు. కోడెలను పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ పరిధిలో అధునాతన సౌకర్యాలతో సువిశాల స్థలంలో గోశాల నిర్మాణానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రూ.150 కోట్లతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. కోడెలను రైతులు సంరక్షించాలని సూచించారు.

**అర్హులైన రైతులకు మాత్రమే పంపిణీ**

కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..



ఆన్లైన్ లో అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకున్న రైతులకు కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతులు ఆన్లైన్ లో దరఖాస్తులను వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీ చేసిన తర్వాత రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, పరిసర జిల్లాలకు చెందిన 1.5 నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న సన్నకారు, చిన్నకారు అర్హులైన రైతులకు మాత్రమే పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. అర్హులైన రైతులకు కోడెల పంపిణీ నిరంతరం చేస్తామని తెలిపారు. కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.కోడెలను తీసుకు వెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు. వాటిని ఎల్లప్పుడూ అధికారులతో తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు. గోశాలలో కోడెల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటు న్నామని, గడ్డి, నీరు, అందిస్తున్నామని, దాదాపు 8 కూలర్లు ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. అలాగే జిల్లా పశు వైద్యాధికారి, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీఓ రాధాభాయ్, ఆలయ ఇంచార్జి ఈఓ అంజనారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్, వ్యవసాయ, రెవెన్యూ పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి

**పెద్దపల్లి (వుదయం ప్రతినిధి)** ఓదెల మండలం పిట్టల ఎల్లయ్యపల్లి గ్రామంలో 15 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లు ప్రారంభోత్సవం మరియు రూ. 20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ నిర్మాణం కోసం స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన గౌరవ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు.. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణా రావు గారు మాట్లాడుతూ....తెలంగాణ ప్రజాప్రభుత్వం ఏర్పడ్డ రెండేళ్ల మూడు మాసల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టుకోవడం జరిగింది అని అన్నారు. ప్రజాపాలన ప్రగతిప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకోవడం జరుగుతుంది అలాగే ప్రజా ప్రభుత్వంలో పిట్టల ఎల్లయ్యపల్లి గ్రామానికి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక 65 లక్షలు రూపాయల నిధులతో గ్రామ అభివృద్ధి కోసం వెచ్చించడం జరిగింది అని తెలిపారు. పాఠశాల కాంపౌండ్ వాల్ మరియు అంగన్వాడీ భవనం, మహిళా ఐకేపీ సంబంధించిన మహిళా సమైక్య భవనం కోసం వారం రోజుల్లో 5 లక్షల రూపాయల నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పూర్తి చేసుకోవడం జరుగుతుంది అని గ్రామప్రజల ఆలోచన మేరకే గ్రామ అభివృద్ధికి మంచి ప్రణాళికలు వేసుకొని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుకుందామని అన్నారు. త్వరలోనే పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బస్సు డిపో నిర్మాణం పూర్తి అవ్వడంతోనే పిట్టలఎల్లయ్య పల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తానని అలాగే ఓదెల నుండి పలు ప్రాంతాలకు ప్రజలు వెళ్లే విధంగా బస్సు సౌకర్యలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500/ రూపాయలకు గ్యాస్ సిలిండర్, సన్నరకం వడ్లకు 500 బోనస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డుల మంజూరు, కళ్యాణలక్ష్మి/షాది ముబారక్ చెక్కులు అందించడం జరుగుతుంది అని అన్నారు. అలాగే కాంగ్రెస్



ప్రభుత్వం నూతనంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా ఆర్థిక సహాయం, ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలు అమలులోకి తీసుకు రావడం జరుగుతుందని తెలిపారు. దివ్యంగులైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెట్రో ఫిట్టేడ్ మోటరైజ్డ్ వాహనలు పంపిణితో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను చేరవేసేలా ప్రభుత్వ కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించడం జరిగింది అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటూ అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు కలిగినా కూడా సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గౌరవ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు గారు గుర్తు చేశారు. గ్రామ సర్పంచ్, పిట్టల రవి ఉపసర్పంచ్, శ్రీకాంత్, మండల అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి,వార్డు సభ్యులు మరియు అల్ల సుమన్ రెడ్డి, గోపు నారాయణ రెడ్డి, ఏదేలి విజపాల్ రెడ్డి, రెడ్డి రజింకాంత్,ఆకుల మహేందర్, బొంగోని శ్రీనివాస్, బైరి రవి గౌడ్,మార్కెట్ డైరెక్టర్లు సమ్మయ్య, కొమురయ్య, నరేష్,మరియు గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు మరియు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్య ఆదిలాబాద్

## లక్ష్యంగా కృషి చేయాలి



**ఆదిలాబాద్ వుదయం ప్రతినిధి :** ప్రజారోగ్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పనిచేసి ఆదిలాబాద్ జిల్లాను ఆరోగ్యవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వైద్య శాఖ అధికారులకు సూచించారు. ప్రజాపాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం స్థానిక రిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలకు ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య ఆదిలాబాద్ లక్ష్యంతో ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సేఫ్ మదర్ హుడ్, ఎయిడ్స్ నివారణ, ఆయుష్ సేవలు వంటి అంశాలపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రిమ్స్ ఆసుపత్రి జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాల ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని కొనియాడారు.

## విద్యార్థులకు అటవీశాఖ శుద్ధ జలం అందించడం అభినందనీయం

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని ఎంజేబీ పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి , జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు అందించడం చాలా ముఖ్యమని తెలిపారు.అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ తాగునీటి శుద్ధి కేంద్రం ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని పేర్కొన్నారు.జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా అటవీ శాఖ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ స్వాతి, అటవీ శాఖ అధికారులు గోవింద్ చంద్ సర్దార్, యోగేష్ కులకర్ణి, మహేందర్, రాజేష్, వెంకటేశ్వర్ తదితర అధికారులు , పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.



## మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం




**మంచిర్యాల / (వుదయం ప్రతినిధి)** ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుండి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. అనిత, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఆర్.ఎం.ఓ.లు భీష్మ, శ్రీధర్, ప్రోగ్రామ్ అధికారులు డా. ప్రసాద్, డా. సుధాకర్ నాయక్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుజాత లతో కలిసి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒకరికి మెరుగైన వైద్య సేవలు అందించడం కొరకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పారిశుధ్య నిర్వహణ ద్వారా ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మరింత మెరుగవుతాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 25 ఆరోగ్య కేంద్రాలు, 100 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, పట్టణ దవాఖానాలు, మాతా శిశు ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని 10 లక్షల రూపాయల పరిమితికి పెంచి ప్రజా సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులలో సిబ్బంది నియామకం చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. బెల్లంపల్లి, లక్షెట్టిపేట ప్రాంతాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని, జిల్లాలోని భీమారం, కన్నేపల్లి మండల కేంద్రాలలో ప్రజల సౌకర్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, చెన్నూర్ పట్టణంలో సామాజిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎక్స్ రే, ఫోటోథెరపి సేవలు అందిస్తున్నామని, నర్సింగ్ కళాశాల పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆరోగ్యం కోసం ఐక్యంగా విజ్ఞాన శాస్త్రం అండతో సమగ్ర ఆరోగ్యాన్ని భవిష్యత్తు కోసం తయారు చేసుకోవాలని, 72 రకాల రక్త పరీక్షలు తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా అందించడం జరుగుతోందని తెలిపారు. జాతీయ క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా కేసులను గుర్తించడము, మొబైల్ ఎక్రే ద్వారా మారుమూల గ్రామాలలో పరీక్షలు చేయడం, జాతీయ కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మాతా శిశు సంరక్షణలో 100 శాతం గర్భవతుల నమోదు, ఆసుపత్రులలో ప్రసవాలు, సిజేరియన్లు లేకుండా సాధారణ ప్రసవాలపైన ప్రజలలో అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. 100 శాతం టీకాలు ఇప్పించడం, అసంక్రమణ వ్యాధులు 30 సంవత్సరముల పైబడిన వారందరికీ పరీక్షలు చేయడం, డయాబెటిస్, బిపి, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి సరైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. 14 సంవత్సరాల వయసు నిండిన బాలికలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ అందించడం జరుగుతుందని, తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు, నర్సింగ్ అధికారులు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వైద్యాధికారులు డా. అమర్, డా. రమ్య, వైద్య సిబ్బంది, నర్సింగ్ కాలేజ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

### ఈవీఎం గోడౌన్ ను

## సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్, ఏప్రిల్ 07:** జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మంగళవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ సీళ్లను, పోలీసు బందోబస్తును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ తదితరులు ఉన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## వృద్ధురాలిని కాపాడిన క్షేత్రస్థాయి అధికారి సాయి

**నారాయణపేట, ఏప్రిల్ 7 (వుదయం ప్రతినిధి):**

నారాయణపేట జిల్లా కేంద్రం లో గురిముల్లా సత్యమ్మ భర్త గోపాల్ రెడ్డి అనే వృద్ధు రాలు రోడ్డుపై ఒంటరిగా తిరుగుతున్నట్లు గమనించిన స్థానిక ట్రాఫిక్ పోలీస్ ఎస్సై ఆమెను సురక్షితంగా మంగళ వారం ఆర్డీఓ కార్యాలయానికి తీసుకువెళ్లారు.ఆర్డీఓ వృద్ధు రాలి వివరాలు తెలుసుకొని వెంటనే క్షేత్రస్థాయి అధికారి సాయికి సమాచారం అందిం చారు. అనంతరం ఆర్డీఓ ఆదేశాల మేరకు వృద్ధురా లిని వయోవృద్ధుల ఆశ్ర మంలో తాత్కాలికంగా చేర్పించారు.వృద్ధురాలికి కుమారుడు ఉన్నట్లు తెలిసి నందున, ఆయనను పిలిపిం చి తల్లిదండ్రుల సంరక్షణ చట్టం ప్రకారం తల్లిదండ్రుల ను చూసుకోవాలని సూచి స్తూ, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని ఆర్డీఓ హెచ్చరించారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారి సాయి మాట్లాడు తూ అనాధగా లేదా సహా యం అవసరమైన వృద్ధులు ఎక్కడ కనిపించినా వెంటనే మాకు సమాచారం అందిస్తే తగిన సహాయం అందిస్తా ము అని తెలిపారు.

### ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా

## సంగారెడ్డిలో 5కే రన్ నిర్వహణ





**సంగారెడ్డి, ఏప్రిల్ 7 (వు దయం):**

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో మంగళవారం 5కే రన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ అంజి రెడ్డి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య జెండా ఊపి ప్రారంభించారు. మెడికల్ కాలేజీ నుంచి ఐబి వరకు ఈ రన్ కొనసాగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ, ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు పలు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారానే వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. సాధారణంగా 40-50 ఏళ్ల తర్వాతే ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుందని, అయితే ప్రస్తుత యువత ముందుగానే ఆరోగ్యంపై దృష్టి సారించడం శుభపరిణామమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల కోసం వైద్యులు సరైన జీవనశైలిపై మార్గదర్శకాలు అందించాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించినట్లుగా సమతుల్య ఆహారం, వ్యాయామం, పరిశుభ్రత, మానసిక ప్రశాంతత ఆరోగ్యానికి ముఖ్యమని తెలిపారు. యువత ఈ అంశాలను పాటించి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు.ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి శాస్త్రీయ దృక్పథంతో జీవించాలని, జీవనశైలిలో మార్పులు తీసుకురావాలని అన్నారు. శాస్త్రసమ్మత జీవనశైలిని అనుసరించడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. రోజువారీ జీవితంలో ఒత్తిడి, చిరాకు వంటి సమస్యలను తగ్గించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్‌రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, డీఎస్పీ సత్తయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మెడికల్ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



## త్వరితగతిన జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**వికారాబాద్ : (వుదయం ప్రతినిధి):**

జిల్లాలో పరిపాలన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.మంగళవారం జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ భవనం నిర్మాణం ద్వారా అన్ని విభాగాలను ఒకే చోట సమీకరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని,నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.భవనంలో ఆధునిక సౌకర్యాలు, సమావేశ మందిరాలు, కార్యాలయ గదులు ఏర్పాటు చేస్తున్నట్లు,భవనం నిర్మాణంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని,అవసరమైన మౌలిక సదుపాయాలు విద్యుత్, నీటి సరఫరా, పార్కింగ్ వసతులు కల్పించాలని అన్నారు.ఈ భవనం పూర్తయిన తరువాత ప్రజలకు పరిపాలనా సేవలు వేగవంతంగా, సులభంగా అందుతాయని అన్నారు. మొదటి అంతస్తు పనులు పూర్తి అయిన వాటికీ పేంటింగ్ పనులు పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు.కలెక్టర్ గారి తో పాటు జడ్ పి సి ఇ ఓ సుదీర్, ఉమేష్ కుమార్, డిప్యూటీ ఇ ఇ శ్రీనివాస్, సంబంధిత అధికారులు ఉన్నారు.




## ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే అనుకున్న లక్ష్యాలు సాధిస్తాం

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల ,ఏప్రిల్ 7(వుదయం ప్రతినిధి):**

ప్రతి మనిషి జీవితంలో ఆరోగ్యంగా ఉండడం ప్రధానమని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే ఎవరైనా సరే తాము అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గద్వాల పాత డీఎంహెచ్వో కార్యాలయం వద్ద గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ హెల్త్ డే ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కళాశాలల విద్యార్థులతో పాటు ముఖ్య అతిధులు, వైద్య సిబ్బంది ర్యాలీలో పాల్గొనగా పాత బస్టాండ్ మీదుగా కృష్ణవేణి చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టుగెదర్ ఫర్ హెల్త్ స్టాండ్ విత్ సైన్స్ నినాదంతో ఈ ఏడాది వరల్డ్ హెల్త్ డే ను నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా వైద్యాధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి మనిషి తమ జీవితంలో వ్యాయామాన్ని, యోగ, ధ్యానంను ఒక భాగంగా చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ మనిషికి ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే వృధానే అని అభిప్రాయపడ్డారు. అందుకే మన పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదాన్ని చెప్పడం జరిగిందన్నారు. ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వాములను చేసి అవగాహన కలిగించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, డిడబ్ల్యుఓ సునంద, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, పలువురు కౌన్సిలర్లు, లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.



## మైనర్ బాలిక వేధింపులు పాత నేరస్థుడు అరెస్ట్

- సిద్దిపేట టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. ఉపేందర్

**సిద్దిపేట,ఏప్రిల్ 07 ( వుదయం ప్రతినిధి ):**

ప్రేమ పేరుతో మైనర్ బాలికను వేధిస్తూ, సాక్షులను బెదిరింపులకు గురిచేస్తున్న వ్యక్తిని సిద్దిపేట టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం టూ టౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన బర్మా వెంకటేష్ గతంలో ఒక మైనర్ బాలికతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకున్నాడు. అనంతరం ప్రేమ పేరుతో ఆమెను వేధించడంతో, బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటికే కేసు నమోదు కాగా, నిందితుడు జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. జైలు నుండి విడుదలైన తర్వాత కూడా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, బాలిక ఫోటోలను మార్ఫింగ్ చేసి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆమె స్నేహితులకు పంపడం ప్రారంభించాడు.అంతేకాకుండా తనపై నమోదైన కేసులోని సాక్షులను భయపెట్టే విధంగా బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.ఈ మేరకు బాధితురాలి తండ్రి ఫిర్యాదు ఆధారంగా సిద్దిపేట టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. ఉపేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు బర్మా వెంకటేష్‌ను మంగళవారం అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.సోషల్ మీడియా వేదికగా మహిళలను, ముఖ్యంగా మైనర్ బాలికలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టం నుండి ఎవరూ తప్పించుకోలేరని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ హెచ్చరించారు.

## గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- రిజ్వాన్ బాషా షేక్

**అలంపూర్, ఏప్రిల్ 07 (వుదయం ప్రతినిధి):**



గురుకుల విద్యాలయాల్లో ప్రభుత్వం విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఉండవెల్లిలోని ప్రభుత్వ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, వంటగది, భోజనశాల, నిల్వ గది, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వంట గదిలో ఎల్లప్పుడూ శుభ్రతను పాటిస్తూ, ఆరోగ్యానికి అనుకూలమైన వాతావరణం ఉండేలా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్టోర్ రూమ్ లో అవసరమైన సరుకులు తగిన మోతాదులో నిల్వ ఉంచాలని, ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు పోషకాహారం అందించాలని ఆదేశించారు. తరువాత విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్ భోజనం, క్రీడా సమయం, తరగతులు, మరుగుదొడ్ల పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై వివరాలు తెలుసుకోగా, విద్యార్థినులు సంతృప్తికరంగా సమాధానాలు ఇచ్చారు. విద్యార్థినులు బాగా చదివి రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి అవసరమైన మార్గదర్శనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మరుగుదొడ్లు రోజుకు కనీసం రెండు సార్లు శుభ్రం చేయాలని, పాత వస్తువులను తొలగించి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనుమతి లేని వ్యక్తులను పాఠశాల ప్రాంగణంలోకి అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు.
ఈ పర్యటనలో తహసీల్దార్ ధరణీషా, ఎంపీడీఓ తిరుపతయ్య, ప్రధానోపాధ్యాయులు ఎలిజబెత్, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు,తదితరులున్నారు.

## జనగణన 2027 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**వనపర్తి ఏప్రిల్ 7 (ఉదయం ప్రతినిధి)**

జన గణన 2027 ప్రక్రియలో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్(హెచ్ ఎల్ బీ) లను గుర్తించడం అత్యంత కీలకమని, కాబట్టి హెచ్‌ఎల్బీలను జాగ్రత్తగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో త్వరలో ప్రారంభం కానున్న జనగణన ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సంబంధిత చార్జ్ ఆఫీసర్లు, అదనపు ఛార్జ్ ఆఫీసర్లు, స్టాటిస్టికల్ ఆఫీసర్లు, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి జనగణన ప్రక్రియపై పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జన గణన 2027 ప్రక్రియలో భాగంగా మే 11వ తేదీ నుంచి హౌస్ హోల్డ్ ఎన్యుమరేషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. కాబట్టి, ఇందులో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్( హెచ్ ఎల్ బీ)లను గుర్తించడం అత్యంత



కీలకమని, కాబట్టి హెచ్ ఎల్ బి లను జాగ్రత్తగా తయారు చేయాలని ఆదేశించారు. హెచ్‌ఎల్బీ లను రూపొందించే క్రమంలో ఒక్క ఏరియా కూడా మిస్ కాకూడదని సూచించారు. అన్ని ఏరియాలు కవర్ అయ్యాయా లేదా అని క్రాస్ చెక్ చేసుకోవాలన్నారు.అదేవిధంగా, సెన్సెస్ ప్రక్రియలో పాల్గొనబోయే ఎన్యుమరేటర్లకి ఈనెల 18వ తేదీ నుంచి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. మూడు రోజులపాటు కొనసాగబోయే ఈ శిక్షణకు ఎన్యుమరేటర్లు అందరూ హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 17వ తేదీలోగా ఎన్యుమరేటర్లు అందరికీ శిక్షణకు వచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. వీరి శిక్షణ కోసం సంబంధిత ఛార్జ్ అధికారులు అన్ని ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించాలి ఉపాధి హామీ పథకంలో భాగంగా పని చేస్తున్న కూలీలకి పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కూలీలకి తప్పనిసరిగా త్రాగడానికి నీరు, నిలువ నీడ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి లేబర్ పని దినాలతో పాటు, ఇతర లక్ష్యాలను కూడా సకాలంలో సాధించాలని ఎంపిడిఓ లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, జెడ్పి సీఈఓ యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డిఆర్డిఓ ఉమాదేవి, సిపిఓ హరికృష్ణ, మాస్టర్ ట్రైనర్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర పిసిసి అధ్యక్షుడికి ఘన స్వాగతం

**కల్వకుర్తి, ఏప్రిల్ 7 (వు దయం) :**

రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ కల్వకుర్తి నియోజకవర్గ కడతాల, ఆమనగల్, వెల్దండ, కల్వకుర్తి పట్టణాల్లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, జూపల్లి భాస్కర రావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,, మాజీ ఎమ్మెల్యే వంశీచందర్ రెడ్డి, లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు భూపతి రెడ్డి, జిల్లా కార్యదర్శి మోతిలాల్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరి కిషన్ నాయక్, పర్వత్ రెడ్డి, సర్పంచులు మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, కేశముల కృష్ణ, రమేష్ ముదిరాజ్, అన్వర్ పాషా, ఉప సర్పంచ్ ఎర్ర శీను ముదిరాజ్, తోపాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## విద్యార్థినీలు కష్టపడి చదవాలి

- విద్యార్థినీలతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్ ,ఏప్రిల్ 7 (వుదయం ప్రతినిధి):**



విద్యార్థులు వారి మంచి భవిష్యత్తు, ఉన్నతమైన వృత్తి సాధన కోసం కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.హన్వాడ మండల కేంద్రంలోని హన్వాడ మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బి.సి. సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను,వేపూర్ మహాత్మా జ్యోతి బా పూలే తెలంగాణ బి.సి సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు.తొలుత హన్వాడ మహాత్మా జ్యోతి బా పూలే బి. సి.సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు .ఈ సందర్భంగా 7వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ ఇప్పటి నుంచే క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు.పాఠశాలలోని వంటగది నితనిఖీ చేసి కలెక్టర్ భోజనం నాణ్యత ను పరిశీలించారు. వంటగది శుభ్రంగా ఉండేటట్టు చూసుకోవాలని, భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని మరుగుదొడ్లను, డార్మిటరీని, తరగతి గదులను పరిశీలించారు. ముఖ్యంగా వేసవి కాలంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.అనంతరం హన్వాడ మండలంలోని పల్లెమోని కాలనీ సమీపంలో ఉన్న వేపూర్ బి. సి సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. అక్కడ 10వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ, ఈ రోజు వ్రాసిన ఎస్. ఎస్. సి బయాలజీ పరీక్ష పేపర్ ఎలా వచ్చింది, పరీక్షా ఎలా రాశారు? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఎస్.ఎస్. సి పబ్లిక్ పరీక్షలు విద్యార్థుల జీవితంలో ముఖ్యమైన తొలి మైలురాయి అని, అందుకు విద్యార్థులు కష్టపడి చదవాలని అన్నారు. పరీక్షలను భయం లేకుండా ఆత్మ విశ్వాసంతో రాయాలని సూచించారు.విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి గురించి కూడా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. హీమోగ్లోబిన్ స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షిస్తున్నారా అని అడిగారు. మంచి ఆరోగ్యానికి ఆకుకూరలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవాలని, అవి ఐరన్, కాల్షియం, ప్రోటీన్లను అందిస్తాయని తెలిపారు. పాఠశాలలోని డార్మిటరీని పరిశీలించి వేసవి లో ఇబ్బంది లేకుండా ఫ్యాన్ లు అవసరమైతే అదనంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదినీ , స్టోర్ రూమ్‌ను పరిశీలించి బియ్యం, గుడ్ల నిల్వలను కూడా తనిఖీ చేశారు.బోజన నాణ్యత పరిశీలించి తదనంతరం కలెక్టర్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

## ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలి

**ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు**





- స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్న కలెక్టర్
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**వుదయం, మెదక్ (ఏప్రిల్ 07):**

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హవేలీఘనాపూర్ మండలంలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కేంద్రాన్ని సందర్శించి, పలు ఆరోగ్య పరీక్షలు స్వయంగా చేయించుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "Together for Health - Stand With Science" అనే థీమ్‌ను ప్రస్తావిస్తూ, ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధుల లేమి మాత్రమే కాకుండా శారీరక, మానసిక, సామాజిక సంక్షేమం కలగలిపిన సమగ్ర స్థితి అని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సమతుల ఆహారం తీసుకోవడం, నియమిత వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించి, మిల్లెట్ ఆహారం, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని పేర్కొన్నారు.అలాగే మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉందని, ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం వంటి పద్ధతులను అనుసరించాలని తెలిపారు.సీజనల్ వ్యాధులు, జీవనశైలి సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని, ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్, స్థానిక సర్పంచ్, పిహెచ్సి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డిసిసి ఉపాధ్యక్షులుగా ఎన్నం భూపతిరెడ్డి

**కల్వకుర్తి ,ఏప్రిల్ 7 (వు దయం )**

జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులుగా వెల్దండ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు భూపతిరెడ్డి, కార్యదర్శిగా మోతిలాల్ నాయక్, శంకర్ నాయక్ లు నియమితులయ్యారు ఈ మేరకు జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు ఈ మేరకు జిల్లా నియోజకవర్గ, మండలాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## గుమ్మడిదల సర్వే నెంబర్ 109 రైతులకు వంద గజాల స్థలం ఇవ్వాల్సిందే

- అన్నారం రైతుల భూములు లాక్కుంటే ఉద్యమమే..
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..

**పటాన్చెరు (వుదయం ):**



రైతు ప్రభుత్వం అంటూ ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. గుమ్మడిదల, అన్నారం రైతుల విషయంలో పక్షపాత వైఖరిని అవలంబిస్తూ.. వారి పాలిట ఆశనిపాతంగా మారుతోందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు.గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నంబర్ 109 లో గల 140 మంది రైతులకు సంబంధించిన 160 ఎకరాలను గత సంవత్సరం TGIIC కి ప్రభుత్వం కేటాయించింది. ఆ సమయంలో నష్టపరిహారంతో పాటు 100 గజాల ఇళ్ల స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చిన.. నేటి వరకు అమలుకావడం లేదంటూ మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ భూములు సేకరించే సమయంలో అప్పటి కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు భూములు కోల్పోయిన 140 మంది రైతులకు 100 గజాలు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాల్సిందేనని అన్నారు. ఇళ్ల స్థలాల కోసం 5 ఎకరాలు సైతం ప్రత్యేకంగా కేటాయించారని రైతులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ తో చర్చించి.. ప్రతి రైతుకి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా అన్నారం పరిధిలోని సర్వేనెంబర్ 261లో 117 మంది పేద రైతులకు సంబంధించిన 117 ఎకరాల అసైన్డ్ భూములను పరిశ్రమలకు కేటాయించే నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, షేక్ హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

## ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందేలా పని చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, (వుదయం ప్రతినిధి)** జూలపల్లి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జూలపల్లి మండలంలోని తెలుకుంట గ్రామంలోని కేజీబీవీ పాఠశాల, కళాశాల, పెద్దాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్, జూలపల్లి తహసిల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి.హెచ్.సి.)లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,కేజీబీవీలో విద్యార్థినులతో ముచ్చటించి, విద్యా బోధన, భోజన నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నాయా అని విచారించగా, ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు.పెద్దాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ లో వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వంట సిబ్బంది ఆరోగ్యకరమైన, పోషకాహారంతో కూడిన ఆహారం సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. జూలపల్లి తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. భూ భారతి దరఖాస్తులను సమయానికి డిస్పోజ్ చేయాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను స్లాట్ వారీగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు సేవలందించడంలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ వివరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా ఓపీ సమయాల్లో వైద్యులు తప్పనిసరిగా హాజరై ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ , అధికారులు పాల్గొన్నారు.



## ఆరోపణలు అవాస్తవం: స్పందించిన భార్యాభర్తలు

**పెద్దపల్లి, (వుదయం ప్రతినిధి)** పెద్దపల్లిలో ఇటీవల తమపై జరుగుతున్న ఆరోపణలు, బ్యానర్లలో చేసిన ప్రచారం పూర్తిగా అవాస్తవమని తోడేటి బాపు, సంధ్య తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తూ తమ కుటుంబ ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. డబ్బుల వ్యవహారంలో కూడా ఒకసారి రూ.34 లక్షలు, మరోసారి రూ.43 లక్షలు అంటూ భిన్నంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మమ్మల్ని, మా కుటుంబాన్ని చెడుగా చూపించేందుకు ఇలా దిగజారి తప్పుడు ప్రచారం చేస్తున్నారు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.రియల్ ఎస్టేట్, బంగారం స్కీమ్ పేరుతో మోసం చేశామన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఖండించారు. తమ వద్ద అన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయని, నిజాన్ని బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మా పరువు తీసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తోడేటి బాబు, సంధ్య కోరారు. అసత్య ప్రచారం కొనసాగిస్తే పరువు నష్టం దావా వేయడమే కాకుండా, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అలాగే వారు చేసిన తప్పుకు తమ కుటుంబానికి అందరి ముందు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒద్దం చిన్నయ్య, ఒద్దం స్వరూప, కట్ల సరిత, జానకీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## లైన్ మెన్ ను పరామర్శించిన మేయర్

**కరీంనగర్ (వుదయం ప్రతినిధి):** వీధి దీపాల నిర్వహణ విధుల్లో గత పది రోజుల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన లైన్ మెన్ శివను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మరోసారి పరామర్శించారు. కరీంనగర్ లోని ప్రైవేటు ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న శివను, వారి తల్లిదండ్రులను ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. లైన్ మెన్ శివ ఆరోగ్య పరిస్థితి గాయలకు అందుతున్న వైద్య సేవల గురించి డాక్టర్ తో మేయర్ కొలగాని శ్రీనివాస్ చర్చించారు. మెరుగైన వైద్యం అందించాలని, అవసరాన్ని బట్టి ఉన్నత స్థాయి చికిత్సకు ఏర్పాట్లు చేయాలని వైద్యులకు సూచించారు. దీంతో వైద్యులు శివ ఆరోగ్యానికి ఎలాంటి ప్రమాదం లేదని ప్రస్తుతం గాయాలకు మెరుగైన చికిత్స అందించామని, గాయాలు పూర్తిగా మానే వరకు చికిత్స అందిస్తామని మేయర్, కమీషనర్ కు తెలిపారు. ఈ రోజు హాస్పిటల్ నుండి డి చార్జ్ చేస్తున్నామని వైద్యులు తెలుపడంతో చికిత్స ఖర్చులు డి చార్జ్ విషయంపై మేయర్ కొలగాని శ్రీనివాస్ డాక్టర్ తో చర్చించారు. హాస్పిటల్ వైద్య ఖర్చులను నగరపాలక సంస్థ ద్వారా చెల్లించడం జరుగుతుందని డాక్టర్ కు సూచించారు. అనంతరం బాధితుడి తల్లిదండ్రులతో మేయర్ మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, శివ పూర్తి స్థాయిలో కుదుటపడే వరకు అండగా ఉంటామని బరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి పని చేస్తున్న సిబ్బంది భద్రత తమకు ముఖ్యమని పేర్కొన్నారు. శివ కోలుకునే వరకు మున్సిపల్ యంత్రాంగం అన్ని విధాలా అండగా ఉంటుందని, అతనికి రావలసిన సహాయ సహకారాలను త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యం పూర్తిగా కోలుకునే వరకు కుటుంబానికి భారం కలగకుండా యథావిధిగా జీతం చెల్లిస్తామని, వైద్య ఖర్చులు అందిస్తామన్నారు. నగరపాలక సంస్థ వీధి దీపాల నిర్వాహణ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పనిచేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శివ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్పొరేటర్లు మేకల వెంకటేష్, చంద్రా మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**సిర్పూర్ (టి) (వుదయం ప్రతినిధి)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండల కేంద్రంలోని సీడీపీఓ ఆఫీసు ప్రాంగణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు మరియు పిల్లలకు ఏకరూప దుస్తులను పంపిణీ చేసిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్ల మరియు ఆయాల గౌరవ వేతనం పెంచాలని తాను అసెంబ్లీలో డిమాండ్ చేశానని, ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపడుతుందని తెలిపారు. సీడీపిఓ విజయలక్ష్మి, సూపర్ వైజర్ పద్మ, ఎమ్మార్వో రహీముద్దీన్, ఎంపీడీఓ సత్యనారాయణ, సంతోష్, బాలాజీ, బాబు, మహేష్, రంగన్న పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాలను
# తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)**

కరీంనగర్ లో మంగళవారం పలు 10వ తరగతి పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం తనిఖీ చేశారు. తిరుమల్ నగర్ లోని తెలంగాణ మైనారిటీ బాలికల స్కూలు 2 , కోతి రాంపూర్ లోని సవరన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్ష రాసే విధానాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణ విద్యార్థుల హాజరు అంశాలపై విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు.



## విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలి

**మంచిర్యాల / (వుదయం ప్రతినిధి)** ప్రభుత్వ పాఠశాలను, సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పారిశుద్ధ్య నిర్వహణ, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ బలోపేతం దిశగా అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధన దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ప్రిన్సిపల్ కు సూచించారు. పోచంపహాడ్ గ్రామం పరిధిలో మండల తహసిల్దార్ పుష్పలతతో కలిసి జాతీయ రహదారి 63 విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, వివిధ ధ్రువపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



## కస్తూర్బా బాలికల విద్యాలయంను సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్ ఏప్రిల్ 07:** వర్ని మండలం కోటయ్య క్యాంపులో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు సిద్ధం చేసిన మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలు నిశితంగా పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రత పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించకూడదని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అనంతరం 7వ తరగతి గదిని కలెక్టర్ సందర్శించి, విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని, అదే సమయంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన ఫర్నీచర్ కేటాయిస్తామని అన్నారు. వంటగది పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ విద్యాలయానికి నూతన భవనం మంజూరైనందున వెంటనే పనులు ప్రారంభం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నూతన భవన నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**నిజామాబాద్, ఏప్రిల్ 07:** మోపాల్ మండలం బోర్గాం (పి) గ్రామంలోని సాక్రెడ్ హార్ట్ అకాడమీ పాఠశాలలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? స్ట్రాంగ్ రూం నుండి ఎన్ని గంటలకు ప్రశ్న పత్రాలు కేంద్రానికి చేరుకున్నాయి, ఆ సమయంలో పోలీస్ ఎస్కార్ట్ ఉందా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వసతి, ప్రథమ చికిత్స అందుబాటులో ఉందా? లేదా? అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని చీఫ్ సూపరింటెండెంట్ రమేష్ కు సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్లను అనుమతించకూడదని, అనవసర తప్పిదాలకు తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## కొనుగోలు కేంద్రం ప్రారంభం



**నాగిరెడ్డిపేట్,వుదయం** మండలంలోని మాసానిపల్లి గ్రామంలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ సునంద కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఐకెపి అధికారులు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యాసంగి సీజన్‌లో రైతులు ఆరునెలలు కష్టపడి పండించిన వరి పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ఇలా చేస్తే రైతులకు లాభదాయకమైన మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. బయట దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని హెచ్చరించారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా నిలుస్తూ, వారి సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రతి రైతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని విక్రయించాలని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచులు అంజాగౌడ్, విట్టల్, రైతులు బొల్లారం రాజు, మల్కారెడ్డి, కిష్టయ్య, నరేందర్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, మైపాల్ రెడ్డి, మల్లయ్య, భాస్కర్ రెడ్డి, బాలు, వినోద్, శ్రీనివాస్ తదితరులు, సీసీలు, వివోఏలు పాల్గొన్నారు.

# ఐదేళ్ల నిర్లక్ష్యం వేల కోట్ల బకాయిలు

**నాగిరెడ్డిపేట్,వుదయం** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య సాధారణ పరిపాలనా లోపం కాదు—ఇది ఇప్పుడు తీవ్రమైన సామాజిక సంక్షోభంగా మారింది. ఐదేళ్లుగా బకాయిలను విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమవడంతో ప్రైవేట్ విద్యాసంస్థలన్నీ ఏకతాటిపైకి రావడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, నర్సింగ్, లా కాలేజీలు ఒకే వేదికపైకి వచ్చి న్యాయపరమైన పోరాటానికి సిద్ధమవడం విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అసంతృప్తికి సూచిక.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు ₹10,000 కోట్లకు చేరువయ్యాయి. ఇందులో ఇంజనీరింగ్ కాలేజీలకే దాదాపు ₹7500 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వం విడుదల చేసిన ₹600 కోట్లు కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే—మూల సమస్యను తాకలేని స్థాయిలో ఉన్నాయి. కాలేజీలు సిబ్బందికి జీతాలు చెల్లించలేని దశకు చేరుకోవడం, విద్యా వ్యవస్థ క్రమంగా కుప్పకూలుతున్నదనే ప్రమాద సంకేతంగా కనిపిస్తోంది.ఇదే సమయంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు సమస్యను పరిష్కరించకపోగా విద్యార్థులపై మరింత భారం మోపేలా మారాయి. కాలేజీలకు అనుమతి ఇవ్వడం తీవ్ర ఆందోళనకు కారణమైంది. “తర్వాత ప్రభుత్వం చెల్లిస్తే తిరిగి ఇవ్వండి” అనే సూచన ఆచరణలో స్పష్టత లేకుండా విద్యార్థులపై అనిశ్చితిని మోపే నిర్ణయంగా మారింది.ఈ పరిస్థితి ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులపై తీవ్రమైన ప్రభావం చూపనుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడే సుమారు 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది—ఇది కేవలం సంఖ్య కాదు, లక్షల కుటుంబాల ఆశలపై పడిన భారమైన దెబ్బ.బకాయిలు విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రమైన ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికే 22 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లు వెలుగులోకి వస్తున్న సమాచారం పరిస్థితి ఎంత విషమంగా మారిందో తెలియజేస్తోంది. ఇది కేవలం గణాంకం కాదు—ప్రభుత్వ నిర్లక్ష్యం ఎంత తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుందో చూపించే ఘోర హెచ్చరిక. వెంటనే బకాయిలన్నీ విడుదల చేసి, విద్యార్థులపై పడుతున్న భారాన్ని తొలగించాలి. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి-యువజన ప్రజా మిలిటెంట్ పోరాట ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తాం. ప్రజాస్వామ్యపరమైన మార్గాల్లోనే కానీ తీవ్రంగా జరిగే ఉద్యమాల ద్వారా ప్రభుత్వం వైఖరిని మార్చే వరకు పోరాటం ఆగదు” అని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రయోగాల వేదిక కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించకపోతే ఈ సమస్య పెద్ద ఎత్తున సామాజిక ఉద్యమంగా మారడం ఖాయమని "ఆల్ ఇండియా డెమోక్రటిక్ యూత్ ఆర్గనైజేషన్(AIDYO) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు" కామ్రేడ్ దేవసోత్ శ్రీనివాస్ నాయక్ రాథోడ్ తీవ్రంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ప్రభుత్వ స్థలాలు పరిశీలించిన కలెక్టర్,ఎమ్మెల్యే

**మానకొండూర్ (వుదయం ప్రతినిధి)** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని అల్గునూరు, నల్లగొండ గ్రామాల్లో గల ప్రభుత్వ స్థలాలను మంగళవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. అల్గునూరు గ్రామంలో 4 ఎకరాలు, నల్లగొండలో 210 ఎకరాల ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. నివేశన స్థలాలు లేని నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇప్పించడమే కాకుండా వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ సొంతికలను సాకారం చేయాలనే సంకల్పంతో ఈ స్థలాల పరిశీలన చేశారు. అనువైన ప్రదేశాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను నిరుపేదలకు ఇచ్చేందుకు వీలుగా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరగా, ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించి అనుమతులు పొందేలా చూస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,



కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, తిమ్మాపూర్ తహశీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు ఎ.రమేశ్ యాదవ్, గోపు మల్లారెడ్డి, కంది లక్ష్మినారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి,చిందం కిష్టయ్య, పి.శ్రీకాంత్, నాగేందర్, తాళ్లపల్లి శ్రీనివాస్ రావు, నల్లగొండ సర్పంచ్ మారుతి వార్డు సభ్యులు పాల్గొన్నారు

## మధ్యవర్తులను నమ్మవద్దు
### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, (వుదయం ప్రతినిధి)** ప్రజల సమస్యల పరిష్కారానికి ఎటువంటి మధ్యవర్తులు అవసరం లేదని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సేవలు అందించే పేరుతో కొంతమంది మధ్యవర్తులు మోసాలకు పాల్పడుతున్నట్లు గమనించామని పేర్కొన్నారు.ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కొందరు వ్యక్తులు భూ భారతి సమస్యలు పరిష్కరిస్తామని, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు వంటి ప్రభుత్వ పథకాలలో ఎంపిక చేస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఇలాంటి వ్యక్తులకు ఎటువంటి అధికారిక గుర్తింపు లేదని, వారు ప్రజలను మోసం చేస్తున్నారని స్పష్టం చేశారు.ఎవరైనా సమస్య పరిష్కారం పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే ఒక్క పైసా కూడా ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు. అలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో నేరుగా జిల్లా కలెక్టర్ లేదా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు. అలాగే బుధవారం నుండి శుక్రవారం వరకు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కలెక్టర్ ప్రజలను కలుసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మధ్యవర్తులను నమ్మి డబ్బులు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## బట్టీ కార్మికుల చెమట చుక్కకు 'న్యాయ సేవ' ఆరోగ్య రక్ష!

**కరీంనగర్(వుదయం ప్రతినిధి):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వెలిచాలలోని ఇటుక బట్టీల వద్ద ఉచిత వైద్య శిబిరంతో పాటు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే. రాణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని సంస్థ సభ్యులు, న్యాయవాదులు పెరుక రంగయ్య పటేల్, ఏ. కిరణ్ కుమార్, చిట్టి చంద్ర ప్రకాష్ రెడ్డి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కే. ప్రసాద్, లేబర్ ఆఫీసర్ మొహమ్మద్ రఫీ మరియు వెలిచాల గ్రామ సర్పంచ్ వీర్ల నర్సింగ రావు, న్యాయవాది బండపల్లి శ్రీధర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికంలో ఉండి ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన ఇటుక బట్టీ కార్మికులకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ శిబిరంలో ఎముకల వ్యాధి నిపుణులు, శిశువైద్యులు, కంటి వైద్యులు మరియు మానసిక వైద్య నిపుణులు వందలాది మంది కార్మికులకు క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేయడమే కాకుండా కార్మికుల మానసిక ఒత్తిడిని తగ్గించడానికి సైకాలజిస్టుల ద్వారా ప్రత్యేక కౌన్సెలింగ్ అందించారు. వైద్య పరీక్షలతో పాటు కార్మికులకు ఉండాల్సిన చట్టపరమైన హక్కులు, కనీస వేతనాలు మరియు భద్రతా నియమాలపై న్యాయ నిపుణులు అవగాహన కల్పించారు. ఏదైనా కష్టం వస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్యులు భరత్ రాజ్, హారిక,వినీత్,మాధురి, మొహమ్మద్ హారీస్, ఫార్మసీ ఆఫీసర్ ప్రసాద్, నర్సింగ్ ఆఫీసర్ లు శ్రావణ్ కుమార్, ఉదయ్ కిరణ్, వెలిచాల మెడికల్ ఆఫీసర్ అశ్విత మరియు సిబిఆర్ ఇటుక బట్టీ యజమాని చిన్నకేశవులు, ఇటుక బట్టీ యజమానులు నారాయణ రావు, సురేందర్, అక్బర్, నవీన్ పాల్గొన్నారు.




## గౌడ సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ నూగిల్ల మల్లయ్యకుం సన్మానం

**పెద్దపల్లి (వుదయం ప్రతినిధి)** ఈరోజు పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ గుడి వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య గారిని అలాగే 12,13,31,32వ వార్డ్ కౌన్సిలర్ దొడ్డుపల్లి జగదీష్,పాగాల శ్రీకాంత్, మంథని నర్సింగ్,తిర్రి శ్రీలత రాజేందర్ గార్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు మొదటగా ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న చైర్మన్ మరియు కౌన్సిలర్లు ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు భూషణవేన సురేష్ గౌడ్ మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్తను గుర్తించి ఈరోజు మున్సిపల్ చైర్మన్ చేయడం మా ఎమ్మెల్యే విజ్జన్న గారు ప్రతి ఒక్కరికి నిదర్శనం అని కష్టపడ్డ వారికి కాంగ్రెస్ పార్టీలో అవకాశాలు రావడం ఇందుకు నిదర్శనమని అన్నారు చైర్మన్ నూగిల్ల మల్లన్న గారు ఎంతో నిజాయితీ గల వ్యక్తి అని వారు విజ్జన్న గారి నాయకత్వంలో పెద్దపల్లి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎల్లమ్మ గుడి ప్రాంగణానికి ప్రహరీ గోడ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు అలాగే మా తిలక్ నగర్ సంబంధించి నలుగురు కౌన్సిలకు ఈరోజు సన్మానం చేయడం సంతోషంగా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న గౌడ కులస్తులకు పెద్ద మనుషులకు మా యొక్క ధన్యవాదాలు తెలియజేశారు అనంతరం చైర్మన్ గారు మాట్లాడుతూ ఈరోజు ఎల్లమ్మ గుడి వద్ద గౌడ సంఘం కులస్తులు చైర్మన్ గా నన్ను మరియు నాతోటి కౌన్సిలర్లను సంబంధించిన సంతోషకరమని వారు కోరిన మేరకు ఎల్లమ్మ గుడి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి గౌరవ ఎమ్మెల్యే విజ్జన్న గారితో మాట్లాడి నిర్మాణాన్ని కృషి చేస్తానని అన్నారు సన్మాన కార్యక్రమం లో పాల్గొన్న కుల సంఘం నాయకులకు పెద్ద మనుషులకు ధన్యవాదాలు తెలియజేశారు నాయకులు తుదూరి చంద్రమౌళి గౌడ్ , తిర్రి సుధాకర్ గౌడ్ ,రేగుంట సురేష్ గౌడ్ ,భూషణవేన వేణు గౌడ్, శంకరయ్య గౌడ్,రేగుంట ప్రభాకర్ గౌడ్, తిర్రి సమ్మయ్య గౌడ్, రేగుంట రమేష్ గౌడ్, భూషణవేన రాజయ్య గౌడ్, కాయల శ్రీనివాస్ గౌడ్, తిర్రి రఘు గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## మానకొండూర్ రోడ్లకు మహర్దశ

**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)** రహదారుల దుస్థితిపై కలెక్టర్ తో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి పరిశీలనమానకొండూరు మండల కేంద్రం నుంచి శ్రీనివాస్ నగర్ మీదుగా జగ్గయ్యపల్లి, లింగాపూర్, వెల్ది, లక్ష్మీపూర్, వేగురుపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారిందని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఉద్దేశంతో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ఈ మార్గంలో పర్యటించి రోడ్ల దుస్థితిని పరిశీలించారు.మార్గమధ్యంలో దెబ్బతిన్న రోడ్లను, ప్రమాదకరంగా మారిన కల్వర్టులు, వంతెనలను వారు పరిశీలించారు. రోడ్ల దుస్థితిని ప్రత్యక్షంగా చూడటం వల్ల జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సమస్య తీవ్రతను గుర్తించి సమస్య నివారణకు సానుకూలత వ్యక్తం చేశారన్నారు. ఫలితంగా త్వరలోనే ఈ మార్గంలో కొత్త రోడ్లు వేసే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. దీంతో ఈ రోడ్లకు మహర్దశ పట్టే యోగం ఉందన్నారు. త్వరలోనే కొత్త రోడ్డు వేసేందుకు ప్రభుత్వపరంగా అనుమతి లభిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.



## పిఎన్‌బి కస్టమర్లకు అలర్ట్.. ఈ నెల 15 తర్వాత ఆ ఖాతాలు క్లోజ్!




పంజాబ్ నేషనల్ బ్యాంక్ కస్టమర్లకు బిగ్ అలర్ట్. మూడు సంవత్సరాలుగా ఎలాంటి ట్రాన్సాక్షన్స్ జరపని ఖాతాలు, జీరో బ్యాలెన్స్ ఉన్న అకౌంట్లను క్లోజ్ చేసేందుకు నిర్ణయం తీసుకుంది పంజాబ్ నేషనల్ బ్యాంక్. ఈ నెల 16వ తేదీ నుంచి ట్రాన్సాక్షన్ జరగని ఖాతాలను క్లోజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఖాతాలు ఇనాక్టివ్ గా ఉండటం వల్ల మోసాలు జరిగే ప్రమాదం పొంచి ఉందని ఈ సందర్భంగా వెల్లడించింది. ఒకవేళ వినియోగదారులు తమ అకౌంట్లు కొనసాగించాలని కుంటే ఈ నెల 15వ తేదీలోపు కేవైసీ అప్డేట్ చేసుకోవాలని సూచనలు చేసింది. దాంతో పాటు మనీ ట్రాన్జక్షన్స్ కూడా రెగ్యులర్ గా చేయాలని కోరింది. లేకపోతే ఖాతాలు మాత్రం క్లోజ్ చేయడం పక్కా అని వెల్లడించింది.






# యుద్ధ ప్రభావిత రంగాలకు మద్దతు ఇస్తాం

పశ్చిమాసియా సంక్షోభంతో, దేశీయంగా ప్రభావితమైన రంగాలకు మద్దతు ఇవ్వడానికి, మూలధన వ్యయాల్ని పెంచడానికి ప్రభుత్వానికి తగినంత ద్రవ్యపరమైన వెసులుబాటు ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం వెల్లడించారు. యుద్ధం వల్ల తలెత్తుతున్న పరిస్థితిని ఎదుర్కోవడానికి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లు మరింత తగ్గించేందుకు వీలుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకుండా మెరుగైన విధానాలు అనుసరించిన ఫలితం ఇప్పుడు కలిసొస్తోందని పేర్కొన్నారు. అధిక అప్పులు, భారీ ద్రవ్యలోటు కలిగిన అనేక దేశాలు ప్రస్తుత సంక్షోభ సమయంలో ఇబ్బంది పడుతున్నాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్‌ఐపీఎఫ్‌పీ) కార్యక్రమంలో మంత్రి వివరించారు. దశాబ్ద కాలంగా ద్రవ్య క్రమశిక్షణ పాటించినందునే.. ముడిచమురు ధర 50% పెరిగినా, మన దేశంలో డీజిల్, పెట్రోల్ రిటెయిల్ ధరలు పెంచలేదని, కీలక పెట్రో ఉత్పత్తులకు, దేశీయ టారిఫ్ ప్రాంతంలో పని చేసే ప్రత్యేక ఆర్థిక మండళ్ల (ఎస్ఈజెడ్)కు నిర్దిష్ట మినహాయింపులు ఇచ్చినట్లు వివరించారు. మార్చి 26న పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం తగ్గించడాన్నీ గుర్తు చేశారు. ఎగుమతులను నిరుత్సాహపరచి, దేశీయంగా సరఫరాల్లో కొరత లేకుండా చూసేందుకు డీజిల్‌పై లీటరుకు రూ.21.50, విమాన ఇంధనంపై లీటరుకు రూ.29.50 చొప్పున ఎగుమతి సుంకాన్ని విధించామన్నారు.

# భారత వృద్ధి అంచనాలకు కోత

ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇంధన వనరుల సరఫరాలో ఏర్పడిన ఆటంకాలతో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి తగ్గొచ్చని ఐసీఐసీఐ బ్యాంక్ ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో భారత జీడీపీని గతంలో అంచనా వేసిన 7.2 శాతం నుంచి 6.8-6.9 శాతానికి తగ్గిస్తున్నట్టు పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, సరఫరా గొలుసులో తలెత్తిన అవరోధాలు దేశీయ ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా పారిశ్రామిక రంగానికి అవసరమైన ఇంధన సరఫరాపై ఈ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఉపారిశ్రామిక ఇంధన సరఫరాపై ఆంక్షలు ఉన్నందున, గృహ అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనివల్ల ఎరువులు, సిరామిక్స్, లోహాలు, గాజు వంటి రంగాల ఉత్పత్తి ప్రభావితమయ్యే అవకాశం ఉంది'' అని ఐసీఐసీఐ బ్యాంక్ నివేదిక స్పష్టం చేసింది. గతంలో 2022లో ఇంధన ధరలు పెరిగినప్పుడు తయారీ రంగం ఏ విధంగా మందగించిందో గుర్తు చేసింది. ప్రస్తుతం మార్చి నెల తయారీ పీఎంఐ 53.9కి పడిపోవడం తక్షణ ప్రభావానికి నిదర్శనమని పేర్కొంది.విదేశీ వాణిజ్యం, చమురు ధరల ప్రభావంపై ఐసీఐసీఐ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది. చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల వద్ద కొనసాగడం వృద్ధికి ప్రతికూలమని తెలిపింది. చమురు ధరలు 111 డాలర్ల వద్ద ఉన్నప్పుడు (2012-14) వాస్తవ జీడీపీ 5.7 శాతానికి పడిపోయిన విషయాన్ని గుర్తు చేసింది. ప్రస్తుతం సరఫరా




పరిమితులు హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం వల్ల ఎగుమతులు దెబ్బతినడం వంటి అంశాలు 2025-26లోని నాలుగో త్రైమాసికం, 2026-27లో మొదటి త్రైమాసికంపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఐసీఐసీఐ బ్యాంక్ తన నివేదికలో వెల్లడించింది. ఎగుమతుల్లో 15 శాతం వాటా ఉన్న గల్ఫ్ దేశాలకు రవాణా నిలిచిపోవడం కూడా ఈ వృద్ధి కోతకు మరో ప్రధాన కారణమని తెలిపింది.

# 2030కి మరో 25 లక్షల ఉద్యోగాలు




దేశీయ ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాల్లో 2030 నాటికి 20-25 లక్షల కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఉద్యోగ కన్సల్టెన్సీ సంస్థ అడెకో ఇండియా అంచనా వేసింది. ఈ రెండు రంగాలు సామర్థ్య-ఆధారిత వృద్ధి దశలోకి ప్రవేశిస్తున్నాయని పేర్కొంది. కార్మిక శక్తిలో 30-35% మందికి నైపుణ్యాల పునఃశ్చరణ అవసరమని తెలిపింది. ఆసుపత్రులు, ఆయుష్, వృద్ధుల సంరక్షణ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, డయాగ్నొస్టిక్స్, టెలిమెడిసిన్, క్లినికల్ పరిశోధన, పబ్లిక్ హెల్త్ సిస్టమ్స్ వంటి రంగాల్లో నియామకాలు ఎక్కువగా స్పెషలైజేషన్, టెక్నాలజీ నైపుణ్యాలున్న వారికి లభిస్తాయని నివేదిక వివరించింది. 100 మందికి పైగా క్లయింట్ల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు అడెక్కో తెలిపింది. విశ్వసనీయ మార్కెట్ పరిశోధన ఆధారాలు కూడా తోడయ్యాయి. ఈ నివేదిక ప్రకారం.. ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాల్లో వృద్ధి ఆర్థిక ప్రాబల్యంతో ముడిపడి ఉంటుంది. ఇది 2022లో జీడీపీలో 3.3 శాతంగా ఉండగా.. క్లినికల్ పరిశోధనా కార్యకలాపాలు, డిజిటల్ ఆరోగ్య స్వీకరణ, ఫార్మాస్యూటికల్ అభివృద్ధి, తయారీని ప్రపంచ వ్యాప్తంగా నిరంతరం అవుట్‌సోర్సింగ్ చేయడం వంటి వాటి మద్దతుతో 2030 నాటికి 5 శాతానికి చేరుకుంటుందని అడెక్కో ఇండియా అంచనా వేసింది. డయాగ్నొస్టిక్స్, ప్రివెంటివ్ హెల్త్‌కేర్, టెలిమెడిసిన్ వంటివి రెండో, మూడో అంచె పట్టణాలకూ విస్తరిస్తుండటంతో వీటికి గిరాకీలో 20-25% పెరుగుదల ఉంటుంది. సంక్లిష్ట జనరిక్స్, స్పెషాల్టీ థెరపీల, బయోలాజిక్స్ వైపు జరుగుతున్న మార్పునకు అనుగుణంగా, అధునాతన ఆర్ అండ్ డీ, రెగ్యులేటరీ ఉద్యోగాల కోసం నియామకాలు 25-30% పెరుగుతాయి. నియామకాల్లో 65-70% బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, చెన్నై, దిల్లీ-ఎన్‌సీఆర్‌లలోనే కేంద్రీకృతమై ఉంటాయి. ఆసుపత్రి నెట్‌వర్కులు, తయారీ క్లస్టర్‌లు, వికేంద్రీకృత డెలివరీ నమూనాల విస్తరణ మద్దతుతో పుణె, అహ్మదాబాద్, కోయంబత్తూర్ వంటి రెండో, మూడో అంచె నగరాల్లోనూ ఈ నియామకాలు క్రమంగా పెరుగుతున్నాయని అడెక్కో ఇండియా అసోసియేట్ డైరెక్టర్, హెడ్ ఆఫ్ సేల్స్-పర్మనెంట రిక్రూట్‌మెంట్ పీయుష్ సప్రూ వెల్లడించారు.

# ఎయిరిండియా సిఇఒ విల్సన్ రాజీనామా



ఎయిరిండియా సిఇఒ క్యాంప్‌బెల్ విల్సన్ రాజీనామా చేశారు. 2022 జనవరిలో టాటా గ్రూప్ ప్రభుత్వం నుండి ఎయిరిండియాను స్వాధీనం చేసుకుంది. 2022 మార్చిలో తలెత్తిన వివాదం నేపథ్యంలో, టర్కిష్ ఎయిర్‌లైన్స్ మాజీ చైర్మన్ ఇల్కర్ అయ్సి ఎయిరిండియా సిఇఒ పదవిని స్వీకరించేందుకు నిరాకరించడంతో అదే ఏడాది జులైలో విల్సన్ ఎయిరిండియా సిఇఒ, ఎండిగా నియమితులయ్యారు. విల్సన్ రాజీనామా చేయాలనే తన నిర్ణయాన్ని వ్యక్తం చేశారని, ఆ విషయాన్ని బోర్డుకు తెలిపారని, వెంటనే రాజీనామా చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. విల్సన్ పదవీకాలం 2027తో ముగియనున్నప్పటికీ.. ముందుగానే ఆయన రాజీనామా చేశారని అన్నారు. ఎయిరిండియా అనుబంధ సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ సింగ్ తన పదవీకాలం పూర్తి కావడంతో వైదొలిగారు. దీంతో ఈ ఏడాది మార్చి 19 నుండి ఆ పదవి ఖాళీగానే ఉంది. గతేడాది జూన్12న లండన్ వెళ్తున్న ఎయిరిండియా విమానం అహ్మదాబాద్ నుండి బయలుదేరిన కొద్దిసేపటికే కూలిపోయిన సంగతి తెలిసిందే. 242 మంది ప్రయాణికుల్లో ఒకరు మినహా మిగిలిన వారంతా ఆ ప్రమాదంలో మరణించారు. ఈ ఘటనపై విల్సన్ తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నారు.

# ట్రంప్ డెడ్‌లైన్ వేళ.. నష్టాల్లో దేశీయ మార్కెట్ సూచీలు




దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు మన సూచీలపై ప్రభావం చూపిస్తున్నాయి. ఉదయం 9.24 గంటల సమయంలో సెన్సెక్స్ 529 పాయింట్లు కోల్పోయి, 73,576 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 155 పాయింట్లు నష్టపోయి, 22,813 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్ ఒక దశలో 700 పాయింట్లకు పైగా కుంగింది. నిఫ్టీ సూచీలో హిందాల్కో, ఓఎన్‌జీసీ, విప్రో, కోల్ ఇండియా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఎటర్నల్, ఐషర్ మోటార్స్, ఎంఅండ్ఎం స్టాక్స్ నష్టాల్లో ఉన్నాయి. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువుకు కొన్ని గంటలే మిగిలి ఉన్నవేళ.. పశ్చిమాసియా యుద్ధం ఏ క్షణాన ఏ మలుపు తీసుకుంటుందోనన్న తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇరాన్‌ను ఒక్క రాత్రిలోనే మట్టుపెట్టగలమని ట్రంప్ పేర్కొనడంతో చమురు భయాలు మరోరోజు కొనసాగాయి. దాంతో ఒకబ్యారెల్ చమురు ధర 110డాలర్ల పైనే కొనసాగుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 93.07కి పడిపోయింది.




## హార్దిక్ వస్తున్నాడు.. రాయల్స్‌తో మ్యాచ్‌కు సిద్ధం



ముంబయి ఇండియన్స్ కెప్టెన్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య అనారోగ్యం నుంచి కోలుకున్నాడు. అనారోగ్యం కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో హార్దిక్ పాండ్య బరిలోకి దిగలేదు. హార్దిక్ పాండ్య లేని వేళ సూర్యకుమార్ యాదవ్ ముంబయి ఇండియన్స్ కెప్టెన్సీ పగ్గాలు చేపట్టాడు. ప్రస్తుతం కోలుకున్న పాండ్య.. ముంబయి ఇండియన్స్ తర్వాతి మ్యాచ్‌కు అందుబాటులో ఉండనున్నాడు. 'హార్దిక్ పాండ్య ఆరోగ్యంగా ఉన్నాడు. నెట్స్‌లో సాధన ప్రారంభించాడు. ప్రస్తుతం బాగున్నాడు. హార్దిక్ గాయం బారిన పడలేదు, అస్వస్థతకు లోనయ్యాడు. అందుకే గత మ్యాచ్‌కు అందుబాటులో లేడు' అని ముంబయి ఇండియన్స్ బౌలింగ్ కోచ్ పరాస్ తెలిపాడు. హార్దిక్ పాండ్య స్థానంలో దీపక్ చాహర్ తుది జట్టులో నిలిచాడు. ముంబయి ఇండియన్స్, రాజస్తాన్ రాయల్ మ్యాచ్ మంగళవారం జరుగనుంది.

# 'మనం ఏమైనా మొసాద్ ఏజెంట్లమా': ఫిడే తనిఖీలపై చెస్ స్టార్ నకమురా ఫైర్



అంతర్జాతీయ చెస్ సమాఖ్య నిర్వహిస్తున్న 'కాండిడేట్స్ టోర్నమెంట్' ఘాటు వ్యాఖ్యలకు కేంద్ర బిందువుగా మారింది. టోర్నీ సందర్భంగా అమలు చేస్తున్న కఠినమైన భద్రతా తనిఖీలపై అమెరికన్ చెస్ దిగ్గజం హికారు నకమురా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆటగాళ్లపై జరుగుతున్న సోదాలను ఆయన ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ 'మొసాద్' (ఓనీబబజీట) నిర్వహించే ఆపరేషన్లతో పోల్చడం ఇప్పుడు క్రీడా లోకంలో చర్చనీయాంశంగా మారింది. చెస్ క్రీడలో టెక్నాలజీ సాయంతో జరిగే మోసాలను అరికట్టడానికి ఫిడే ఈసారి నిబంధనలను కఠినతరం చేసింది. ఆటగాళ్లు హాల్‌లోకి వెళ్లేటప్పుడు, బయటకు వచ్చేటప్పుడు మెటల్ డిటెక్టర్లు, బాడీ స్కానర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. దీనిపై నకమురా స్పందిస్తూ.. 'ప్రతిసారీ ఇలాంటి స్కానింగ్‌లు ఏంటి..? మనం ఏమైనా ఇరాన్‌లోకి చొరబడిన 'మొసాద్' ఏజెంట్లమా..? మనం కేవలం చెస్ ప్లేయర్లం మాత్రమే. కొంచెం వాస్తవికంగా ఆలోచించండి' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అయితే, నకమురా వ్యాఖ్యలపై భారతీయ చెస్ క్రీడాకారులు విభిన్నంగా స్పందించారు గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్ థిప్సే మాట్లాడుతూ.. చెస్ బోర్డుపై మోసం అనేది చాలా ప్రమాదకరమైనదని అన్నారు. చిన్న చిప్ సాయంతో ఎవరైనా ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించవచ్చని అన్నారు. అందుకు తనిఖీలు తప్పనిసరే కదా అని కామెంట్ చేశారు. అయితే, స్కానింగ్‌కు బదులుగా మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారాన్ని 30 నిమిషాలు ఆలస్యం చేస్తే మోసాలను మరింత సులభంగా అరికట్టవచ్చని ప్రవీణ్ థిప్సే ఆయన సూచించారు.

# ఐసీసీ అవార్డు రేసులో ముగ్గురిలో ఇద్దరు మనోళ్లే..




మార్చి నెలకు సంబంధించి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు కోసం భారత క్రికెటర్లు సంజూ శాంసన్, జస్ప్రిత్ బుమ్రా పోటీపడుతున్నారు. వీరితోపాటు సౌతాఫ్రికా ప్లేయర్ కానర్ ఎస్టర్‌హుయిజన్ కూడా రేసులో ఉన్నాడు. అవార్డు నామినీలను ఐసీసీ సోమవారం ప్రకటించింది. భారత జట్టు వరుసగా రెండో టీ20 వరల్డ్ కప్ గెలవడంలో శాంసన్, బుమ్రా కీలక పాత్ర పోషించారు. అందుకే వారు ఈ అవార్డుకు నామినేట్ అయ్యారు. శాంసన్ అయితే కెరీర్‌లోనే బెస్ట్ పర్ఫామెన్స్ ఇచ్చాడు. మార్చిలో జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టాడు. వెస్టిండీస్‌తో సూపర్-8 మ్యాచ్‌లో 97, సెస్‌లో ఇంగ్లాండ్‌పై 89, న్యూజిలాండ్‌తో ఫైనల్‌లో 89 రన్స్ చేశాడు. ఈ మ్యాచ్‌ల్లో కలిపి 275 రన్స్ చేశాడు. మరోవైపు, అవే మ్యాచ్‌ల్లో బుమ్రా కూడా రాణించాడు. విండీస్‌పై 2 వికెట్లు తీశాడు. ఇక, ఇంగ్లాండ్‌తో గేముల్లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన అతను 4 ఓవర్లలో ఒక్క వికెట్ తీసి 33 రన్సే ఇచ్చాడు. ఆ మ్యాచ్‌లో 16, 18 ఓవర్లలో 8, 6 పరుగులే ఇచ్చి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇక, కివీస్‌తో ఫైనల్‌లో 4 వికెట్లతో సత్తాచాటాడు. బుమ్రా 2024లో రెండు సార్లు మంత్లీ అవార్డు గెలిచాడు. ఈ అవార్డుకు నామినేట్ అవడం శాంసన్‌కు ఇదే తొలిసారి. మరోవైపు, సౌతాఫ్రికా బ్యాటర్ కానర్ ఎస్టర్‌హుయిజన్ న్యూజిలాండ్‌తో అరంగేట్ర టీ20 సిరీస్‌లోనే సత్తాచాటాడు. ఐదు మ్యాచ్‌ల్లో 200 రన్స్ చేశాడు. మహిళల విభాగంలో ఈ అవార్డు కోసం న్యూజిలాండ్ కెప్టెన్ అమేలియా కెర్, ఆస్ట్రేలియాకు చెందిన బెత్ మూనీ, సౌతాఫ్రికా బౌలర్ అయాబొంగా ఖాక నామినేట్ అయ్యారు.

# లక్ష్య, సింధు సాధిస్తారా?



ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌నకు రంగం సిద్ధమైంది. మంగళవారం ప్రారంభమయ్యే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో స్టార్ క్రీడాకారులు లక్ష్యసేన్, పి.వి.సింధుల సారథ్యంలో భారత్ తన అదృష్టం పరీక్షించుకోనుంది. ఆసియా టోర్నీ సింగిల్స్‌లో 61 ఏళ్ల క్రితం భారత్‌కు స్వర్ణం లభించగా.. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాలని లక్ష్య, సింధు భావిస్తున్నారు. 1965లో దినేశ్ ఖన్నా పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు పసిడి అందించాడు. ఇటీవల ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన లక్ష్యసేన్.. ఈ టోర్నీలో భారత్‌కు మరో బంగారు పతకం అందించాలని ఉవ్విళ్లూరుతున్నాడు. తొలి రౌండ్లో లీ చ్యుక్ యూ (హాంకాంగ్)తో లక్ష్య తలపడనున్నాడు. లో కీన్ యూ (సింగపూర్)తో కిదాంబి శ్రీకాంత్, లీ షై ఫెంగ్ (చైనా)తో ఆయుష్ శెట్టి, క్వాలిఫయర్‌తో హెచ్.ఎస్.ప్రణయ పోటీపడనున్నారు. మహిళల సింగిల్స్‌లో వాంగ్ లింగ్ చింగ్ (మలేసియా)తో సింధు తన పోరాటాన్ని ప్రారంభించనుంది. సుపనిద (థాయ్‌లాండ్)తో ఉన్నతి హుడా, లెట్షానా (మలేసియా)తో తన్విశర్మ, బుసానన్ (థాయ్‌లాండ్)తో మాళవిక బాన్సోద్ తలపడనున్నారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ టోర్నీ నుంచి తప్పుకొంది. సాత్విక్ భుజం గాయంతో బాధపడుతుండటంతో భారత జోడీ వైదొలగక తప్పలేదు.


# డీజీపీని కలిసిన 'ఓవరాల్ ఛాంపియన్' విజేతలు



మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఇటీవల ముగిసిన అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్ లో హ్యాట్రిక్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ పొందిన తెలంగాణ పోలీస్ ప్రతినిధులు డీజీపీ బి శివధర్‌రెడ్డిని సోమవారంనాడు డీజీపీ కార్యాలయంలో కలిశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్ర పోలీస్ బృందం, వరుసగా మూడో ఏడాది 'ఓవరాల్ ఛాంపియన్' ట్రోఫీని కైవసం చేసుకుని అద్భుతమైన హ్యాట్రిక్ సాధించిన విషయం విధితమే. 2023-24లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో, 2024-25లో జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన పోటీల్లోనూ విజేతగా నిలిచిన తెలంగాణ, ఇటీవల నాగ్‌పూర్ వేదికగా ముగిసిన డ్యూటీ మీట్ లో హ్యాట్రిక్ ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించింది. ఈ సందర్భంగా తనను కలిసిన విజేతలను, అధికారులను డీజీపీ బి. శివధర్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. సీఐడీ అడిషనల్ డీజీపీ చారుసిన్హా , కోచ్ లు డి. ప్రతాప్, ఎం. రామకృష్ణ , టీమ్ మేనేజర్ కె. ప్రసాద్ , వివిధ విభాగాల విజేతలు డీజీపీని కలిసిన వారిలో ఉన్నారు.

# చాంపియన్ పెగులా సోషల్ డియా మార్కెటింగ్

డిఫెండింగ్ చాంపియన్, అమెరికా క్రీడాకారిణి జెస్సికా పెగులా చార్లెస్టన్ ఓపెన్‌లో టిల్‌ను నిలబెట్టుకుంది.డబ్ల్యూటీఏ చార్లెస్టన్ ఓపెన్ మట్టి కోర్టులో దుమ్మురేపిన జెస్సికా పెగులా.. మహిళల సింగిల్స్ ఫైనల్లో ఉక్రెయిన్ అమ్మాయి యులియాపై మెరుపు విజయం సాధించింది. 82 నిమిషాల్లో ముగిసిన టిల్ ఫైట్‌లో 6-2, 6-2తో జెస్సికా పెగులా ఏకపక్ష విజయం సాధించింది. తొలి సెట్ ఐదో గేమ్‌లో తొలి బ్రేక్ పాయింట్ సాధించిన జెస్సికా.. యూలియా ఫోర్‌హ్యాండ్ తప్పిదంతో మ్యాచ్‌పై పట్టు బిగించింది. ఉక్రెయిన్ అమ్మాయి ఒత్తిడికి గురవగా.. మరో బ్రేక్ పాయింట్ సాధించిన పెగులా 3-2తో ముందంజ వేసింది. 4-2తో పైచేయి సాధించి.. డబుల్ బ్రేక్ పాయింట్లతో పెగులా అదరగొట్టింది. రెండో సెట్లోనూ దూకుడుగా ఆడిన పెగులా ఆరంభంలోనే యూలియా సర్వ్‌ను బ్రేక్ చేసింది. 2-0తో ముందంజ వేసింది. ఎదురుదాడి చేయటంలో యూలియా పూర్తిగా తేలిపోగా.. పెగులా 5-1తో టిల్‌ను ఖాయం చేసుకుంది. జెస్సికా పెగులా 3 ఏస్‌లు, ఐదు బ్రేక్ పాయింట్లు సాధించగా.. యూలియా ఓ ఏస్, ఓ బ్రేక్ సాధించింది. పాయింట్ల పరంగా 65-40తో జెస్సికా పెగులా తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది. మహిళల డబుల్స్ విభాగంలో అమెరికా జంట డిసైరె, కాటీ 6-3, 6-2తో ఫ్లెచ్, అనాలపై గెలుపొంది చాంపియన్స్‌గా నిలిచారు.



# వుదయం సినిమా
MOVIE TIME!


## ఈ రోజు చారిత్రాత్మక విజయ క్షణం



**వుదయం సినిమా:** కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసి, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గారి ఆమోదంతో అమరావతిని ఏకైక రాజధానిగా అధికారికంగా ప్రకటించింది. ఇది మన రైతుల త్యాగానికి, ప్రజల ఆశలకు, భవిష్యత్తు తరాల కలలకు లభించిన న్యాయం. అమరావతి ఇప్పుడు కేవలం ఒక నగరం కాదు - మన ఆత్మగౌరవానికి, మన భవిష్యత్తుకు ప్రతీక. ఈ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా - రాజధాని చిరకాల స్వప్నాన్ని సాకారం చేయడంలో సహకరించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గారికి, ప్రధాని నరేంద్ర మోదీ గారికి, హోంమంత్రి అమిత్ షా గారికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, అన్ని పార్టీలకు, పార్లమెంట్ సభ్యులందరికీ, మా వెన్నంటి నిలిచిన ప్రతి ఆంధ్రప్రదేశ్ పౌరునికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల సహనం, త్యాగం, నిబద్ధతే ఈ చారిత్రాత్మక క్షణానికి పునాది. వారికి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ చట్టబద్ధతతో పెట్టుబడిదారులకు భరోసా కలుగుతుంది. అమరావతి అజేయంగా, అజరామరంగా వెలుగొందుతుంది. మనందరం కలిసి అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుదాం.

## AA22 x A6
## ప్రీ లుక్ పోస్టర్ విడుదల







**వుదయం సినిమా:**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో సన్ పిక్చర్స్ అంతర్జాతీయ స్థాయిలో సినిమాని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ AA22 x A6 అంటూ ఇప్పటికే సోషల్ మీడియాలో ఓ ట్రెండ్ క్రియేట్ చేసింది. ఇక ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన అప్డేట్ అల్లు అర్జున్ బర్త్ డే (ఏప్రిల్ 8) సందర్భంగా అందరినీ ఆశ్చర్య పర్చబోతోంది. ఈ క్రమంలోనే తాజాగా AA22 x A6 ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రీ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

ఈ ఒక్క పోస్టర్‌తోనే మేకర్స్ ప్రేక్షకులు, సినీ లవర్స్‌లో ఎన్నో అనుమానాల్ని, ఉత్సుకతను రేకెత్తించారు. ఆ హ్యాండ్ ఎవరిది? ఆ ఆకారం ఏంటి? అది ఎందుకు అలా మారింది? కథ ఎలా ఉండబోతోంది? అని ఇలా అందరిలో రకరకాల ప్రశ్నల్ని లేవనెత్తింది. ఈ ఒక్క ప్రీ లుక్ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాని షేక్ చేసేస్తోంది. రేపు ఉదయం 11 గంటలకు అసలు సిసలు అప్డేట్ రాబోతోందని మేకర్లు ప్రకటించారు. టైటిల్‌తో పాటుగా హీరో ఫస్ట్ లుక్ పోస్టర్‌ని కూడా రేపు రివీల్ చేయబోతోన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ మూవీని ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఇక అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా సినిమాకు సంబంధించిన టైటిల్, పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో అభిమానుల్ని అలరించనున్నారు. సరికొత్త సినిమాటిక్ వరల్డ్ లోకి తీసుకు వెళ్లేలా ఈ చిత్రం ఉండబోతోందని టీం చెబుతోంది.

## కనక దుర్గ పూజా కార్యక్రమాలతో ప్రారంభం






**వుదయం సినిమా:**

తమిళ సినీ ఇండస్ట్రీలో విజయవంతమైన ప్రముఖ కంటెంట్ స్టూడియో అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అందులో భాగంగా టెంపుల్ టౌన్ పిక్చర్స్ తో కలిసి చేయబోతున్న సినిమా 'కనక దుర్గ'ను శనివారం రోజున పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. వెర్సటైల్ స్టార్ అల్లరి నరేష్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమాలో కాజల్ చౌదరి హీరోయిన్. ఈ సినిమాలో నటుడు సుబ్బరాజు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ భక్తి ప్రధాన కథా చిత్రానికి బి.వి. ఎస్. రవి కథ అందిస్తుండగా.. ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. సమీర్ నాయర్, దీపక్ సెహగల్, అజిత్ ఠాకూర్, బి.వి. ఎస్.రవి నిర్మాతలు. భారతీయ దేవతల ఆధారంగా ఒక దివ్యమైన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ఈ సినిమా భక్తి, యాక్షన్, భావోద్వేగాలు, సంగీతం ఇలా అన్ని అంశాలతో ప్రేక్షకులకు ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించనుంది. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో టెంపుల్ టౌన్ పిక్చర్స్ నిర్మాణంలో రూపొందుతోన్న ఈ సినిమా ఈ రెండు సంస్థలకు ఎంతో ప్రత్యేకమైనది.

కార్యక్రమంలో సురేఖ కొణిదెలతో పాటుగా ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, హరీష్ శంకర్, మిక్కిలినేని సుధాకర్, కోన వెంకట్, ప్రశాంత్ వర్మ, మధుర శ్రీధర్, స్వప్నాదత్, సుప్రియ, విద్యా కొప్పినీడు, పద్మ కస్తూరి రంగన్, అనురాధ గూడూరు, దివ్య విజయ్, హన్షిత రెడ్డి, జాన్వీ నారంగ్, స్రవంతి చొక్కారపు, వైఘా రెడ్డి, విరుప తదితరులు అతిథులుగా విచ్చేశారు. సినిమా భావాన్ని ప్రతిబింబిస్తూ పూజా కార్యక్రమం చివర్లో కనకదుర్గ అమ్మవారి దివ్య స్త్రీ శక్తిని ప్రత్యేకంగా స్మరించుకున్నారు. హాజరైన మహిళలు కలిసి అమ్మవారి శక్తి, కరుణ, మహిమలను గౌరవించారు.

## డైమండ్ డెకాయిట్
### మహిళలకు 4 షోలు ఉచితం



**వుదయం సినిమా :**

ఎం తో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కంప్లీట్ ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా "డైమండ్ డెకాయిట్" చిత్రం ఈ నెల ఏప్రిల్ 10న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఘనంగా థియేటర్లలో విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా దర్శకేంద్రుడు కే. రాఘవేంద్ర రావు ట్రైలర్‌ను వీక్షించి చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ ప్రత్యేక సందర్భంలో చిత్ర యూనిట్ మహిళా ప్రేక్షకులకు ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విడుదల కానున్న థియేటర్లలో 4 షోలు మహిళలకు ఉచితంగా ప్రదర్శించనున్నట్లు వెల్లడించింది. మహిళలు ఎక్కువ సంఖ్యలో థియేటర్లకు వచ్చి సినిమా ఆస్వాదించాలని చిత్ర బృందం కోరుతోంది. ఈ చిత్రంలో పార్థా గోపాల్ హీరోగా నటించడమే కాకుండా నిర్మాతగా వ్యవహరించగా, మేఘనా రెడ్డి హీరోయిన్‌గా నటించారు. రచయిత-దర్శకుడు సూర్య జి. యాదవ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం పూర్తి కుటుంబ వినోదంతో పాటు హృద్యమైన భావోద్వేగాలతో కూడిన ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కింది.

## తిమ్మరాజుపల్లి టీవీ
## 9న ట్రైలర్ రిలీజ్



**వుదయం సినిమా:**

న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా ట్రైలర్ రిలీజ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా ట్రైలర్ ఈనెల 9వ తేదీన రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సినిమా ట్రైలర్ పై మూవీ లవర్స్‌లో మంచి ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి.




## అహోం
## ప్రారంభోత్సవం

**వుదయం సినిమా:**

వివేక్ మిశ్రా, శృతిక జంటగా నటిస్తున్న సినిమా "అహోం". ఈ చిత్రాన్ని ఈగల్ ఐ స్టూడియో ఇంటర్నేషనల్ బ్యానర్ పై దశరథ్ నిర్మిస్తున్నారు. ప్రసాద్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా భాషల్లో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళంలో సినిమా తెరకెక్కనుంది. నిర్మాత కేఎస్ రామారావు, డైరెక్టర్ వి.వి.వినాయక్ ముఖ్య అతిథులుగా ఈ చిత్ర ప్రారంభోత్సవం నేడు హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. నిర్మాత కేఎస్ రామారావు మాట్లాడుతూ డైరెక్టర్ ప్రసాద్ రాజు మంచి అనుభవం ఉన్న వ్యక్తి. ఆయన దర్శకత్వంలో ఈ సినిమా పలు భాషల్లో రూపొందడం సంతోషంగా ఉంది. ఎందుకంటే ఈ రోజు సినిమా ఒక్క భాషలో చేస్తే వర్కవుట్ కావడం లేదు. హిందీతో పాటు దక్షిణాది అన్ని ప్రధాన భాషల్లో "అహోం" సినిమాను రూపొందిస్తున్నారు. బెంగాలీ, మరాఠీ వంటి భాషలతో పాటు ఈ చిత్రానికి ఇంగ్లీష్ లోనూ డబ్ చేయాలని సూచిస్తున్నా. నిర్మాత దశరథ్ గారికి కంగ్రాట్స్. కొత్త నిర్మాతలు బాగుంటేనే మరిన్ని చిత్రాలు తెరకెక్కి ఇండస్ట్రీ మీద ఆధారపడి ఉన్న వారికి ఉపాధి కల్పిస్తాయి. "అహోం" సినిమా మంచి విజయం సాధించాలని కోరుతున్నా. అన్నారు.

## నెట్‌ఫ్లిక్స్ లో దూసుకుపోతున్న సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసిని!



**వుదయం సినిమా:**

'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసిని' సినిమా నెట్‌ఫ్లిక్స్ లో టాప్ ఫైవ్ ట్రెండింగ్ లిస్టులో స్థానం సంపాదించి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. శివాజీ, లయ, రోహన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ కామెడీ చిత్రం గ్రామీణ నేపథ్యంలో ఒక సర్పంచ్ ఎదుర్కొనే రహస్యాలు, సవాళ్లను హాస్య రూపంలో చూపిస్తూ ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందిస్తుంది. నియమబద్ధమైన గ్రామాధికారి ఒక కుట్రలో చిక్కుకుని తన కుటుంబంతో కలిసి ఒక అనిశ్చిత ప్రయాణం చేయడం ద్వారా స్థానిక పోటీలు, రహస్యాలు బయటపడతాయి. ఈ చిత్రం థ్రిల్లర్ మరియు హాస్య అంశాలను సమతుల్యంగా మిళితం చేసి, ఆకర్షణీయమైన కథనంతో ఆద్యంతం ఆసక్తిని కొనసాగిస్తుంది. మార్చి 6న థియేటర్లలో విడుదలై మిశ్రమ స్పందనలు అందుకున్న ఈ సినిమా, ఏప్రిల్ 3 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కావడంతో ప్రపంచవ్యాప్తంగా దృష్టి సాధించింది. తెలుగులో మాత్రమే కాకుండా ఇతర భాషల్లోనూ అందుబాటులో ఉండటం విశేషం.

## సాయి శ్రీనివాస్ కావ్య రెడ్డి నిశ్చితార్థం





**వుదయం సినిమా:**

యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కావ్య రెడ్డి నిశ్చితార్థం హైదరాబాద్ శంకర్‌పల్లిలోని ఓ విశాలమైన ఫామ్‌హౌస్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో సినీ పరిశ్రమ మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. నిశ్చితార్థ వేడుకలో సాయి కావ్య జంట తమ ప్రత్యేక బంధాన్ని ప్రతిబింబించేలా కస్టమైజ్డ్ జువెలరీను ధరించారు. ఆ అందాన్ని మరింత పెంచుతూ వారి ఎంగేజ్‌మెంట్ లుక్స్‌ను ఢిల్లీకి చెందిన ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ అభిషేక్ శర్మ డిజైన్ చేశారు. సంప్రదాయం, ఆధునికత కలిసిన ఈ లుక్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. నిశ్చితార్థ వేడుకకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అభిమానులు, నెటిజన్లు సాయి కావ్య జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఒక్క చాన్స్ ప్లీజ్



**వుదయం సినిమా:**

"చిన్నప్పుడు ఒకసారి వినాయక చవితి ఉత్సవం సందర్భంగా స్టేజి ఎక్కి డాన్స్ చేశాను. అప్పుడు వినిపించిన ఈలలు చప్పట్లు ఇప్పటికీ నాకు గుర్తు. ఆ క్షణమే... ఎప్పటికైనా వెండి తెరపై నన్ను నేను చూసుకోవాలని ఆశపడ్డాను. ఒకసారి వచ్చిన ఒక మంచి ఛాన్స్ చేజేతులారా జారవిడుచుకున్నాను. కానీ ఇప్పుడు వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలనుకుంటున్నాను" అంటుంది పల్లవి గౌడ్.

కుటుంబ బాధ్యతల కారణంగా తనలోని కళాతృష్ణను ఇన్నాళ్లు తనలోనే అణచివేసుకున్న ఈ "అచ్చ తెలుగు తెలంగాణ ఆడపడుచు" ఇప్పుడిప్పుడు రీల్స్, ఫోక్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్‌తో తన ప్రతిభను చాటుకుంటూ సినిమా రంగం వైపు స్థిరంగా అడుగులు వేస్తోంది. ప్రముఖ దర్శకుడు కర్రి బాలాజీ రిఫరెన్స్ తో త్వరలో విడుదల కానున్న "హుషారు పిట్ట" చిత్రంతో పెద్దతరపై బుల్లి అడుగు వేసిన పల్లవి... ఈ రంగంలో తనకంటూ "చిన్న గుర్తింపు" తెచ్చుకోవాలని ఆశపడుతోంది. పల్లవిని ప్రోత్సహించాలనుకునే వారు 9160513151 నంబర్లో సంప్రదించవచ్చు.

## 17న గాలి రిలీజ్



**వుదయం సినిమా:**

సంధ్య ఫిలిం బ్యానర్ పై రాంప్రసాద్ గురజాడ, అంజలి రామవతు, శ్రీకాంత్ పెరుమండ్ల యస్. చంద్ర కళ, చందా రోజా రాణి, బివి సుబ్బారెడ్డి నటీనటులుగా నాటక రంగంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత మరియు నంది గరుడ వంటి అవార్డులు పొందిన టి రాము దర్శకత్వంలో నిర్మాత చందా లక్ష్మీనారాయణ నిర్మించిన సోషియో ఫాంటసీ చిత్రం "గాలి". ఇప్పటికే ఈ చిత్రం నుండి విడుదల చేసిన టీజర్, సాంగ్ లకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఈనెల 17న ప్రేక్షకుల ముందుకు విడుదల చేయడానికి సన్నహాలు చేస్తున్నాం..

## లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్



**వుదయం సినిమా:**

వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో అలరిస్తున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన క్రేజీ లవ్ స్టోరీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ చిత్రాన్ని నయనతార నిర్మించగా, కృతి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, యోగి బాబు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన తెలుగు టీజర్, ట్రైలర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. శ్రీ పద్మిని సినిమాస్ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఏప్రిల్ 10న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ శివప్రసాద్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. మొదట శ్రీరామ్‌తో మాత్ర సినిమా నిర్మించాం. తర్వాత రారాజా ప్రొడ్యూస్ చేశాం. సుహాసిని మణిరత్నం గారితో మహతి అనే సినిమా చేస్తున్నాం. ఆ సినిమా షూటింగ్‌లో ఇంకా 10% బ్యాలెన్స్ ఉంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. కచ్చితంగా మంచి సక్సెస్ అవుతుందని నమ్మకం ఉంది. దాదాపు 500 స్క్రీన్స్‌లో రిలీజ్ కానుంది. డిస్ట్రిబ్యూషన్ పరంగా మేము సేఫ్‌గా ఉన్నాం. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, ఫ్యూచర్ టెక్నాలజీ ఆధారంగా చేసుకుని డిజైన్ చేసిన స్టోరీ ఇది. టెక్నాలజీ హ్యూమన్ రిలేషన్స్, ఎమోషన్స్‌పై ప్రభావం చూపితే ఎలా ఉంటుందనే విషయం ఈ సినిమాలో ప్రధానంగా ఉంటుంది. టెక్నాలజీ కారణంగా మనుషుల మధ్య సంబంధాలు హార్ట్‌ఫుల్‌గా కాకుండా ఆర్టిఫిషియల్‌గా మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ప్రదీప్ రంగనాథన్ గారు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. అలాగే విగ్నేష్ శివన్ గారు కూడా అద్భుతమైన డైరెక్టర్. అనిరుధ్ రవిచందర్ గారి మ్యూజిక్ ఈ సినిమాకు మరో హైలైట్.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.